వేమన సమాలోచన
ప్రత్యేక సంచిక

సాహిత్య

# ప్రస్థానం

జూన్ 2017

వెల రూ. 10






సాహితీస్రవంతి

# ప్రజాకవి వేమన సాహితీ సమాలోచన రాష్ట్ర సదస్సు, అనంతపురం. 2017 ఏప్రిల్ 30






అధ్యక్షోపన్యాసం చేస్తున్న ఆహ్వానసంఘం అధ్యక్షులు డా॥ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి. | పల్లె రఘునాథ రెడ్డి | వై. ప్రభాకర చౌదరి | తెలకపల్లి రవి | కొలకలూరి ఇనాక్ | ఎన్. గోపి



గేయానంద్ | కత్తి నరసింహారెడ్డి | శాంతినారాయణ | మేడిపల్లి రవికుమార్ | కొలకలూరి మధుజ్యోతి | రాజారాం | షేక్ హుస్సేన్ సత్యాగ్ని



రాధేయ | కె. ఉషారాణి | ఏలూరి యంగన్న | వి. పోతన్న | ఆశావాది ప్రకాశరావు | మల్లెల నరసింహమూర్తి | సూర్యసాగర్ | సడ్లపల్లి చిదంబర రెడ్డి | కెరె జగదీశ్



ఎస్.డి.వి. అజీజ్ | పిళ్ళా కుమారస్వామి | కె. లక్ష్మయ్య | జంధ్యాల రఘుబాబు | హారప్రసాద్ | కెంగార మోహన్ | ఎం. ప్రగతి | రవిచంద్ర

చివరి లోపలి కవరులో మరికొన్ని ఫొటోలు

సాహిత్య ప్రస్థానం
జూన్ 2017
సంపుటి : 16 సంచిక : 6

# వేమన సంరంభం, సందేశం

ఒక సూర్యబింబం/ ఒక దీపస్తంభం/ ఒక జ్ఞానసంద్రం/ ఒక ధైర్య శిఖరం.. వేమన మన వేమన ఘన వేమన వినవేమన అంటూ ప్రజాకళాకారులు ఆడి పాడుతుంటే ఆదివారం(ఏప్రిల్30) అనంతపురం పరవశించి పోయింది. 400 ఏళ్ల తర్వాత కూడా ఒక కవి ప్రభావం ఇంత బలంగా వుంటుందా? అని ఆశ్చర్యం కలిగింది. ఇరు తెలుగు రాష్ట్రాల పరిశోధకులు, సాహిత్య, విద్యా, రాజకీయవేత్తల నుంచి నవయువత వరకూ పాల్గొని కాలాతీతుడైన వేమనకు వేనోళ్ల నివాళులర్పించారు. పాత కొత్త సంకలనాలూ పుస్తకాలు మొత్తం 14 ఆవిష్కరించబడ్డాయి. 1962లో గురజాడ శతజయంతి, 2010లో శ్రీశ్రీ శతజయంతి కొత్త వూపు నివ్వడం కళ్లారా చూశాం. వాళ్లకున్నట్టు తారీఖులు దస్తావేజులూ లేకున్నా వేమన తృతీయ ప్రస్థానం ప్రారంభమైంది.

ఆధిపత్యాలను అజ్ఞానాలను అధికారాలను ప్రశ్నించి – హేతుశీలత, మానవీయత, సామాజిక న్యాయం, ధిక్కార తత్వం, శ్రమ గౌరవం, ప్రతిఘటనల ప్రతిబింబమైన వేమన తన కాలం కన్నా చాలా చాలా ముందుకు నడిచాడు. మతతత్వం, విద్వేషం, చాందసత్వం, కుల వివక్ష వంటివి వెర్రితలలు వేస్తూ కొత్త రూపాలతో అధికార యంత్రం అండదండలతో చెలరేగిపోతున్న ఈనాడు ఆర్వీవారికినెల్ల ఒక్క కంచము పెట్టమన్న వేమన మరింత అవసరం. ప్రజా వ్యతిరేక పాలకులు ప్రచారార్భాటాలు చూస్తుంటే అల్పుడెపుడు పల్కు ఆడంబరముగాను మదిలో మెదులుతుంది – నిత్యానందుల మంటూనే హత్యా, రత్యానందులైన వారి వెకిలి కథలు వెలికి వస్తుంటే కపటస్వాములను కడిగేసిన వేమన సాక్షాత్కరిస్తాడు. రామ్‌దేవ్ బాబా పతంజలి సంస్థను ప్రధాని ఘనంగా ప్రారంభించిన నేపథ్యం చూస్తే నవీన స్వాములకు కలియుగ యోగులకు పాలకుల ప్రాపకాలు ఎంతగా వున్నాయో తెలుస్తుంది. నాలుగువందల ఏళ్లనాడే ఇలాటివాటిని నిలదీసిన ధీశాలి ధైర్యశాలి వేమనే. అనంతపురం జిల్లా కటారుపల్లిలో వేమనసమాధి చారిత్రికతపై సందేహాలు వున్నాయి గాని అక్కడ వేమన సజీవంగా వున్నారనడంలో సందేహం లేదు. తెలుగుదనమే కొడిగట్టి పోతున్న ఈ రోజున వేమనపద్యాలు దాన్నిబతికించే అమృత గుళికలుగా అక్కరకు వస్తాయి. రెండు తెలుగు ప్రభుత్వాలూ వేమన వారసత్వాన్ని మరింతగా కొత్తతరాలకు తెలియజేయడానికి చర్యలు తీసుకోవాలి. విద్యాలయాలూ ప్రజాసంస్థలూ జనావాసాలలో వేమన వాణిని వినిపించడానికి అందుకు సంబంధించిన సాహిత్యం జనానికి చేర్చడానికి కృషి జరగాలని కోరుకుందాం.

## ఈ సంచికలో ...

ఫలవంతమైన ప్రజాకవి వేమన సదస్సు ...... ..... .4
చరిత్రలో వేమన –వేమన చరిత్ర ....................... 8
మహాచైతన్య జ్వాల వేమన........................ ..... 15
తరగని సంపద వేమన పద్యాలు.... ................ 16
వేమన పద్యాలు పురివిప్పిన పునరుజ్జీవన దశ...... 17
రాజకీయ వ్యవస్థ వేమన చూపు..................... 19
వేమన కవిత్వం అభివ్యక్తి నైపుణ్యం ................. 25
వేమన రూపకం........................................ 33
వేమనపై పాటలు...................................... 36
తెలుగు ప్రజల చైతన్య బాహుబలి వేమన............ 38
పునరుజ్జీవన కాలంలో పుట్టాల్సిన కవి .............. 41
చారిత్రాత్మకం వేమన సాహితీ సమాలోచనం........ 41
వన్నె తగ్గని వేమన పదం.............................. 42
సత్యాన్వేషి వేమనపై లోతైన చర్చ.................... 43
వేయి వెలుగుల వేమన....... ....................... 44
అనంతపురంలో ఒక అద్భుతమైన దినమిది........ 46
మహాకవి కాక మరేమవుతాడు.......................... 47
వేమన ఇప్పటి అవసరం............................... 48
ఇది గొప్ప ప్రయత్నమే .......................... ...... 49
నేటికీ వేమనకు ప్రజాదరణ ......................... 50

సంపాదకవర్గం

తెలకపల్లి రవి (ప్రధాన సంపాదకుడు)
వొరప్రసాద్ (వర్కింగ్ ఎడిటర్)
కె. సత్యరంజన్ ◆ చీకటి దివాకర్
గనారా ◆ శమంతకమణి
◆ కెంగార మోహన్
కె.లక్ష్మయ్య, మేనేజర్

మనీ ఆర్డర్లు, రచనలు పంపించవలసిన చిరునామా:
ఎడిటర్, సాహిత్య ప్రస్థానం, ఎం.బి. విజ్ఞానకేంద్రం, డో.నెం. 27-30-4, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ - 520 002,
సెల్: 9490099059

హైదరాబాద్ చిరునామా
ఎం.హెచ్‌భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్ ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్ - 500 020

ఇ–మెయిల్ : ssprasthanam@gmail.com
www.prasthanam.com




# ఫలవంతమైన ప్రజాకవి వేమన సదస్సు

**- రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**
ప్రజాకవి వేమన సాహితీ సమాలోచన,
అనంతపురం రాష్ట్ర సదస్సు ఆహ్వాన సంఘం అధ్యక్షులు

***ఏప్రిల్ 30 నాటి వేమన సదస్సు ఫలవంతంగా ముగిసింది. రాయలసీమ సాహిత్యసభలలో ఈ సదస్సు చరిత్రనే సృష్టించింది. తెలకపల్లి రవిగారు రచించిన వేమన రూపకాన్ని ప్రజానాట్యమండలి కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు..... ఏప్రిల్ 29 సాయంకాలం సప్తగిరి కూడలిలో ఆ ప్రదర్శన జరిగింది. అదే రూపకాన్ని ఏప్రిల్ 30న ఫంక్షన్‌హాలులో ప్రదర్శించినప్పుడు డా. శాంతినారాయణ ఉపన్యాసాలు లేకపోయినా వేమన రూపకం చాలు. ఆయన భావాలు ప్రజలలోకి పోవడానికి అని అన్నారంటే దాని ప్రభావాన్ని అర్థం చేసుకోవచ్చు.***

సాహితీస్రవంతి రెండు దశాబ్దాలుగా తెలుగు సమాజంలో ఒక సాంస్కృతిక చైతన్యాన్ని తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నది. సాహిత్యశాలలు, జనకవనాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నది. ఆ కార్యక్రమాలలోంచి అనేకమంది రచయితలు, విమర్శకులు ఎదిగొచ్చారు కూడా. సాహితీస్రవంతి ఇటీవల కొంతకాలంగా గురజాడ, సివి, గుర్రం జాషువ, కుసుమ ధర్మన్న, గోరాల మీద వాళ్ళ నివాస స్థానాలలో సదస్సులు నిర్వహించి, ఆ సందర్భంగా ప్రజాశక్తి బుక్‌హౌస్ ద్వారా ఆయా రచయితల సమగ్ర రచనలు, వాళ్ళమీద విమర్శాగ్రంథాలు ప్రచురిస్తున్నది. ఈ వరుసలో ఏప్రిల్30న అనంతపురం, పాతవూరు, పద్మావతి ఫంక్షన్‌హాలులో ఒకరోజంతా 'ప్రజాకవి వేమన సాహితీ సమాలోచన' అనే సదస్సును నిర్వహించింది.

ఈ సదస్సుకు సంబంధించిన ఆలోచన ఏడెనిమిది నెలల నుండీ జరిగింది. దీనికోసం ఒక ఆహ్వానసంఘం ఏర్పాటు చేశారు. దీనికి నన్ను అధ్యక్షునిగా పెట్టుకున్నారు. నేను ఆ అధ్యక్షతను హోదాగా కాకుండా ఒక బాధ్యతగానే స్వీకరించాను. అయితే నా పాత్ర ఇందులో నామమాత్రమే. దాదాపు 250 ప్రజా, సాహితీసాంస్కృతిక సంఘాలు ఆహ్వానసంఘంలో ఉండి తోడ్పాటునిచ్చాయి. ఎంతోమంది వ్యక్తులు చేయూతనిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని భాషా, సాంస్కృతిక శాఖ, అనంతపురంలోని గ్రామీణాభివృద్ధి సంస్థ, నెయిల్ సంస్థ, అనేకమంది వదాన్యులు ఆర్థిక సహకారం అందించారు. ఆర్థిక వనరుల సమీకరణ సందర్భంలో నేను, కుమారస్వామి, రవిచంద్ర, సూర్యనారాయణరెడ్డి, అశ్వత్థరెడ్డి వంటి వాళ్ళం అనేక సంస్థల్ని కలిశాం. వ్యక్తుల్ని కలిశాం. అప్పుడు మేము రెండు మూడు అంశాలు గుర్తించాం. 1. ఏదో ఒక కార్యక్రమం పేరు చెప్పి డబ్బులు వసూలు చేసే సంఘాల మీద దాతలలో చాలా అసంతృప్తి ఉండడమే గాక, కొన్ని అనుమానాలు కూడా ఉండడం గమనించాం. 2. వేమనను ఒక కులానికి ప్రతినిధిని చేసి విరాళం ఇవ్వడం, ఇవ్వకపోవడం గమనించాం. 3. వేమనను గురించి ఇదివరకే

తెలిసిన సంప్రదాయవాదులైన దాతలు ఆయనలోని సంప్రదాయ వ్యతిరేకత వల్ల విరాళం ఇవ్వడానికి నిరాకరించడం, లేదా ఏదో కొంత విదిలించి చేతులు దులుపుకోవడం. ఇందులో మనం ఎవరినీ తప్పుబట్టలేం. తప్పుబడితే వ్యవస్థనే తప్పుబట్టాలి. దాతలే కాదు. ఇతరులు కూడా వేమన కార్యక్రమాన్ని కులం సులోచనాలలోంచి చూశారు. వాళ్ళనీ తప్పుబట్టలేం. ఇదలా ఉంచుదాం.

మొత్తంమీద ఏప్రిల్30 నాటి వేమన సదస్సు ఫలవంతంగా ముగిసింది. రాయలసీమ సాహిత్యసభలలో ఈ సదస్సు చరిత్రనే సృష్టించింది. తెలకపల్లి రవిగారు రచించిన వేమన రూపకాన్ని ప్రజానాట్యమండలి కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. 'వేమన' 'మనవేమన''ఘనవేమన' వంటి పదవిన్యాసంతో రవిగారు అద్భుతమైన పాటలు రాశారు. వేమన పద్యాలను వర్తమాన సాంఘిక ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులకు అన్వయిస్తూ రూపొందించిన ఫ్లెక్సీలు ధరించి కళాకారులు చేసిన ప్రదర్శన వేమన భావాలను ప్రేక్షకుల గుండెల్లో హత్తుకునేటట్టు చేసింది. ఏప్రిల్ 29 సాయంకాలం సప్తగిరి కూడలిలో ఆ ప్రదర్శన జరిగింది. అదే రూపకాన్ని ఏప్రిల్ 30న ఫంక్షన్‌హాలులో ప్రదర్శించినప్పుడు డా. శాంతినారాయణ ఉపన్యాసాలు లేకపోయినా వేమన రూపకం చాలు. ఆయన భావాలు ప్రజలలోకి పోవడానికి అని అన్నారంటే దాని ప్రభావాన్ని అర్థం చేసుకోవచ్చు.

50 మందితోనో, 100 మందితోనో ఒక చిన్న హాలులో ఒక చిన్న ఫ్లెక్సీ కట్టుకొని సభలు జరుపుకోడానికి అలవాటు పడినవాళ్ళం గనక, ఒకపెద్ద ఫంక్షన్‌హాలు (పూర్వపు సినిమాహాలు)లో పెద్దవేదిక మీద, చాలా పెద్దఫ్లెక్సీ ఏర్పాటుచేయడం చూసి, వేమనను కార్పోరేటీకరించారని కొందరు మిత్రులు చమత్కరించారు. ఆ సమయంలో మాధ్యమాలన్నీ బాహుబలి-2 ను గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. ఆ నేపథ్యంలో వేమన సదస్సును కూడా బాహుబలిగా వర్ణించిన మిత్రులున్నారు. వేమన సదస్సుకు బెంగుళూరు నుండి వి.ఎస్. రెడ్డి అనే 80 ఏళ్ళ పెద్దాయన వచ్చి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వేమన అకాడమీ స్థాపించాలని ప్రతిపాదించారు.

ఈ సదస్సులో అనంతపురం శాసనసభ్యులు శ్రీ వైకుంఠం ప్రభాకర చౌదరి గారు, అప్పటికి కొన్నిరోజుల ముందటిదాకా తెలుగు భాషా సాంస్కృతిక శాఖామాత్యులుగా ఉండిన డా॥ పల్లె రఘునాథరెడ్డి గారు అతిథులుగా వచ్చి సందేశాలిచ్చారు. ఆహ్వానసంఘంలో సభ్యులుగా ఉండిన ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు, వేమన పరిశోధకులు ఆచార్య ఎన్.గోపి గారు, వాళ్ళ ఇతర కార్యక్రమాలను రద్దు చేసుకొని వచ్చి ఈ సదస్సులో పాల్గొన్నారు. వాళ్ళు సభకు నిండుదనాన్ని తెచ్చారు.

ప్రజాశక్తి బుక్‌హౌస్ వాళ్ళు ప్రచురించిన 14 పుస్తకాలను పద్నాలుగు మంది అతిథులు ఒకేసారి ఆవిష్కరించారు. బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ కె. లక్ష్మయ్య గారు, సంపాదకులు కె. ఉషారాణి గారు, సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు వొరప్రసాద్ గారు ఈ పుస్తకాల ప్రచురణ విషయంలో అహోరహం కృషిచేశారు.

నేను అనంతపురానికి 1976లో వచ్చాను. నాలుగు దశాబ్దాలు దాటింది. జిల్లా రచయితల సంఘం ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహించుకున్నాం. ఇంకా అనేక సంస్థలు అనేక కార్యక్రమాలు నిర్వహించాయి. వాటి పరిణత రూపంగా వేమన సదస్సు రూపుదిద్దుకొంది.

వేమనను గురించి ఏమీ తెలియని శ్రోతలు కూడా ఈ సదస్సుకు వచ్చి నాలుగు వేమన పద్యాలు నోట్లోనో, గుండెలోనో వేసుకుని వెళ్ళి ఉంటారు. వేమన మీద రూపొందించిన ప్రసంగాలకు ఎక్కువ సమయం ఇవ్వలేకపోయాం. ఉన్నంతలో వక్తలు న్యాయం చేశారు. డా॥ ఆశావాది ప్రకాశరావు గారు వేమన పద్య పోటీలలో నెగ్గిన విజేతలకు బహుమతులందించడం విశేషం.

మధ్యాహ్నం భోజనంలో రాగిసంగటి, కోడికూర వడ్డించాం. అది రాయలసీమ వంట. వచ్చిన వాళ్ళందరూ ఆనందంగా తిన్నారు. మిత్రుడు నాగేంద్ర ఈ భోజన కార్యక్రమానికి బాధ్యత తీసుకున్నారు. ఐద్వా సోదరీమణులు శ్రోతలకు ఆహ్వానం పలికారు. అనేకమంది పెద్దల, స్నేహితుల సహకారంతో వేమన సదస్సు ఫలవంతమైంది.

చివరికేమి మిగిలినది?

వేమన ఈనాటి అవసరం అన్న జ్ఞానం మిగిలినది.

ఎలా?

17వ శతాబ్దం నాటి కవి వేమన 21వ శతాబ్దపు సమాజంతో ఎలా ప్రాసంగికత కలిగి ఉంటారు? ప్రాచీన తెలుగు కవులలో నేటి సమాజంతో సజీవ ప్రాసంగికత గల కవులలో వేమన మొదటివాడు. ఆయన ఆనాడు వేసిన ప్రశ్నలు నేటికీ సమాధానాలు చెప్పవలసినవి కావడమే ఇందుకు నిదర్శనం. కొన్నిటిని పరిశీలిద్దాం.

*హృదయమందున్న యీశుని దెలియక*
*శిలలకెల్ల మొక్కు జీవులార*
*శిలలనేమియుండు జీవులందే కాక*
*విశ్వదాభిరామ వినురవేమ!*

భగవంతుడు విగ్రహాలలో ఉన్నాడన్నది మత చరిత్రలో మధ్యయుగ విశ్వాసం. మనిషే దైవాన్ని తన రూపంలో సృష్టించడం చారిత్రక సత్యం. తాను సృష్టించిన దైవానికి మనిషి తానే బానిసై పోయి, విగ్రహాల ముందు మోకరిల్లడం ఒక విషాద పరిణామం. వేమన ఈశ్వరుడు అంటూ ఉంటే మనిషి హృదయంలోనే ఉన్నాడు. శిలలలో ఏ దేవుడూ లేడు అంటున్నాడు. శిలలనేమి యుండు! అనే ప్రశ్న ఇవాళ కూడా ప్రశ్నే. కొత్తకొత్త దేవుళ్ళు, స్వాములు, అవతార పురుషులు పుట్టుకొస్తున్నారు. దైవం ఇవాళ కార్పొరేటీకరణ చెందాడు. విగ్రహాలు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తూ, సామాజిక సంఘర్షణలు అధికమౌతున్న నేపథ్యంలో 'శిలలనేమి యుండు?' అన్న ప్రశ్నకు సమాధానం చెప్పవలసి ఉంది. విగ్రహారాధకులకు ఇలాంటివే వేమన అనేక ప్రశ్నలు వేశాడు చూడండి.

*శిలలు జూచి నరులు శివుడనిమెత్తురు*
*శిలలు శిలలుగాని శివుడు గాదు*
*తనదులోని శివుడు దానేల తెలియడో ॥ విశ్వ ॥*

*శిలను బ్రతిమ జేసి చీకటింటను బెట్టి*
*మ్రొక్కవలదు వెర్రి మూఢులార*
*ఉల్లమందు బ్రహ్మయుండుట దెలియదో ॥విశ్వ॥*

*తోలు కడుపులోన దొడ్డవాడుండగ*
*రాతిగుళ్ళలోన రాశిబోయ*
*రాళ్ళు దేవులైన రాసులు మ్రింగవా ॥విశ్వ॥*

*పలుగు రాళ్ళు దెచ్చి పరగ గుడులు గట్టి*
*చెలగి శిలలు సేవజేయనేల?*
*శిలలసేవజేయ ఫలమేమిగల్గురా॥విశ్వ॥*

గుళ్ళు గోపురాల నిర్మాణం ఇవాళ వ్యాపార రూపం సంతరించుకుంటున్నది. 104 ఉపగ్రహాలను ఒకేసారి ప్రయోగించే వైజ్ఞానిక సాంకేతిక విప్లవం ఒకవైపు కొనసాగుతుండగా, మరోవైపు ఆ వైజ్ఞానిక సాంకేతిక విప్లవ ఫలితాలైన భౌతిక సామాగ్రిని ఉపయోగించుకొని అశాస్త్రీయ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇది ఒక వైరుధ్యం. విగ్రహాల పేరుమీద యజ్ఞాలు, యాగాలు, పుష్కరాలు, పెండ్లిండ్లు, అభిషేకాలు చేయించే పాలకులు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.

*ఎద్దుకన్న దున్న యేలాగు తక్కువ*
*ఎరుపు లేకపోయి తరిగె విలువ*
*నేర్పెరుగని వాని నెరయోగి యందురా? ॥విశ్వ॥*


మనుషులను విభజిస్తున్న కులాన్ని కాలక్రమంలో పశువులకు కూడా పొడిగించారు కులవాదులు. పశువులలో కూడా ఎక్కువ తక్కువలు నిర్ణయించారు. ఒక పశువు పవిత్రమైంది, తక్కినవి పవిత్రమైనవి కాదంటూ జంతువిభజన చేస్తున్నారు. వేమన 17వ శతాబ్దంలోనే కులాలలో ఎక్కువతక్కువలు లేవని కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. అలాగే పశువుల మధ్య కూడా ఎక్కువ తక్కువలు లేవని ప్రకటించాడు. ఎద్దుకు దున్నపోతుకు మధ్య రంగు భేదమే ఉందని, దున్నపోతు నల్లగా ఉన్నంత మాత్రాన అది తక్కువ రకం కాదన్నాడు. పని సామర్థ్యం ప్రమాణం కావాలని ఆయన అభిప్రాయం. ఇప్పుడు జంతువుల మధ్య తేడాలు చూపిస్తూ మారణకాండ సృష్టిస్తున్న వాళ్ళు వేమనను చదవాలి.

*మాలవానినేల మరిమరి నిందింప*
*ఒడల రక్తమాంసమొకటిగాదె*
*వానిలోనమెలగు వానికులంబేది ॥విశ్వ॥*

శ్రమనే గాక శ్రామికుల్ని కూడా విభజించిన కులవ్యవస్థకు వేమన వేసిన ప్రశ్న ఇది. ఈ ప్రశ్నకు ఇవాళ కూడా సమాధానం చెప్పుకోవలసి ఉంది. దళితులు ఆర్థిక రాజకీయ సాంఘిక రంగాలలో అభివృద్ధిలోకి వస్తున్నా దళితుల పట్ల దళితేతరుల దృక్పథంలో మార్పు రావలసే ఉంది. గ్రామ సేవకులు మొదలుకొని దేశాధినేతల స్థాయిదాకా ఏ దళితుడు ఎదిగివచ్చినా వాళ్ళను దళితులుగానే చూస్తున్నారు. మనుషులుగా కాదు. కులస్పృహ ఇవాళ సజీవంగా ఉంది. కులస్పృహ భారతీయుల మెదళ్ళలోంచి తుడిచిపెట్టుకు పోయేదాకా వేమన ప్రశ్న సజీవంగానే ఉంటుంది. పైప్రశ్నకు కొనసాగింపే వేమన వేసిన క్రింది ప్రశ్న కూడా..

*కులము హెచ్చుతగ్గు గొడవలు పనిలేదు*
*సానుజాతమయ్యె సకల కులము*
*హెచ్చు తగ్గుమాట లెట్లెరుంగగ వచ్చు ॥విశ్వ॥*

మంత్రాలు చదివేవాళ్ళ కన్నా యేలపదాలు పాడేవాళ్ళు, యజ్ఞం చేసేవాళ్ళ కన్నా కుండలు చేసేవాళ్ళు, కవిత్వం రాసేవాళ్ళ కన్నా చెప్పులు కుట్టేవాళ్ళు తక్కువ వాళ్ళని ఎలా చెప్పగలవు! అని నిలదీశాడు వేమన. అజ్ఞానమూ, అశాస్త్రీయమూ అయిన మనువాదం ముందు వేమన వేసిన ప్రశ్నకు మనువాదమే సమాధానం చెప్పాలి.



# యోగి వేమన మహోన్నత వ్యక్తి

- ప్రభాకర్ చౌదరి, ఎం.ఎల్.ఏ., అనంతపురం

యోగి వేమన మనందరివాడు. చైతన్యాన్ని అందించినవాడు. ప్రతి సంవత్సరం ఇటువంటి కార్యక్రమాలు చేయాలి. నిరాక్షరాస్యులకు కూడా వేమన పద్యాలు అర్థమవుతాయి. అదే వేమన విశిష్టత. వేమన చెప్పిన చారిత్రక సత్యాలు భవిష్యత్ తరాలకు అందించడం మనందరి బాధ్యత. సమాజంలోని నిరక్షరాస్యులకు సైతం అర్థమయ్యే రీతిలో పదజాలాన్ని వుపయోగించడం ఆయనకే సాధ్యమైంది. వేమన పద్యాలు తెలుగు నేలను చైతన్య వంతంగా మార్చాయి. ఆర్థిక అసమానతలు, కక్షలు, కార్పణ్యాలు సమాజానికి ఎంతో హాని చేస్తాయని గుర్తించి హెచ్చరించిన వైతాళికుడు వేమన. వేమన భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్ళేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా చూస్తాను. వేమన సూక్తులు కావచ్చు, పద్యం కావచ్చు మన జీవితానికి చాల ఉపయోగ పడతాయి. సమాజంలో నేటికీ ఉన్న కొన్ని రుగ్మతలను ఆనాడే ఎత్తి చూపిన మహోన్నత వ్యక్తి వేమన. సమాజానికి వేమన నిత్య చిరస్మరణీయుడు. ప్రజాకవి వేమన సాహితీ సమాలోచన సదస్సు ఏర్పాటుచేసిన నిర్వాహకులకు అభినందనలు తెలియజేస్తున్నాను. ❋

---

*పిండములను జేసి పితరుల దలపోసి*
*కాకులకును బెట్ట గాడ్దెలార*
*పియ్యదినెడు కాకి పితరుడెట్లాయెరా ॥విశ్వ॥*

ఇది వేమన వేసిన వైజ్ఞానిక ప్రశ్న. మౌఢ్యం మాడును పగలగొట్టే ప్రశ్న. మామూలు సమయంలో అందరూ అసహ్యించుకొనే కాకిని పిండం పెట్టాల్సి వచ్చినప్పుడు అందరూ ఆహ్వానిస్తారు. పిండం పెట్టే సమయంలో పనికివచ్చిన కాకి, తక్కిన సమయాలలో ఎందుకు వివక్షకు గురౌతున్నది? పియ్యదినే కాకి పితరుడెట్లా అయింది? ఈ ప్రశ్నకు పిండప్రదానం చేసే వాళ్ళు, దానికి నాయకత్వం వహించేవాళ్ళు సమాధానం చెప్పాలి.

వేమన వేసిన అనేక ప్రశ్నలు పురోహితవర్గానికి వేసినవే. మతం పేరుమీద మానవజాతి చుట్టూ మౌఢ్యచక్రం తిప్పుతున్నది పురోహిత వర్గం. వేమన ఆ వర్గానికి అనేక ప్రశ్నలతో సవాలు విసిరాడు.

*గూబయెక్కినట్టి గురముపాడుగబెట్టి*
*వెళ్ళి పోదురెంత వెర్రివారు*
*గూబయేమిజేసె గురమేమి జేసును ॥విశ్వ॥*

గుడ్లగూబ ఇంట్లోకి వస్తే అరిష్టమని భావించి ఇల్లు ఖాళీ చేస్తారు. ఈ విషయంలో ఇల్లు ఏమి చేసింది? గుడ్లగూబ ఏమి చేసింది? ఇదే ప్రశ్న. మంచిచెడులు చెప్పి జనాన్ని భయపెట్టేవాళ్ళు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ఇలాంటిదే మరో ప్రశ్న వేశాడు వేమన.

*మంచి శకునములని యెంచి పెండిలియాడ*
*వార లొకరు లేరు వసుధలోన*
*జనుల కర్మములను శకునముల్ నిల్పునా? ॥విశ్వ॥*

శకునాలన్నీ చూసి పెండ్లిండ్లకు ముహూర్తాలు నిర్ణయిస్తే పెండ్లి చేసుకున్న వాళ్ళు అర్ధాంతరంగా ఎందుకు మరణిస్తున్నారు? అన్నది ప్రశ్న. శతమానం భవతి అనే దీవెన నిజం ఎందుకు కాలేకపోతున్నది? ఈ ప్రశ్నకు పురోహితవర్గం ఇంకా సమాధానం చెప్పాల్సి ఉంది.

వేమన ఇంకా అనేక ప్రశ్నలు వేశాడు. అవి భూస్వామ్య వ్యవస్థలో ఆయన వేసిన ప్రశ్నలు. ఇవాళ మనం పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉన్నా, భూస్వామ్య స్వభావం నశించలేదు. అందుకే వేమన ప్రశ్నలకు భూస్వామ్యవాదులు ఇంకా సమాధానం చెప్పవలసే ఉంది.

వేమన సాహిత్య సమాలోచనం వేమన సాహిత్యాన్ని మరోసారి పునర్మూల్యాంకనం చేయవలసిన అవసరాన్ని గుర్తుచేసింది. మన సమాజాన్ని వేమన మార్గంలో సంస్కరించుకొని పునర్నిర్మాణం చేసుకోవలసిన అవసరాన్ని కల్పించింది. ◆




# చరిత్రలో వేమన వేమన చరిత్ర

- తెలకపల్లి రవి

*వేమనతో పోల్చదగిన మరో ప్రజాకవి మనకు కనిపించరు. తమ తమ కోణాల్లో బాణీల్లో మహోన్నత శిఖరాలధిరోహించిన మహాకవులు కూడా ఆయన పదును ముందు పలుకుల ములుకుల ముందు నిలవడం కష్టం . అందులోనూ అన్ని రంగాలనూ సృశించిన వారు, అనుక్షణం గుర్తుకు వచ్చే శాశ్వత వాక్యాలు సృష్టించిన వారు మరిలేరు. తెలుగు భాషలో వేమన పద్యచరణాలు సామెతలుగా మారిపోయాయి. నానుడులుగా స్థిరపడిపోయాయి. ఎందుకంటే అవి జీవితంలోంచి వచ్చాయి.జీవితంలో నిల్చిపోయాయి. జీవితసత్యాలై పోయాయి.*

నాటికి నేటికీ తెలుగు వాడికీ వేడికీ వడికీ వరవడి వేమనే. ఆనాటికి బహుశా ఈనాటికి కూడా వేమనతో పోల్చదగిన మరో ప్రజాకవి మనకు కనిపించరు. తమ తమ కోణాల్లో బాణీల్లో మహోన్నత శిఖరాలధిరోహించిన మహాకవులు కూడా ఆయన పదును ముందు పలుకుల ములుకుల ముందు నిలవడం కష్టం . అందులోనూ అన్ని రంగాలనూ సృశించిన వారు, అనుక్షణం గుర్తుకు వచ్చే శాశ్వత వాక్యాలు సృష్టించిన వారు మరిలేరు. తెలుగు భాషలో వేమన పద్యచరణాలు సామెతలుగా మారిపోయాయి. నానుడులుగా స్థిరపడిపోయాయి. ఎందుకంటే అవి జీవితంలోంచి వచ్చాయి.జీవితంలో నిల్చిపోయాయి. జీవితసత్యాలై పోయాయి.

ఇన్ని తరాల పాటు తెలుగుజాతికి ౡత్తేజకారకంగా నిలిచిన వేమన పద్యాలు పాడేసుకుంటున్నాం.. వాడేసుకుంటున్నాం. కాని వాటి కర్త వేమన్న గురించి మనకు తెలిసిందెంత? తెలుసుకున్నదెంత? తెలుసుకోవాలనే ప్రయత్నమెంత?తెలిసిన దాన్ని తెలివిడితో ౡపయోగించినదెంత? అదైనా ఎంతకాలం తర్వాత? ఎంత కొద్ది మంది పరిశోధకులు, ఎంత పరిమితంగా ఆయనపై దృష్టిపెట్టారు? మరి మన నరాల్లో స్వరాల్లో భాగమై పోయిన ప్రజాకవి జీవితం పట్ల ఇంత అలసత్వం ఆలస్యం ఎందుకు ప్రదర్శితమైంది? ఈ ప్రశ్నలలోనే వేమన ఔన్నత్యం మనకు చాలా వరకూ తెలిసిపోతుంది.

మహామహోపాధ్యాయులు అనేకమందికి ఆయన పద్యాలు మరఫిరంగుల్లా తోచాయి. వాటిని చూడటానికే వెరచి సమాధి చేసేందుకు శాయశక్తులా ప్రయత్నం చేసి విఫలమైనారు. జాతిని జాగృతం చేసే జయపతాకల్లా ఆయన పద్యాలు దాచిపెట్టిన కొద్ది ధగధగలాడాయి. ఆయన జీవితం గురించి అవాస్తవాలు చెప్పిన కొద్ది అసలు విషయాలపై ఆసక్తి ప్రబలింది. సిపిబ్రౌన్‌తో సహా పాశ్చాత్య పరిశోధకులు, కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ,నార్ల వెంకటేశ్వరరావు, ఆరుద్ర,బంగోరె వంటి వాళ్లు అందరి కృషికి క్రోడీకరణగానే గాక అపురూప విషయ సేకరణకు కూడా ప్రతిరూపంగా ఎన్.గోపి వేమన సమగ్ర సందర్భనం చేయించారు. ౡన్న పరిమిత ఆధారాల ప్రాతిపదికన అధ్యయనాలు చేసి హేతుబద్ధమైన అవగాహన ఇవ్వగలిగారు.

వీటన్నిటి వెలుగులో వేమనను తెలుసుకోవడం ఇప్పుడు మనకు కొంత సులభంగా కనిపించవచ్చు. ఇందుకోసం వారు చేసిన చిరదీక్షా తపస్సమీక్షణకు ధన్యవాదాలు చెప్పి వేమన జీవితావరణంలో ప్రవేశిద్దాం. ఇప్పటికైనా వేమన ప్రభావంతో ప్రకాశంతో పోలిస్తే మనకు దొరికింది చెప్పుకుంటున్నది తక్కువేనన్న మెళకువ నిలుపుకొని పరిశోధనలు కొనసాగిస్తూ వుండాల్సిందే.

**కవి.. మనిషి ....కాలం , 1650 ప్రాంతం..**

వేమన అంటే వేమన పద్యాలే. ఎవరు వేమన, ఏవి వేమన పద్యాలు తేల్చడానికి చాలా కాలం పట్టింది. ఏవి పద్యాలో తేలితే గాని వాటినిబట్టి కాలనిర్ణయం,కర్త నిర్ణయం సాధ్యపడదు. అసలు ఇంత విస్తారంగా అనుకరణ పద్యాలు కూడా తనవే అనిపించేంత శక్తివంతంగా వచ్చాయంటే వేమన ప్రేరణ ప్రభావం ఎంత గొప్పవో తెలుస్తుంది. భావాలు ఘర్షించనంతవరకూ వాటిని వేమన పరంపరలో భాగంగా చూసేందుకు అభ్యంతరం వుండనవసరం లేదు. అయినా పరిశోధనల కోసం ప్రామాణీకరణ కోసం వాటి నిగ్గు తేల్చవలసిందే. ముఖ్యంగా శైలిని బట్టి , వాడిన పదాల చారిత్రికతను బట్టి పరిశోధకులు ఆ నిర్ధారణ చేశారు.

*పండితులూ పరిశోధకులందరూ ఇంచుమించుగా వేమన 1650 ప్రాంతాలలో వాడని తేల్చారు గనక ఆ కాలాన్నే ప్రామాణికంగా తీసుకోవచ్చు.*

అయితే ఇక్కడే ఇంకో విషయం చెప్పుకోవాలి.వేమన పద్యాలను ఇంత కాలం చీకట్లో అట్టిపెట్టిన వారు ఎన్ని అకృత్యాలకు పాల్పడి వుంటారో వూహించడం కష్టం కాదు. వూహించడం అవసరం కూడా. చార్వాకులు లోకాయతుల రచనలను వారి విమర్శకుల నుంచి తెలుసుకున్నట్టే వేమన ప్రతులను కూడా వ్యతిరేకుల గుప్పిటి నుంచి విడిపించాల్సి వచ్చింది. పరస్పర విరుద్ధంగా ఇలా వేమన చెప్పి వుంటాడా అనే సందేహం కలిగిన చోట్ల ఈ అంశం కూడా గమనంలో వుంచుకోవడం అవసరం. ఆ భావాలను సహించలేని వారు భాష్యాలు మార్చడానికి ప్రయత్నించి వుంటారనడంలో ఆశ్చర్యమేమీ లేదు. పండితులూ పరిశోధకులందరూ ఇంచుమించుగా వేమన 1650 ప్రాంతాలలో వాడని తేల్చారు గనక ఆ కాలాన్నే ప్రామాణికంగా తీసుకోవచ్చు.

ఇంతకూ వేమన ఏ కాలం వారు? దీనిపై ఎవరి అంచనాలు ఏమిటి?

| | |
|---|---|
| వంగూరి సుబ్బారావు | -1412-1480 |
| శేషాద్రి వెంకట రమణ కవులు | -1460-1600 |
| వేదం వెంకటకృష్ణ శర్మ | -1565-1625 |
| వేటూరి ప్రభాకరశాస్త్రి | -1650 |
| బండారు తమ్మయ్య | -1652-1725 |
| రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ | -1700 |
| ఎన్.గోపి | -1655 |

**దొరికిన ఆధారాలు.. తొలగిన అపోహలు**

ఇలా రకరకాల అంచనాలున్నా కొన్ని కొలబద్దలు కూడా దొరుకుతున్నాయి. వేమనకు సంబంధించిన సమాచారం పెద్దగా లేని తొలిరోజుల అంచనాలను పక్కనపెడితే తక్కిన వారంతా 17వ శతాబ్దినే తీసుకున్నారు.వేమన పద్యాలలో పర్షియా పదాల వాడకం కూడా ఇందుకు వూతమిస్తుంది. కాబట్టి దాన్నే ఖాయం చేశారు. ఇక వేమన రాయలసీమకు చెందిన వాడనే దానిపై భిన్నాభిప్రాయమే లేదు.ఆయన పూర్వీకులు కర్నూలు జిల్లాలో వున్నట్టు , ఆయనకు అనంతపురం కడపలతో సంబంధం వున్నట్టు తేల్చారు. అనంతపురం జిల్లా కటారుపల్లెలో వేమన సమాధి, ఏటేటా వుత్సవాలు చేస్తుంటారు గాని ఆ వేమన వేరు అని పరిశోధనలు సోదాహరణంగా తేల్చిచెప్పాయి. పరిశోధకుల సమయం సహనం చాలా వరకూ దానికే సరిపోయింది. స్థూలంగా 17వ శతాబ్దికి చెందిన రాయలసీమవాసిగా, విస్తృత సంచారజీవిగా కూడా ఆయనను చెప్పొచ్చు. కాబట్టి ఆ కాలపు పరిస్థితులు వ్యక్తులు ఆచార వ్యవహారాలు రాజకీయ పరిణామాలు తెలుసుకుంటే వేమన పద్యాలు అలా ఎందుకు వున్నాయో తెలుసుకోవచ్చు.

మొదటే చెప్పినట్టు వేమన గురించిన చలామణిలో వున్న చాలా కథలు కల్పితాలు. లేదా భక్తిపూరితమైన నమ్మకాలు. ముఖ్యంగా వేమన కొండవీటి రాజు సోదరుడుగా పుట్టాడని, విశ్వద అనే వేశ్య, అభిరాముడనే కంసాలి మిత్రుడు ఉండేవారని వారిద్దరి పేరునే మకుటంగా చేసుకున్నాడన్నది కట్టుకథేనని పరిశోధకులు తేల్చారు. కాని వేమన గురించిన సినిమాలు నాటకాలు,ఆఖరుకు నార్ల వంటివారు రాసిన సాధికార చరిత్రలు కూడా ఆ కథల చుట్టూనే తిరిగాయి. వేమన గురించే గాక చాలా మంది ప్రాచీన కవుల జీవితాల

గురించి పెద్దగా తెలియదు. వాటిపై ఇంతటి వూహాగానాలు చేసిన వారెవరూ లేరు. కాని వేమన జనప్రియుడు కావడం వల్లనే గాక ఆయన పద్యాస్త్రాల ప్రభావం తగ్గించేందుకు కూడా ఇలాటి కథలు ప్రచారంలో పెట్టారు. శ్రీనాథుడు, పోతన గురించి గాని తెనాలి రామలింగని గురించి గాని ఇలాటి కథలెన్ని లేవు? ఆ కారణంగా వారి రచనల విలువ తగ్గించలేదే? కాని వేమన విషయానికి వచ్చే సరికి చలామణిలోని పలు రకాల పద్యాలు ప్రస్తావించి ఆయనకు సంబంధించిన ఆధారాలు లేవు గనక స్పష్టంగా చెప్పలేమని తికమక పెడుతుంటారు. వేమనను కేవలం శతకకారుడుగా కుదించేయడం మరొకటి.. ఆయన ఒకే మకుటంతో ఆటవెలదులు రచించివుండొచ్చు. అంతమాత్రాన అంతటి ప్రభావశీల కవిని కేవలం శతక కవిగా ప్రకటించి కావ్య కవులకిచ్చే గౌరవం అవసరం లేదని తీసిపారేయడం ఎంత పొరబాటు?! వైతాళికుడు కందుకూరి వీరేశలింగంతో సహా ఎందరో మహామహులు ఇదే పొరబాటు చేయడానికి కారణాలేమిటి? నిజంగా ఆయన శతకం కావాలని రాశారా? లేక కొందరు పాటలు పాడినట్టే తను అలవోకగా ఆటవెలదులు వెలువరించారా? ఇదీ అసలైన ప్రశ్న. కొంతమేరకు(అది కూడా నీతి సూత్రాల వరకే) సుమతిని మినహాయిస్తే మరే తెలుగుకవి వేమనకు ప్రాచుర్యం తెచ్చిన ఒక పద్యంతో సరితూగ గలుగుతాడు? అంతటి శక్తివంతమైన రచనలను ఏదో సాంకేతిక నిర్వచనాలతో తక్కువ చేయడమెందుకు? వేమన పద్యం, కనీసం 'విశ్వదాభిరామ వినురవేమ' అన్న మకుటం వేమన్న పేరు తెలియని తెలుగు వారుంటారా? విశ్వద అన్న పదం కన్నడంలో విశ్వజనీనం అన్న దానికి పర్యాయపదమని చెప్పుకునే వివరణ సంతృప్తికరంగా వుంది. జగదభిరాముడు అన్న ప్రయోగం ప్రసిద్ధమేకదా అలాగే విశ్వదాభిరాముడు అని వుండొచ్చు. ఇక్కడ అభిరాముడంటే ఆసక్తుడనే. ఎందుకంటే రాముడిని ఆక్షేపిస్తూ వేమన రాసిన పద్యాలు ప్రసిద్ధమే.

*వేమన పద్యాలు ఇప్పటికీ మన నాలుకలపై నాట్యం చేస్తున్నాయంటే అవి ఈ నాటికి అన్వయించుకోగలిగిన వన్నమాట.*

కవులు రచయితలు ఎవరైనా సరే తమ దేశ కాలాలను బట్టి మాత్రమే రచనలు చేయగలుగుతారు. వేమన పద్యాలు ఇప్పటికీ మన నాలుకలపై నాట్యం చేస్తున్నాయంటే అవి ఈ నాటికి అన్వయించుకోగలిగిన వన్నమాట. అప్పటి పరిస్థితులు అనేకం ఇప్పటికీ మారకుండా కొనసాగుతున్నాయన్నమాట. మరి ముందుగా ఆ నేపథ్యాన్ని తెలుసుకుంటే తప్ప వేమన ఔన్నత్యం మనకు అర్థం కాదు. అత్యధికులు అంగీకరించిన 16 వ శతాబ్దినే వేమన కాలంగా అనుకుంటే అప్పటి పరిస్థితులేమిటి?

**విజయ నగర వైభవం..పాశ్చాత్య సంపర్కం, పతనం.. బహుమనీ విజయం..**

16వ శతాబ్దం తెలుగువారి చరిత్రలో అంతకు ముందెన్నడూ ఎరుగని సంక్షోభాలను చూసింది. అదే కల్లోలం అనేక రూపాలలో మరో మూడు వందల ఏళ్లు కొనసాగింది. ఒక వెలుగు వెలిగిన విజయనగర సామ్రాజ్యం బలహీనపడిపోతున్న దశ అది. దాని పతనంతో దక్షిణ భారత చరిత్రలో కొత్త మార్పులు వచ్చాయి. తల్లికోట లేదా రాజక్ష తంగడి యుద్ధంలో బహుమనీ సుల్తానుల చేతిలో విజయనగర సామ్రాజ్యం దెబ్బతినిపోయింది. అళియ రామరాయలు మరణించారు. మరో వందేళ్లు ఆ వంశ పాలన సాగింది గాని పూర్వపుధాటి లేని బలహీన ఛాయగా మాత్రమే మనగలిగింది. కాకతీయులు రెడ్డిరాజులు, విజయనగర రాజులు తెరమరుగై పోయి మహమ్మదీయుల పాలన మొదలైంది. బహుమనీ రాజ్యం కాలక్రమేణా పోయింది. అహ్మద్ నగర్‌లో నిజాం షాహీలు, బీజాపూర్‌లో అదిల్ షాహీలు, గోలకొండలో కుతుబ్ షాహిలు అధికారంలోకి వచ్చారు. అంతకు ముందు లేని మత భేదాలు కూడా పొడసూపాయి. అయితే మూడుగా చీలిపోయిన నిజాం షాహీలు తమకు సహాయం కోసం హిందూ రాజుల సహాయం కోరారు. తర్వాత కాలంలో రామరాయలు బీజాపూర్ తదితర రాజులను నాలుగు సార్లు ఓడించారు గాని నిజాంషాహితో ఓడిపోయారు. 17వ శతాబ్దిలో మొగలులు వారిపై దాడి చేయడం వల్ల నవాబులు విజయనగరంపై దృష్టి తగ్గించారు. వారి వంశస్థుడైన తిరుమల రాయలు కుమారుడు వెంకటపతి రాజు 1568లోచంద్రగిరి రాజు రాజధానిగా కొత్త రాజ్యం స్థాపించుకున్నారు. అప్పటి నుంచే వేమన్న కాలం మొదలవుతుంది. వెంకటపతి 1614లో మరణించగా వారసత్వం కోసం పోరాటాలు మొదలైనాయి. పరస్పర హత్యలకు కూడా దారితీశాయి. 1646లో ఉత్తర ఆర్కాటు జిల్లా ముస్లిం రాజుల వశమై పోవడంతో విజయనగరం చరిత్ర ముగిసింది. దక్షిణ భారత చరిత్రలోనే ఒక గొప్ప అధ్యాయమని

చెప్పదగిన విజయనగర రాజ్య ప్రభావాన్ని , ఆ రాజుల రాజరిక వ్యూహాల తదనంతర ప్రభావాన్ని ఒక చరిత్ర రచయిత ఇలా అంచనా వేశారు:

500 ఏళ్ల తర్వాత కూడా విజయనగర కాలం ప్రజల మనసుల్లో పచ్చగా వుండిపోయిందంటే ఆ రాజుల రాజనీతి నైపుణ్యం, తమ పాలనా ప్రాంతంలో సానుకూల ఆర్థిక సామాజిక సాంస్కృతిక అభివృద్ధి కోసం వారు అనుసరించిన విధానాలే కారణం… ఒక దశలో మొత్తం దక్షిణ భారతదేశం స్థానిక తేడాలు, భాషా సాంస్కృతిక నైతిక విలువల వ్యత్యాసాలు ఈ ప్రభావాన్ని చూసింది. విజయనగర రాజులు స్థానికంగానూ అంతర్జాతీయంగానూ కూడా వర్తక వాణిజ్యాలను ప్రోత్సహించారు. రేవుపట్టణాలలో విదేశీయులకు ద్వారాలు తెరిచి వ్యాపార సంబంధాలు పెంచుకున్నారు. అందువల్ల వారు భవిష్యత్తులో భారత దేశంలో వలస పాలనకు పరోక్షంగా రంగం సిద్ధం చేశారని చెప్పొచ్చు.

**పుడమితల్లికి పురిటినొప్పులు**

వేమన కవిత్వంలోని సంక్లిష్టతను సంఘర్షణను సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే విజయనగర సామ్రాజ్య పతనం ప్రభావాన్నే గాక ఆ రాజ్య విధానాల వల్ల ఏర్పడిన వాతావరణ ప్రభావాన్ని కూడా గమనంలో వుంచుకోవాలి. కల్లోల కాలమెప్పుడూ కవిత్వానికి కవివాక్కుకూ పదును పెడుతుంది.సంక్షోభంలో సంవేదనలు సాంద్రమవుతాయి. సంక్లిష్టతలు సాహిత్యసృజనగా మారతాయి. వేమన కవిత్వంలో మనం స్థిర సమాజాన్నే గాక మారుతున్న విలువలను కొత్తపాతల ఘర్షణను కూడా చూస్తాం. గురజాడ చెప్పిన కొత్త పాతల మేలుకలయిక అన్న అర్థంలో కాదు; పుడమితల్లికి పురిటినొప్పులు కొత్త సృష్టిని స్ఫురింప చేస్తున్న దశ. అదే వేమన పద్యాలకు అంతటి వైవిధ్యాన్ని నైశిత్యాన్ని ఆవేదనాగ్రహాలను తెచ్చిపెట్టింది.

17వ శతాబ్దమంతా యుద్ధాలమయమే. కేంద్రంలో రాజులు ఎవరనే దానితో నిమిత్తం లేకుండా స్థానిక ప్రభువులు పాలెగాళ్లుగా పేరొందిన పాళియగార్లు దిగువన పెత్తనం చేస్తూ ప్రజలను పీడిస్తూ వచ్చారు. నిజానికి ఈ పాలియగార్లు చిల్లర రాజులు పొరుగు వూళ్లను దోచుకున్న ఉదంతాలు కూడా కోకోల్లలు. విజయనగర రాజులు విపరీతమైన వికేంద్రీకరణ విధానాన్ని అనుసరించారు. మండలాధిపతులు పూర్తి అధికారం చలాయించడమే గాక స్వంత నాణేలు కూడా ముద్రించుకునేవారు. సైనిక బలం ఎక్కువగా వున్నవారిదే పెత్తనం. వారు వసూలు చేసినదానిలో సగం పైకి పంపించేవారు. రైతులు పన్నులు కడుతుంటే పై వర్గాల వారు విలాస జీవితం గడిపేవారు. కంసాలి చేనేత వంటి వృత్తుల వారు కొంత నిలదొక్కుకుంటున్నా గ్రామీణ వృత్తులు మాత్రం చితికిపోతున్నాయి.ఇవన్నీ వేమన పద్యాలలో ప్రతిబింబించాయి. ఇవి రాశాడు గనక వేమన రాజవంశీకుడై వుండడనేది ఒక సూత్రీకరణ. స్వతహాగా సేద్యం తెలిసిన మధ్యతరగతి రెడ్డి అని మరో వాదన. రాయలసీమలో కాపులను రెడ్లు అంటారు గనక ఎలాగైనా అనుకోవచ్చు. ఇవి కూడా కవికీ కవితకూ అభేదం చూస్తున్న ఫలితాలే.

*17వ శతాబ్దమంతా యుద్ధాలమయమే. కేంద్రంలో రాజులు ఎవరనే దానితో నిమిత్తం లేకుండా స్థానిక ప్రభువులు పాలెగాళ్లుగా పేరొందిన పాళియగార్లు దిగువన పెత్తనం చేస్తూ ప్రజలను పీడిస్తూ వచ్చారు.*

సామాజికంగా ఈ కల్లోలిత పరిస్థితులు ప్రజలలో అభద్రతను పెంచి మూఢనమ్మకాలకు పాలుపోశాయి. వర్ణవ్యవస్థ వికృతరూపం దాల్చింది. మొదట్లో అంతగా వ్యవస్థీకృతం గాని హిందూ మతం వైదిక మతం పేరిట చలామణి అయ్యేది. వైదికంలో సామాన్య ప్రజలు భూసురులైన బ్రాహ్మణుల మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా పూజలు చేసుకోకూడదు. గుళ్లూ గోపురాలకు వెళ్లకూడదు. అందుకే మనకు ఆదిమ దేవుళ్లయిన బ్రహ్మ ఈశ్వరుడు ఇంద్రుడు వంటి వారికి గుళ్లు వుండవు. బౌద్ధ మతం మొదటిసారి ప్రజాస్వామికంగా అందరూ ఆరామాల్లో వుండే అవకాశం కల్పించింది. వీధులు వూడ్చే సునీత కూడా బుద్ధుడి కృపకు పాత్రుడని చెప్పింది. ఈ పరిస్థితుల్లో అట్టడుగు ప్రజలు బౌద్ధం వైపు ఆకర్షితులవకుండా ఆపడం కోసం వచ్చినదే భక్తి ఉద్యమం. దీంట్లో ఎవరైనా సరే భక్తి వుంటే భగవంతుణ్ని పూజించవచ్చునన్నారు. అప్పటికి ఈశ్వరారాధన ప్రాభవం తగ్గి ఉపేంద్రుడైన విష్ణువు వెలిగిపోతున్నాడు. అనార్య దైవమైన ఈశ్వరుడు కొత్త సమాజంలోనూ కొనసాగుతున్నాడు. అప్పటి నుంచి విష్ణువుకూ శివుడికీ పూజలు మొదలైనాయి. గుళ్లు కట్టారు. కాని అందులోనూ విష్ణువుదే పై చేయి. ఈ ఇద్దరు దేవుళ్ల తరపున వైష్ణవం, శైవం వచ్చాయి. కలహించుకున్నాయి. వీరశైవం, వీర వైష్ణవంగా మారాయి. వీరితో పాటే గ్రామదేవతలూ వున్నారు. జనబాహుళ్యంలో భక్తి సిద్ధాంతాలు ప్రబలిన కొద్దీ మహిమలు బలులూ పూజలూ క్రతువులూ

వంటివాటితో కపట బోధకులు చెలరేగిపోతున్నారు. ఈ క్రమంలో తొలుత బ్రాహ్మణాధిక్యతకు వర్ణవ్యవస్థకు ఒక చిన్న నిరసనగా మొదలైన వీరశైవం, వీర వైష్ణవం వంటివి కూడా బ్రాహ్మణ పూజారులు మెట్టవేదాంతుల చేతచిక్కి మూలనప్పార్తి కోల్పోతున్నాయి. దేవాలయాలు విస్తరించి వాటి చుట్టూ పట్టణాలు పెరుగుతున్నాయి. ఆ సమయంలోనే వాస్కోడిగామా 15వ శతాబ్దంలో కాలికట్‌లో దిగాడు. అంటే వేమన కాలానికి పాశ్చాత్యదేశస్తుల ఆగమనం కూడా జరిగింది.ఇంకా చెప్పాలంటే 16వ శతాబ్దంలోనే క్రైస్తవ జెసూట్ ఫాదరీలు కూడా వచ్చేశారు. వీరికి ఆయా పాలకవర్గాల ప్రోత్సాహం వుంది. అలా మొత్తంపైన సమాజంలో కుల వివక్షకు తోడు మతపరమైన వైవిధ్యం కూడా పెరిగింది. నిజానికి బయిటివారి తాకిడికి అంత సులభంగా ఓడిపోతున్న, కూలిపోతున్న ఒక దేశంలోని అంతర్గత పరిస్థితి ఎంత దుర్బలంగా ఎంత దుస్సహంగా వుందో తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. అంతటి పతనం లోనూ మహామహా కవివరేణ్యులెవరూ దేశం గురించి ఓటమి గురించి రాసినట్టు కనిపించదు. స్వంత మనుగడ గురించే వారి చింత. అలాగే పాలించే ప్రభువులు కూడా తమ పరిమిత పెత్తనాలను కాపాడుకోవడం తప్ప ప్రజా బాహుళ్యం గురించి, సమాజ స్తితిగతుల గురించి ఆలోచన చేసిన దాఖలాలుండవు.

> ***అవలక్షణాలపై ఆక్షేపణగా ఆధిపత్యాలపై ధిక్కారంగా, చితికి పోతున్న స్వయం పోషక గ్రామీణ వ్యవస్థ ఆవేదనాగ్రహాల ప్రతిరూపంగా ప్రతిధ్వనించినవే వేమన పద్యాలు.***

**అరాచకం.. ఆర్థిక ప్రాబల్యం**

క్రీశ1600లో ఈస్ట్ ఇండియా వర్తక సంఘం ఏర్పడగా 1611లో నిజాం పట్నం, మచిలీపట్నంలతో వ్యాపార సంబంధాలు పెరిగాయి.పైన చెప్పుకున్న వృత్తికారుల జీవితాలను కంపెనీ ప్రభావితం చేయడం పెరిగింది. ప్రభుత్వం ఒకవైపు, కులీన పాలకవర్గాలు మరో వైపు, కొత్తగా పెంపొందుతున్న వాణిజ్యవర్గం ఇంకోవైపు వృత్తిదారులతో చెలగాటమాడాయి. సమాజంలో ఉత్పత్తి వ్యవస్థలూ ఆర్థిక సాంస్కృతిక జీవనం వూహాతీతమైన మార్పులకు గురైంది. కుల మత భేదాలను కూడా వారు రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం మొదలు పెట్టారు.బ్రిటిష్ వారు ప్రత్యేకించి మన బంగారు నిల్వలపైన, నూలు బట్టలపైన కన్నేయడంతో పైకి వస్తున్న ఆ వర్గాలే ఎక్కువగా చితికిపోయాయి. ఈ పరిస్థితుల్లో కేవలం ఒక మత తాత్విక కోణంలో కొత్త ముసుగులో పాత భావాలన్నట్టు బయిలుదేరిన వీరశైవం,వైష్ణవం 'పెద్ద ప్రభావం చూపించలేకపోయాయి. మొదట్లో కొంత విశాలత్వం బోధించినట్టు కనిపించినా ఆధిపత్యాలను ఛేదించ లేకపోవడం, ఆచరణాత్మక కార్యక్రమాలు లేకపోవడం వల్ల వాటివైపు వెళ్లేవారు తగ్గిపోయారు. ఇదే గాక నాథసంప్రదాయం,లింగధారణ వంటి వాటి గురించి చెబుతుంటారు గాని అన్నీ అప్రధానంగానే మారాయి. పైగా ప్రావకాలను బట్టి ఆ బోధకులే అరాచకులుగా అవకాశవాదులుగా మారడం ప్రజలు గమనించారు. ఈస్ట్ ఇండియా వర్తక సంస్థ చొరబాటు కారణంగా వ్యాపార విలువలు ధన ప్రభావం పెరిగి మానవీయ విలువలు తగ్గుముఖం పడుతున్నాయి. ఇన్ని అవలక్షణాలపై ఆక్షేపణగా ఆధిపత్యాలపై ధిక్కారంగా, చితికి పోతున్న స్వయం పోషక గ్రామీణ వ్యవస్థ ఆవేదనాగ్రహాల ప్రతిరూపంగా ప్రతిధ్వనించినవే వేమన పద్యాలు.

ఈ పరిస్థితులన్నిటిలో ప్రజలకు ఎంతో కొంత వూరట కలిగించవలసిన మతం ఆధ్యాత్మికత కూడా అంత:కలహాల్లోనూ పరస్పర విద్వేషాల్లోనూ కూరుకుపోయాయి. కుల భేదాలు బుసలు కొడుతున్నాయి. అగ్ర కులాల ఆధిపత్యం అణచివేస్తున్నది. దేన్నీ ప్రశ్నించని మూఢత్వం దట్టంగా అలుముకుని వుంది. మత సంస్కర్తలుగా ఈ పరిస్థితిని చక్కదిద్దుతామని వచ్చిన వారు మొదలు పెట్టిన శాఖలు కూడా కొద్దికాలంలో అదే వూబిలో చిక్కిపోయాయి. దరిద్రం పేదలను కొరుక్కుతింటున్నది. ఆత్మగౌరవాన్ని మంటగలుపుతూ దేవుడికోసం మడులూ మాన్యాలు అనేవారు మనుషుల బాధలను పట్టించుకోవడం లేదు. డబ్బు వుంటే చాలన్నట్టు దాసోహమైపోతున్నారు. ఇది చూసి ఎలాగైనా సంపద పెంచుకోవాలనుకుని బంగారాన్ని కృత్రిమంగా తయారు చేసే లోహతారక విద్య కోసం ఆలోచనా పరులు కూడా ఎగబడిపోతున్నారు(వేమనకూ ఈ లక్షణం అంటగట్టారు) ఇన్నిటి మధ్య సమాజం అతలాకుతలమవుతుంటే మహిళలు మరింత దుస్థితిలో వున్నారు. ఒక వర్గాన్ని వేశ్యలుగా బసివినిలుగా ప్రకటించి భోగకాంతలుగా చేశారు. ఇంటి ఇల్లాలిని వంటింటి కుందేలిని చేసి పాతివ్రత్యం పేరిట అణగదొక్కుతున్నారు. ఇంత చేసినా స్త్రీలపట్ల గౌరవం లేకుండా

అనుమానాలతో అవమానిస్తున్నారు. స్త్రీలు ఎప్పుడూ పురుషుల ధనాన్ని కోరుతుంటారని ఆసూయాపరులనీ కామినులనీ రకరకాలుగా తిట్టిపోస్తున్నారు తప్ప మాతృమూర్తులుగా జీవిత భాగస్వామినులుగా గౌరవించడం లేదు.(అంతటి వేమనలోనూ ఈ తరహా పద్యాలు కనిపించడం సత్యం. పైగా ఆయన జీవితం చుట్టూ అల్లిన కథల్లోనూ స్త్రీల పాత్రను ఇలాగే చిత్రించారు.) కనుక వేమన జీవిత సాహిత్యాలను బేరీజు వేసేప్పుడు ఇవన్నీ గమనంలో వుంచుకోవాలి.

*ఏతావాతా చెప్పదలచిందేమంటే వేమనపై పరిశోధనకు పాత పరికరాలు వాడిన వారు, పాండిత్య ప్రకర్షకు దిగిన వారు మనకు అణుమాత్రం వుపయోగపడరు.*

**పరిశోధనలో సాక్షికత్వం పాండిత్య ప్రకర్ష**

ఎంతో శ్రమపడి వేమన గురించిన విశేషాలను వెలికి తీసిన వారికి జేజేలు పలుకుతూనే ఈ విధమైన సమగ్ర సమ్యక్ దృష్టి చాలామందిలో లోపించిందని చెప్పవలసి వుంటుంది. ఆ కారణంగా వేమనను గురించిన దృశ్యం ఇప్పటికీ అసమగ్రంగానూ భావాత్మకంగానూ వుండిపోయింది. వేమన పద్యాల ఆధారంగా ఆయన జీవితాన్ని నిర్మించడానికి నార్ల వెంకటేశ్వరరావు చేసిన ప్రయత్నం ఎంత హాస్యాస్పదమైంది? కాళిదాసుకూ పెద్దనకూ కూడా ఇలాగే వారి పాత్రల లక్షణాలు ఆపాదించడం మనకు తెలుసు.పదండి ముందుకు రాసిన శ్రీశ్రీ కవితా ప్రస్థానాన్ని జీవిత ప్రస్థానానికి కూడా అంటగడితే ఎంత అవాస్తవంగా వుంటుంది?

నార్ల వంటివారి రచనను ఇప్పటికీ ప్రామాణికంగా చెప్పేవారు ఆలోచించవలసిన అంశాలివి. ఇక రాళ్లపల్లి వారు తన కాలానికి విశేషమైన శ్రమ చేశారు. కాని తనువులోన పుట్టు తత్వమెల్ల అన్న వేమన్నను ఏదో ఒక తాత్విక చట్రంలో ఇమిడ్చేందుకు ప్రయాస పడటమెందుకు? అది చెప్పడం కోసం తన ప్రసంగాలలో ఒకటి రెండు మొత్తంగా ఆయా యోగాలను వర్ణించడానికి వెచ్చించడం ఏం ప్రయోజనం? ఇక చాలా ఏళ్ల తర్వాత పనిగట్టుకుని వేమనపై హడావుడి చేసిన త్రిపురనేని వెంకటేశ్వరరావు అయితే వేమనను శూన్యవాదిగా చూపించడానికి నానాతంటాలు పడ్డారు.

ఏతావాతా చెప్పదలచిందేమంటే వేమనపై పరిశోధనకు పాత పరికరాలు వాడిన వారు, పాండిత్య ప్రకర్షకు దిగిన వారు మనకు అణుమాత్రం వుపయోగపడరు. వాస్తవంగా రచనలు సేకరించిన వారు, పాండిత్యాలు పక్కనపెట్టి విషయప్రధానంగా వివేచన చేసిన వారు మనకు మార్గదర్శకులవుతారు. ఈ పరిస్థితిని జ్వాలాముఖి చాలా బాగా అభివర్ణించారు:

" శతక కవుల్లో శీర్షికలా నిలిచిన వేమన- ఏకపక్ష నీతికి వ్యతిరేకంగా నిలిచిన శేషప్రశ్న. సోకాల్డు భారతీయ సంస్కృతి కుళ్లును బయిటపెట్టిన ధిక్కారం వేమన- అదృష్టవంతులనబడే స్వార్థపర కూటమి చేతుల్లో పడిన ఫ్యూడల్ సమాజ అశాంతి వేమన- కాలజ్ఞాన చైతన్యం వేమన- యుగ అరాచకంలో మొలుచుకువచ్చిన తత్కాల సంస్కారం వేమన- ఫ్యూడల్ యుగ స్వభావాన్ని నిలదీసిన ఆందోళన- అసాధ్య భావజాలం-అపార భాషా నుడికారం-యుగస్వభావ సాక్షాత్కారం- అలజడిని అక్షరీకరించిన ఆక్రోశం- ఆక్రోశాన్ని నుడికారం చేసిన సామెత- అభివ్యక్తి నభూతో నభవిష్యతి."

తెలుగు వారి ఆధునిక సాహిత్య స్పృహలో అధికభాగం కృష్ణశాస్త్రి,,శ్రీశ్రీల వల్ల కలిగిందే. ఇందులో మొదటివారు వేమనను గురించి పెద్దగా చెప్పినట్టు కనిపించదు. ఇక శ్రీశ్రీ మాత్రం ఆదికాలంలో తిక్కన, మధ్య యుగాలలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ మన మహాకవులు అంటూ ఒక నూతన కవి త్రయాన్ని - నవ త్రయాన్ని సృష్టించాక వేమన్న మరింతగా ఆరాధ్యుడైపోయాడు. ఈ ముగ్గురిలో వుమ్మడి లక్షణం నాటకీయత అన్నారు. కాని తిక్కన ఏ విధంగా చూసినా యథాతథస్థితికి ప్రతిధ్వని మాత్రమే గాని భాషా పరంగా ముందడుగు వేశారు. వేమన భాషలోనూ భావాల్లోనూ కూడా విప్లవాత్మక మార్పులు తెచ్చాడు. రకరకాల చందో విన్యాసాల మధ్య ఆటవెలదిని అలవోకగా ఆలపించడంలోనూ వేమన ప్రజా కవిత్వముంది. ఆయన పదాలలో అత్యధికం అర్థమవుతాయి. వేమన వీరబ్రహ్మం, అన్నమయ్య, త్యాగయ్య, (ఒక విధంగా తిక్కన కూడా) రాయలసీమ ఆ పరిసరాల నుంచే రావడం పరిశీలించదగ్గ విషయం. తెలంగాణలో పాల్కురికి సోమన, పోతన, నాచన సోమన కూడా అలాగే చూడదగ్గవారు.

**ప్రశ్నల ప్రతిరూపం.. ప్రగతి భావదీపం..**

హేతుశీలత, మానవీయత, సామాజిక న్యాయం, ధిక్కార

తత్వం, శ్రమ గౌరవం, ప్రతిఘటనల ప్రతిబింబమైన వేమన ఈనాటి అవసరాలకూ ఆలంబనే. అంతెందుకు? వేమన పద్యాలలో వున్నన్ని ప్రశ్నలు మరే కవిలోనూ మనకు కనిపించవు. భక్తితెచ్చిన బాధలో కనిపించని దేవుణ్ని ప్రశ్నించిన వారున్నారు గాని కనిపించే సమాజ దుర్లక్షణాలపై కత్తిదూసిన వారు, రాజులనూ యాజులనూ ప్రశ్నించిన వారు వేమనలా ఎందరు? అందుకే ఆయన వారసత్వం అమూల్యం. అసమానం. పరిశోధనలతో భర్త్రహరి చెప్పిన శౌర్య పద్ధతి మూర్ఖపద్ధతి వంటిదే వేమన శైలి అని కొందరనవచ్చు గాని అది అసంబద్ధమైన పోలిక. భర్త్రహరి రాజులపై కొంత నిష్ఠూరంగా రాసినా కొత్త విలువలేమీ చెప్పింది లేదు. ఆయన చెప్పిన శౌర్యం ధైర్యం అన్నీ కులీన లక్షణాలుగానే ధ్వనిస్తాయి. కాలం పరిమితుల వల్ల కులం వంటి అంశాల జోలికి వెళ్లింది లేదు. ఆ విషయంలో వేమన తన కాలం కన్నా చాలా చాలా ముందుకు నడిచాడు.'కుండ కుంభమయ్యె కొండ పర్వతమయ్యె' అంటూ సంస్కృతీకరణను కూడా ఎత్తి చూపాడు. మాలల గురించి మరో మూడు వందలేళ్ల తర్వాత గురజాడ చెప్పింది అప్పుడే చెప్పేశాడు. 'మాలవానినంట మరి నీళ్లమునిగేరు' అనీ, 'మాలవానినేల మహిలోన నిందింప' అనీ చాలా చోట్ల ఆ ప్రస్తావనలు చేశారు. పైగా పండితులమని విర్రవీగేవారిని ఉద్దేశించి వాస్తవికతతో సంబంధం లేని చిలకపలుకుల వంటిదేనని గురజాడ చెప్పింది కూడా వేమన రాసిందే. 'శ్రమములోన పుట్టి సర్వంబు తానౌను' అన్నప్పుడు 'శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది' లేనేలేదన్న శ్రీశ్రీ గుర్తుకు రాకుండా వుండదు.

'అల్పబుద్ధివానికధికారం ఇవ్వడం', 'గణకులొప్పుకున్న గవ్వలు చెల్లడం', రాతిబొమ్మలకు రంగైన వలువలేలని ఆక్షేపించడం, శకునాలను ముహూర్తాలను తోసిపుచ్చడం ఇవన్నీ చూస్తే వేమన ఈ కాలం వాడే నా అని ఆశ్చర్యం కలుగుతుంది. సానుజాతమయ్యె సకల కులము అన్న వేమనపై పరిశోధనలు కూడా కులం కొలబద్దతో కొలవడం, కట్టమంచితో మొదలైన ఈ ధోరణి త్రిపురనేని వెంకటేశ్వరరావు వరకూ సాగడం దుర్భరం. తమాషా ఏమంటే వీటిని ఖండించే వారు కూడా కులతత్వాన్ని ఖండించడానికి పరిమితమై పోవడం నమ్మలేని వాస్తవం. బ్రాహ్మణులను అన్న రెడ్లు కూడా ఆ పనే చేశారని ఒకరు రాస్తే, రెడ్డి అన్నారు గనకే వేమనను చీల్చి చెండాడడానికి మరొకరు ప్రయత్నించారు. దీనికంతటికీ కారణం వేమన ప్రజల కవిగా, ప్రశ్నకు ప్రతీకగా మిగిలిపోవడమే. తొలి రోజుల్లో చాలా వూళ్లలో వేమన పేరిట యువజన సంఘాలు గ్రంథాలయాలు నాటక సమాజాలు ఏర్పడి చైతన్యం పెంచడంతో పెద్ద మనుషులు తట్టుకోలేకపోయారు. నార్లవెంకటేశ్వరరావు, త్రిపురనేని వెంకట్వేరరావు అయితే కమ్యూనిస్టులు వేమనను ప్రచారం చేయడాన్ని కూడా ఎత్తి చూపారు. కామ్రేడ్ గురజాడ కామ్రేడ్ వీరేశలింగం అన్నట్టే వేమన కూడా వారికి ఒక కామ్రేడ్‌గా కనిపించడమే ఇందుకు కారణం కావచ్చు. అయితే ఆ భావాలకు ప్రతినిధులైన కెవిరమణారెడ్డి వంటి వారు కూడా వేమన రాసింది కవిత్వం కాదనీ, ఆయన చదువుకోలేదని రాయడం చూస్తే మన సమాజంలో సంప్రదాయ భావాలు ఎంతగా ఘనీభవించి పోయాయో తెలుస్తుంది. " కులాన్ని బట్టి గాని విద్యాస్థాయిని బట్టి గాని వేమనను తక్కువ రకపు కవిగా ఎంచడం ఎంత చెడ్డదో అభిమానాతిశయం వల్ల మహాకవిగా ఎంచడం అంతే చెడ్డది.... వేమన నేర్చిన విద్య తక్కువ. సాధన చేసిన సాహిత్య విద్య ఇంకా తక్కువ. కాకుంటే చిల్లర మల్లర కవుల భట్టుకవుల ప్రభావం వల్ల తను కూడా కవిత్వం చెప్పడం నేర్చాడనుకోవాలి.... తనకు తెలిసిన విద్య, పట్టుబడిన సాహిత్య విద్య చాలా కొద్దిపాటిది. ఆ కొద్దినే అశేషంగా చూపించగల అక్షర సిద్ధుడైనాడు వేమన.' బ్రౌన్ కాలాన్ని వదిలేద్దాం, నవ్య సంప్రదాయవాదాన్ని పక్కనపెడదాం, ప్రగతిశీల విప్లవ విమర్శాగ్రేసరుడైన కెవిఆర్ రాసిన ఈ వాక్యాలను ఎలా అర్థం చేసుకోవాలో పాఠకులకే వదిలేస్తున్నాను.

ఇప్పుడు వేమన పద్యాలలో పదాలనూ పదార్థాలను కూలంకషంగా పరిశీలించే పని జరగాలి.గోపి, ఆరుద్ర వంటి వారు ఆ పని చాలా వరకూ చేశారు గాని వారి బాధ్యతల నడుమ అప్పటి వరకూ చేసిన బడలిక పిదప ఇంకా వారే చేయాలని ఆశించడం న్యాయం కాదు. మరో వైపున విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా ప్రమాణాలు కూడా తగ్గుముఖం పట్టాయి. కాబట్టి వేమన్న విషయంలో ఇంకా కొత్త ఆకరాలు ఆధారాలు వస్తాయని ఆశించడం కష్టమే గాని మన కాలానికి చాలా దగ్గరగా వున్నది పూర్వకవి వేమనే గనక ఈ పరిశోధనా ప్రస్థానం ఆగిపోకూడదు. కొనసాగుతూనే వుండాలి.వేమనకు సాటి వేమనే గనక– అపూర్వ ప్రభావ శీలి గనక వేమనపై పరిశోధన ఆగిపోకూడదు.




# మహా చైతన్యజ్వాల వేమన

- కొలకలూరి ఇనాక్

దాదాపు నాలుగువందల సంవత్సరాలకి పూర్వం తెలుగు నేలనంతా చుట్టి తన సాహిత్యంతో సమాజాన్ని ఉద్దీపింపజేసిన మహా చైతన్యజ్వాల వేమన. ఆయన పద్యాలు చదివితే ఆయన కాలం నాటి సమాజం తెలుస్తుంది. ఆనాటి సమాజంలోని దుశ్చర్యలు, దుర్మార్గాలు, అమానవీయమైన వాటిని, అసాంఘికంగా ఉండే శక్తులిని ఏ రకంగా తను తూర్పారబట్టాడో ఆ పద్యాలు చెబుతాయి. ఆ పద్యాల్ని ఆధారం చేసుకొని మనం ఆనాటి సమాజాన్ని ఊహించొచ్చు. ఎలా ఉంది ఆ సమాజం. ఈ సమాజం ఎట్లా బాగుపడుతుంది అని ఆరాటపడ్డ ఒక చైతన్యజ్వాల. ఎవడండి తన కాలంలో ఉన్న సమాజాన్ని సాహిత్యంలో నిక్షిప్తం చేసిన తెలుగు రచయిత. అంతగొప్ప రచయిత, అంతగొప్ప కవి, అంత గొప్ప మేధావి. అంతగొప్ప ఆలోచనాపరుడు యోగిగా జీవించాడు అంటే మన అందరికీ యోగివేమన అనే గుర్తు. ఇప్పుడు ఆయన కవిత్వాన్నే గుర్తుగా పెట్టుకుని ప్రజాకవి వేమన అంటున్నాం. ఈ ప్రజాకవిని గురించి ప్రజా కవిత్వాన్ని గురించి ఆలోచన చేయడానికి ఇది మంచి అవకాశం. నాకెప్పుడూ అనిపిస్తుంటుంది. వేమన పద్యాలుగా ప్రచారమైనవన్నీ వేమన పద్యాలేనా అని. ఆటవెలదిలో ఉండేవి మాత్రమే, విశ్వదాభిరామ వినురవేమా అనే మకుటం ఉండేవి మాత్రమే వేమన పద్యాలు అయ్యుంటాయనీ అందర్లాగే నేనూ అనుకోవడం జరిగింది. ఆయన పేరుతోనే వేమనను సంభోదిస్తూ కందపద్యాలు ఉన్నాయి. ఆ పద్యాలు ఆయనే రాశాడా లేదా అనేది మనకు సందేహం. ఆ రచనల మీద జాగ్రత్తగా ఆలోచన చేస్తే ఒక స్పష్టమైనటువంటి అవగాహన ఏర్పడుతుంది. వేమన అనే మనిషి ప్రజలలో ఉన్నాడు. ప్రజల నాల్కల మీద ఉన్నాడు. అందరికీ అతని పద్యాలు తెలుసు. పాడుకుంటుంటారు. నాలుగువందల ఏళ్ళుగా తెలుగు జీవితంలో అవి ఉన్నాయి. కాని పండితుల దగ్గరకు వచ్చేసరికి అవి దూరమయ్యాయి. ప్రజలలోవి మాత్రమే ఉన్నాయి. ప్రజల నాల్కల మీద ఉన్నవే కనిపిస్తున్నాయి. వీటిని సి.పి. బ్రౌన్ సేకరించి, ఇంగ్లీషులోకి అనువదించి రాయల్ ఇనిషియేటివ్ సొసైటీ పుస్తకంలో ముద్రించి ప్రపంచానికంతటికీ పంచిపెట్టిన తర్వాత భారతదేశంలో ఆంధ్రదేశంలో ఒక గొప్ప కవి ఉన్నాడని ప్రపంచానికంతటికీ తెల్సింది. తర్వాత మన పండితులు తెలుసుకున్నారు. పామరులందరికీ ముందునుంచీ తెలుసు. సామాన్యులందరికీ ముందునుంచీ తెలుసు. ఆయన పద్యాలన్నీ వాళ్ళకు వచ్చు. కానీ ప్రపంచం గుర్తించిన తర్వాత వేమనకి మనం గుర్తింపునిచ్చామని మొట్టమొదట మీరు గుర్తుంచుకోవాలి. ఎందుకు వేమనను నిరాకరించటానికి ప్రయత్నించారు మనవాళ్ళు. ఎందుకంటే ఆయన తిట్టిన తిట్టు తిట్టకుండా తెలుగుజాతి యొక్క సామాజిక స్థితిలోని దుర్మార్గాన్ని తూర్పారబట్టాడు. అది అందరూ అంగీకరించలేకపోయారు. సామాన్యులు అంగీకరించారు. అంగీకరించినవారు ఆరాధించారు. అంగీకరించని వాళ్ళు తిరస్కరించారు. తూష్ణీభావం చూపించారు. ఈ కారణంగా ప్రజల్లోకి అందర్లోంచీ రావలసిన మనిషి సామాన్యుల, పల్లెజీవితాల్లోని వారిదగ్గర ఉండిపోయే పరిస్థితి చాలా కాలం వచ్చింది. సి.పి.బ్రౌన్‌ను తెలుగు దేశానికి తీసుకొచ్చి వేమనని మనకు అందేటట్టు చేసినటువంటి ఒక పుణ్యాత్ముడు. ఆంగ్లేయ పాలనవల్ల ఆంధ్రదేశంలో తిరుగాడడం వల్ల మనకు మేలు జరిగిందనేది మీరు గుర్తుంచుకోవాలి.




# తరగని సంపద వేమన పద్యాలు

- పల్లె రఘునాథ రెడ్డి
ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ సాంస్కృతిక శాఖా మంత్రి

తెలుగు జాతి ఉన్నంత కాలం తెలుగు భాష ఉంటుంది. తెలుగు భాష ఉన్నంతకాలం వేమన పద్యాలు ప్రజలలో ఉంటాయి. సాంఘిక దురాచారాలను అరికట్టడానికి వేమన పద్యాలు దోహదపడతాయి. తెలుగు జాతి ప్రతిష్టను ఖండంతరాల్లోకి విస్తరింపచేసిన మహోన్నతుడు వేమన. నైతిక విలువలు పతనమవుతున్న నేటి రోజుల్లో వేమన సాహిత్యంను ప్రజల్లోకి విరివిగా ముఖ్యంగా పిల్లల్లోకి తీసుకెళ్ళాల్సిన అవసరముంది. విద్యార్థి దశ నుంచే వేమన పద్యాలను బోధించాలి. తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. నేను మంత్రిగా ఉన్న సమయంలో తెలుగుభాషాభివృద్ధికి కొన్ని ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచాను. సాహితీవేత్తలను ప్రభుత్వం తరపున ప్రోత్సహించే దిశగా నా వంతు కృషి చేస్తాను. ఎవరైతే తెలుగు జాతి కీర్తి ఖండాంతరాలలో వ్యాపింపజేశారో అటువంటి మహానుభావుల పుట్టిన రోజు పండగలను రాష్ట్ర పండగలుగా నిర్వహించాలని ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నాము. ఏ కవైనా, ఏ పండితుడైనా అటువంటి వాళ్ళని చిరకాలంగా, చిరస్మరణీయంగా గుర్తుపెట్టుకోవాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం. దానిలో భాగంగానే 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ పుట్టినరోజును రాష్ట్ర పండుగగా నిర్వహించాం. అదేవిధంగా గిడుగు రామ్మూర్తిగారి పుట్టినరోజును కూడా నిర్వహించాం. ఏ రాజులైతే, ఏ ప్రభుత్వమైతే కవులనూ, కళాకారులనూ సత్కరిస్తారో, ఎవరైతే సాహిత్యానికీ, కవిత్వానికీ ప్రాధాన్యత ఇస్తారో అటువంటి రాజులూ అటువంటి ప్రభుత్వాలూ చిరకాలం మనగలుగుతాయి. వేమన పద్యాలు సాంఘిక దురాచారాలను మాపుజేసేదానికి, మూఢవిశ్వాసాలను నిర్మూలించేదానికి ఉపయోగపడతాయి. వాస్తవాలను కళ్ళకు కట్టించే విధంగా పద్యాలు ఉంటాయనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. వేమన పద్యాలు ఆంధ్రులకు తరతరాలు తరగని సంపద. సామాన్యులకు కూడా అర్థమయ్యే విధంగా వేమన పద్యాలు ఉంటాయి. వేమన పద్యాల్లోని సత్యాలు జీవితంలో అందరూ అనుసరించతగినవి. ఈ పద్యాలను పిల్లలకు, అందరికీ చెప్పినట్లైతే ఈ సమాజంలో ఒక చైతన్యం, ఒక స్ఫూర్తి, ఒక అవగాహన, ఆలోచన వచ్చి తీరుతుంది. భారతం, రామాయణం, బైబిల్, ఖురాన్ చదివినా వేమన పద్యాలకు మించిన సారాంశం ఏమీ ఉండదు. ఇంత పెద్ద సదస్సును ఏర్పాటుచేసి విజయవంతం చేసిన నిర్వాహకులను అభినందిస్తున్నాను.

# వేమన పద్యాలు - పురివిప్పిన పునరుజ్జీవన దశ




- ఎన్. గోపి

*మూడోది విస్తృతదశ. బహుశా అనంతపురం సభల్లోనే దీనికి ప్రాతిపదిక పడిందని నాకనిపించింది. ఒకే వేదికపైన **14** పుస్తకాలు వెలువడటం, వందలాదిమంది సీరియస్ సాహితీవేత్తలు వివేచనా పరత్వంతో పాల్గొనటం, నేటి యువలోకంలోకి వర్తమాన ప్రాసంగికతతో వెళ్లాలని సంకల్పించటం ఇవన్నీ కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయి.*

ఏప్రిల్ 30, 2017న అనంతపురంలో 'వేమన సాహితీ సమాలోచన సదస్సు' పెద్దఎత్తున జరిగింది. 'సాహితీస్రవంతి' దానిని నిర్వహించింది. 250 సంఘాలు ఒక ఆహ్వానసంఘంగా ఏర్పడి అది ఘనంగా జరగడానికి తోడ్పడ్డాయి. గొప్ప విశేషమేమిటంటే – ఆ సభలో వేమన గురించిన 14 గ్రంథాలు ఆవిష్కరణ జరిగింది. వాటన్నింటినీ ప్రజాశక్తి బుక్‌హౌజ్ వారే ప్రచురించారు. వాటిలో 8 వ్యాస సంపుటాలకు మన నిస్తంద్ర తెలుగు విమర్శక శిఖరం రాచపాళెం చంద్రశేఖర రెడ్డి సంపాదకత్వం వహించారు. అలాగే బ్రౌన్ 1839 నాటి వేమన పద్యసంకలనం, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి 'వేమన', జి. కళ్యాణరావు గారి 'వేమన – వీరబ్రహం – ఒక సంభాషణ', కె.ఎల్. కాంతారావు గారు, కె. ఉషారాణి గారు సంకలనం చేసిన 'నిత్యసత్యాలు – వేమన పద్యాలు' కూడా వాటికి చేరాయి. అంతేకాకుండా 1980లో వెలువడిన నా 'ప్రజాకవి వేమన' పిహెచ్‌డి సిద్ధాంత వ్యాసం ఆరోముద్రణ, 'వేమన్న వెలుగులు' వేమన పద్యాలకు వ్యాఖ్యానం రెండో ముద్రణలను కూడా ఆ సందర్భంగా ప్రజాశక్తి బుక్‌హౌజ్ వెలువరించింది.

అనంతపురం సభకు నేను కూడా ఎంతో ప్రేమతో వెళ్లాను. నిజానికి సభలు అనాలి. ముందురోజు అంటే ఏప్రిల్ 29 రాత్రి తెలకపల్లి రవిగారు రచించిన 'వేమన రూపకం' ను కూడా దానిలో కలుపుకోవాలి. ఆ రూపకం నేను పూర్తిగా చూడలేదు గాని చూసినంతవరకు అది వేమన్న సందర్భంలో బలమైన సాంస్కృతిక కుదుపు. నాటి వేమన గురించి నేటితరానికి అవసరమైన పిలుపు. ఎంతో నిపుణులైన గాయక కళాకారులు దానిని ప్రదర్శించారు. మరునాటి సభలో కూడా ఆ పాటలు అందరిని ఉత్తేజపరిచాయి. త్వరలో హైదరాబాద్‌లో జరగబోయే ప్రదర్శనలో దానిని సాకల్యంగా చూడాలి.

ఒక రకంగా వేమన ఆ కాలంలోనే సామాన్య ప్రజల్లోకి పోయాడు. వానలో తడువని వారు వేమన పద్యాలు వినని వారు లేరని ప్రతీతి. కాని విద్యావంతుల్లోనే వేమన వివక్షకు గురయ్యాడు. ఆ వివక్షను తొలుత బద్దలుగొట్టిన వాడు సి.పి. బ్రౌనే. ఆయన నిజంగా తెలుగు సూర్యుడే. వేమన పద్యాలతో రెండు సంకలనాలు (1829, 1839) వేసి వాటికి ఆంగ్లానువాదాలు చేసి, విలువైన పీఠికలు సమకూర్చిన మహనీయుడు బ్రౌన్. బ్రౌన్‌కు **Local Prejudies** లేకపోవటం వల్ల వేమన బతికి పోయాడు. మరో 9 దశాబ్దాల తరువాత కట్టమంచి రామలింగారెడ్డి గారి ఆధునిక దృష్టివల్ల

బతికిబట్టకట్టాడు. ఆయన ఆధ్వర్యంలో సాగిన రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారు ఇచ్చిన వేమన ఉపన్యాసాలు వేమనను సాహిత్యరంగంలో ఇతర పెద్ద కవుల స్థాయిలో నిలిపాయి. వేమనను గురించిన సాహిత్యంలో అప్పటికీ ఇప్పటికీ అది కలికితురాయి. అయితే వేమన గురించి రాసిన వారెందరో ఉన్నారు. వారందరికీ నా ప్రాతఃస్మరణికలు.



ఒకరోజు ఓ సభలో తెలకపల్లి రవి గారు  నా ప్రక్కన కూచొని ఉన్నారు. మాటల సందర్భంలో నా ప్రజాకవి వేమన గ్రంథాన్ని ప్రజాశక్తి బుక్‌హౌజ్ వేస్తే బావుంటుంది అన్నాను. ఆయన వెంటనే సానుకూలంగా స్పందించారు. అప్పటికే ఆ సిద్ధాంతగ్రంథం ఐదు ముద్రణలు పొందింది. విశ్వవిద్యాలయ పరిధిని దాటి విశాల విశ్వంలోకి రెక్కలు సారించింది. 1980 నాటి నుండి అంటే 37 సంవత్సరాలుగా పఠన పాఠకాల్లో నలుగుతూనే వుంది. తరువాత వేమన మీద రాసిన వారిలో ఎక్కువమంది దీనిని ఉటంకిస్తూనే వున్నారు. ఆ గ్రంథం ఈ తరంలోకి వెళ్లడానికి రవిగారి ప్రమేయం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. అలాగే 'ప్రజాకవి వేమన' పుస్తక ముద్రణ పట్ల ప్రజాశక్తి బుక్‌హౌజ్ సంపాదకులు కె. ఉషారాణి, ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ శ్రీ లక్ష్మయ్య గారల అభినివేశం అభినందన పాత్రం.

ఇక, 'వేమన్న వెలుగులు' వేమన పద్యాలకు వ్యాఖ్యాన గ్రంథం. 3 సంవత్సరాల పాటు 'సాక్షి' సండేలో వారం వారం ధారావాహికంగా వెలువడింది. రవిగారు దానిపట్ల ఇంకాస్త ఎక్కువ ఆసక్తి కనబరిచారు. ప్రజల్లోకి వెళ్లాలనేది ఆయన ప్రధాన దృష్టి.

వస్తుతః నేను కవిని. వేమనపై నా పరిశోధన నా వ్యక్తిత్వంలో వైరుధ్యంగా పరిణమించలేదు. పైగా వేమన్న ఆవేశం, నిజాయితీ నా కలానికి ఇంధనాన్ని సమకూర్చి ఉంటాయి. నాలుగు దశాబ్దాలుగా వేమన్నను వ్యాసంగంగా చేసుకున్న క్రమంలో నాకర్థమైందేమిటంటే వేమన్న లాంటి కవి ప్రపంచ సాహిత్యంలోనే అరుదని.

వేమన సాహిత్యానికి ఇప్పటికీ ఎంతో ప్రాసంగికత ఉంది. ఆయన ఖండించిన దురాచారాల్లో చాలావరకు ఇప్పటికీ వున్నాయి. నేను 'వేమన్న వెలుగులు' వ్యాఖ్యానంలో ఎక్కువగా నేటి యువతను దృష్టిలో పెట్టుకున్నాను. 40 సంవత్సరాల్లో రెండు తరాలను ఉద్దేశించి రాసే అవకాశం నాకు లభించింది. ఈ సందర్భంగా వేమన సాహిత్య పునరుజ్జీవన ప్రయత్నాలను బేరీజు వేస్తుంటే మూడుదశలు కనిపిస్తున్నాయి.

1. బ్రౌన్ తొలి ప్రయత్నాలు. ఈయన వేమన పద్యాలను మొదటిసారి వర్గీకరించి అచ్చులోకి తెచ్చాడు (క్లాసిఫికేషన్).

2. రెండోది దేశీయుల వికాసదశ. సి.ఆర్. రెడ్డి, రాళ్లపల్లి, ఎన్. గోపి తదితరుల ప్రయత్నాలు పలుచర్చలకు దారితీశాయి. వాడుక కథల్లో కూరుకుపోయిన వేమనకు కొంతలోకొంత చారిత్రక స్పష్టత లభించింది. ఆయన తాత్త్విక ధారతో పాటు సామాజిక దిశానిర్దేశం లాంటివి సమకూరాయి.

3. ఇక మూడోది విస్తృతదశ. బహుశా అనంతపురం సభల్లోనే దీనికి ప్రాతిపదిక పడిందని నాకనిపించింది. ఒకే వేదికపైన 14 పుస్తకాలు వెలువడటం, వందలాదిమంది సీరియస్ సాహితీవేత్తలు వివేచనా పరత్వంతో పాల్గొనటం, నేటి యువలోకంలోకి వర్తమాన ప్రాసంగికతతో వెళ్లాలని సంకల్పించటం ఇవన్నీ కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయి. వేమన పద్యాలను గురించిన ఏ వ్యాసంగానికైనా ముగింపు ఉంటుందని నేననుకోను. అది అనంతమైన సముద్రం. కడవను బట్టి నీళ్లు. అయితే వేమన జ్ఞానజలాన్ని పట్టుకోవడానికి రేపటి యువజిజ్ఞాసువులెందరో కొత్తకుండలతో మనసులో మెదులుతున్నారు. సాహితీస్రవంతి వారి తాజాప్రయత్నాలకు స్వాగతం పలుకుతున్నాను.

# రాజకీయ వ్యవస్థ - వేమన చూపు

- మేడిపల్లి రవికుమార్



*వేమన స్పృశించని అంశం లేదు. ఆవిష్కరించని వాస్తవం లేదు. నీరు పల్లానికి ప్రవహించినంత తేలిగ్గా జీవన సత్యాలను, మానవ ధర్మాలను వేమన ప్రవహింప చేశాడు. ఇప్పటికీ ఆ సెలయేరు సజీవంగా జాలువారుతూనే ఉంది. ఎంతకాలం యాతమేసినా ఏరు ఎండనట్టుగా ఎంతకాలంగా వేమన్నను విశ్లేషించుకుంటున్నా ఇంకా మనం స్పృశించని అంశాలు, చేదుకోవలసిన సత్యాలు, అందుకోవలసిన ధర్మాలు ఊటనీరులాగ ఉబికి వస్తూనే ఉన్నాయి.*

దశాబ్దాలుకాదు, ఎన్నిశతాబ్దాలు గడిచినా; కొత్తగా పరిచయం అవసరంలేని అచ్చమైన తెలుగు కవి–వేమన. అనాదిగా మనకు వందలు కాదు, వేల సంఖ్యలో కవులున్నారు. ప్రతి కవినీ ఏదో ఒక విశేషంతో వ్యవహరించుకోవడం మనకు మొదటినుంచీ అలవాటయింది. ఆది కవి, ద్విపద కవి, శతక కవి, భక్తి కవి, బూతుకవి, శృంగార కవి, పదకవి, ప్రబంధకవి, శ్లేషకవి అచ్చతెనుగు కవి, అధ్యాత్మిక కవి, శ్లేషకవి వచన కవి, పద్య కవి... ఇలాంటివన్నీ అలాంటి విశేషణాలే. ప్రాచీన కాలంలో మనకున్న వేలాది కవులను వింగడించుకొని ఈ విశేషణాలన్నింటినీ మనం వినియోగించు కుంటున్నాం, కానీ, ప్రజాకవి అనే విశేషణాన్ని ప్రాచీన కాలపు కవుల్లో మనం వ్యవహరించుకుంటున్న ఒకే ఒక్క కవి వేమన.

ఒక కవికి విశేషణాన్ని వాడుతున్నాము అంటే ఆ కవి సర్వసమగ్రుడు కాదు అని అర్థం. వ్యవహరించిన విశేషణం తప్ప తక్కిన అంశాలలో ఏవేవో వెలుతులున్నాయని భావించవలసి ఉంది. పదనిరుక్తిని బట్టి'కావ్యం చెప్పిన వాడు కవి' అని మనం వ్యవహరించు కుంటున్నాం గాని, ఆ నిర్వచనం సంపూర్ణమైంది కాదు. తన కాలం నాటి సామాజిక వాస్తవికతను సకల పార్శ్వాలలో సశాస్త్రీయంగా ఆవిష్కరించి, ఒక జీవన సత్యానికి రూపం కల్పించేవాడు మాత్రమే కవి. ప్రాచీన కాలానికి చెందిన కవులు ఎంత వెతికినా యుగానికొక్కడు చొప్పున కూడా లేదు. ఇటువంటి సాహిత్య వాతావరణంలో అసలు వెదకకుండానే కన్పించే ఒకే ఒక్క కవి వేమన.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు వేమన కవిత్వాన్ని గాలితో పోల్చారు. గాలి ప్రసరించని ప్రదేశం ఉండదు. వేమన చూపు కూడా అలాంటిదే! తన కవిత్వంలో వేమన స్పృశించని అంశం లేదు. ఆవిష్కరించని వాస్తవం లేదు. నీరు పల్లానికి ప్రవహించినంత తేలిగ్గా జీవన సత్యాలను, మానవ ధర్మాలను వేమన ప్రవహింప చేశాడు. ఇప్పటికీ ఆ సెలయేరు సజీవంగా జాలువారుతూనే ఉంది. ఎంతకాలం యాతమేసినా ఏరు ఎండనట్టుగా ఎంతకాలంగా వేమన్నను విశ్లేషించుకుంటున్నా ఇంకా మనం స్పృశించని అంశాలు, చేదుకోవలసిన సత్యాలు, అందుకోవలసిన ధర్మాలు ఊటనీరులాగ ఉబికి వస్తూనే ఉన్నాయి. అందుకు కారణాలు లేకపోలేదు.

ఏదో ఒక విశేషం లేకుండా ఏ కవినీ మనం మననం చేసుకోలేం. అందులో వేమన్నకూ మినహాయింపులేదు. 'యోగి వేమన' అన్నది ఆయనకు మనం పెట్టుకున్న వ్యవహార నామం. అందుకు తగినట్టుగానే ఆయన రూపాన్ని కూడా మనం చిత్రించుకున్నాం. మొలకున్న ఒక్క గోచిపాత తప్ప

ఒంటిమీద మరేచిన్న వస్త్రం ఆచ్ఛాదనగా కప్పినా ఆయన వేమన కాదు పొమ్మనేంతగా ఆ రూపం లోకంలో స్థిరపడిపోయింది. ఆయనపేరు, ఆయన రూపం సమకాలం నుంచీ ప్రచారంలో ఉన్నదా? మధ్యలో చేరిందా? అన్న చర్చను పక్కన పెడితే ఆయన రచనల్లో ఆవిష్కరించిన భావజాలానికి సామాజికులు కల్పించుకున్న స్థితి అది. అందుకే ఆయన పేరుతో ఒక విశ్వవిద్యాలయాన్ని స్థాపించుకున్నా 'యోగి వేమన' అన్న పేరును చెరపలేదు. వందల సంవత్సరాలు గడుస్తున్నా, కరుడుగట్టే శీతాకాలంలో కూడా ఆయన ఒంటిమీద మనం ఒక చిన్న గొంగళి కూడా కప్పలేదు.

*కావ్య కవులు లక్షణాలకు లోబడి లాక్షణికుల లోగిలిలో నిలబడిపోతారు. ప్రజాకవులు కావ్య లక్షణాల కోటగోడలను బద్దలు కొడతారు. ప్రజాక్షేత్రంలోకి అడుగు పెడతారు.*

'పురుషులందు పుణ్యపురుషులు వేరయా' అని వేమన్నే ఒక చోట అన్నాడు. అందులో ఉన్న అంతరార్థాన్ని అలా ఉంచితే; కావ్య కవులలో ప్రజా కవులు వేరని మాత్రం చెప్పవచ్చు. కవి, కావ్యం వంటి పదాలకు లాక్షణికులు నిర్దేశించిన నిర్వచనాలకు ఈ ప్రజా కవులు ససేమిరా ఇమడరు. వేమన్నను 'యోగి వేమన' అని లోకం వ్యవహరించుకుంటున్నా ఆయన అచ్చమైన ప్రజాకవి. కావ్యం చెప్పిన వాడు కవి అన్న నిర్వచనానికి ఆయన లొంగడు. ఆయన అసలు కావ్యమే చెప్పలేదు గనుక. ఆయన పద్యాలను మనం 'శతకం' అంటున్నాం. ఆలంకారికులు శతకానికి కూడా కొన్ని లక్షణాలు చెప్పారు. వాటిలో నూరు పద్యాలుండాలన్న సంఖ్యా నియమం ప్రధానమైంది. అసలు ఏ శతక కర్తా ఈ నియమాన్ని తూచా తప్పకుండా పాటించలేదు. అయితే ఎక్కడో ఒక దగ్గర ఆగిన సందర్భాల్ని మాత్రం మనం గుర్తిస్తాం. వేమన ఇందుకు పూర్తిగా మినహాయింపు. ఎందుకంటే వేమన ఎన్ని పద్యాలు చెప్పాడో ఇప్పటికీ లెక్క తేల లేదు. నూరు పద్యాలు ఉండడమే శతకం అయితే వేమన చెప్పింది శతకం కాదు, కావ్య కవులు లక్షణాలకు లోబడి లాక్షణికుల లోగిలిలో నిలబడిపోతారు. ప్రజాకవులు కావ్య లక్షణాల కోటగోడలను బద్దలు కొడతారు. ప్రజాక్షేత్రంలోకి అడుగు పెడతారు. ఎక్కడా నిలబడరు. నిరంతరం సంచరిస్తూ ఉంటారు.

ప్రజాకవి వేమన భావనా లోకంలోనే కాదు, వాస్తవ జీవితంలో కూడా ఒక నిరంతర సంచారి. సంచార జీవితాన్ని గడిపిన వాడు. తన మనో వీధిలో కదలాడుతున్న అనేక జీవన సత్యాలను నిరంతరం మననం చేసుకుంటూ ఉండేవాడు. అవి ఏవేవో సణుగుళ్ళుగా, మరేవో గొణుగుళ్ళుగా బైటికి వచ్చేవి. వేమన్నను వెన్నంటి అనుసరిస్తూ వస్తున్న శిష్యులూ, అభిమానులూ వంటి అనుచర గణం ఆ సణుగుళ్ళనూ, గొణుగుళ్ళనూ తమ తమ జ్ఞాపకాల పేటికలో భద్రపరిచేవారు. వారి వారి సామర్థ్యాలను బట్టి జారిపోయినవి జారిపోగా ఏవో కొన్ని మాత్రమే ఆ పేటికలో చోటుచేసుకొనేవి. అవి మాత్రమే ప్రచారంలోకి వచ్చాయి.

వేమన జీవిత విధానాన్ని పరిశీలిస్తే తన చెంత శిష్యగణం ఉన్నప్పుడు మాత్రమే, వారు విని నమోదు చేసుకొనేటట్టు మాత్రమే పద్యాలు చెప్పేవాడు అని అనుకోడానికి వీలు లేదు. తనలో ఏవేవో భావాలు విశృంఖలంగా పెల్లుబికి వచ్చినప్పుడల్లా అవి పద్యాల రూపంలో తన్నుకొని వచ్చేవి. అలా రావడానికి ఒక సమయపాలన ఉండేది కాదు. అది రాత్రి కావచ్చు, పగలు కావచ్చు; అది మండుతున్న ఎండాకాలం కావచ్చు; నిలువు నిలువున నీరు కారేలా ముసురుకొచ్చిన వర్షాకాలం కావచ్చు; నిర్దాక్షిణ్యంగా కాయాన్ని కోత పెడుతున్న శీతాకాలం కావచ్చు. ఆయా సమయాల్లో సమీపంలో ఎవరైనా అనుచరగణం ఉంటేనే వేమన నోటి నుండి వెలువడిన పద్యాలు నమోదు అయ్యేవి. లేకుంటే అవన్నీ శూన్యంలో కలిసిపోయేవి.

శిష్యగణం జ్ఞాపకాల్లోంచి కాలాంతరంలో జారిపోయినవి జారిపోగా; శూన్యంలో కలిసిపోయినవి కలిసిపోగా మిగిలినవి మాత్రమే ఈ రోజు వేమన పద్యాలుగా మన ముందు కదలాడుతూ ఉన్నాయి. వీటి సంఖ్యను మనం 'ఇంత' అని లెక్కచూపలేక పోతున్నాం. మరి, జారిపోయిన వాటి సంఖ్య 'ఇంత' అని ఎలా చెప్పగలం? ఉన్న పద్యాలలోనే వస్తు వైవిధ్యం ఎంతగా ఉందో, ఎన్నెన్ని జీవన సత్యాలకు భాష్యం చెప్పబడిందో ఇప్పటికీ మనం పూర్తిగా విశ్లేషించుకోలేక పోతున్నాం. మరి జారి పోయిన వాటిలో మరెన్ని వస్తువులు, ఇంకెన్ని జీవన సత్యాలు మనకందకుండా కాల గర్భంలో కలిసి పోయాయో కదా! 'గాయ పడిన ప్రతి గుండియలో రాయబడని కావ్యాలెన్నో" అన్నట్టుగా సంఘర్షించిన వేమన గుండెల్లోంచి రాలి పడిన భావాలలో జారిపోయిన పద్యాలెన్నో కదా!?

అయినప్పటికీ, అంతర్గత వైరుధ్యాలు అంతగా లేని వస్తు వైవిధ్యం ప్రదర్శించిన ప్రజాకవుల్లో ఈ నాటికీ వేమనే ముందు వరుసలో నిలబడతాడు. వేమన పద్యాల్లోని ప్రధానమైన వస్తువుల్లో రాజకీయ అంశం ఒకటి. సమకాలంలోని రాజకీయ

వ్యవస్థపై నిశితమైన విశ్లేషణ చేసిన అతికొద్దిమంది కవుల్లోనూ వేమన చూపు ప్రత్యేకమైంది. ఆనాటి రాజకీయ వాతావరణాన్ని కొంత గుర్తు చేసుకుంటే వేమన చూపులోని గాఢత, తీక్షణత మరికొంత స్పష్టమవుతుంది.

*ప్రజాకవులు మాత్రం భౌతిక దృక్పథంతో ఆయాకాలాలనాటి సామాజిక వాస్తవికతను శాస్త్రీయ దృష్టితో పరిశీలిస్తారు, ప్రశ్నిస్తారు, పరిష్కారాలకోసం అన్వేషిస్తారు.*

పాలనా రంగంలో ప్రశాంతంగా ఉండడం అనేది రాజకీయ వ్యవస్థలో ఎక్కడా, ఏనాడూ లేదు. రాచరిక వ్యవస్థ లక్షణమే అది. వేమన ఫలానా రోజు, ఫలానా ఊరులో పుట్టాడని తారీఖులూ దస్తావేజులు ఏమీ దొరకకపోయినా; 17వ శతాబ్దపు కవి అన్నది సాహిత్య చరిత్రకారులందరూ నిర్ధారించిన విషయం.

సాధారణంగా చరిత్ర ఎప్పుడూ సమగ్రంగా సిద్ధించదు. శకలాలు శకలాలుగానే లభిస్తుంది. లభించిన ఈ శకలాలను స్థానిక చరిత్రలతో క్రోడీకరించి చూసినపుడు గత చరిత్రకు ఒక రూపం ఏర్పడుతుంది. ఏర్పడిన రూపాన్ని పరిశీలించినప్పుడు వేమనకు చెందిన 17వ శతాబ్దం నాటి రాచరిక వ్యవస్థ కూడా షరా మామూలుగానే దర్శనమిస్తుంది.

భారతదేశ చరిత్రలో 16వ శతాబ్దం మొదలు 19వ శతాబ్దం దాకా రాజకీయ అస్థిరత ప్రబలంగా ఉన్న కాలం. విజయనగర సామ్రాజ్య పతనం దక్షిణ భారతదేశ చరిత్రను మలుపు తిప్పింది. రాచరిక ముఖచిత్రాన్నే కాక సామాజిక వ్యవస్థను కూడా అతలాకుతలం చేసింది. గోరుచుట్టుపై రోకటి పోటులాగా విజయరామ రాయలకూ, బహమనీ సుల్తానులకూ మధ్య 1565లో యుద్ధం జరిగింది. దీనినే తళ్ళికోట యుద్ధం అని వ్యవహరిస్తున్నాం. ఈ యుద్ధంతో దేశీయ రాజుల పాలనా వ్యవస్థ మరికొంత దెబ్బతింది. విజయనగర సామ్రాజ్యం ఇంకొంతకాలం కొనసాగినా పూర్వపు వైభవాన్ని చాలావరకు కోల్పోయింది. వీటన్నింటి ఫలితంగా 1570 నాటికి విజయనగరం మూడు శకలాలుగా విడిపోయింది. వాటిలో పెనుగొండ ప్రాంతాన్ని శ్రీరంగరాయలు, శ్రీరంగ పట్టణం ప్రాంతాన్ని రామరాయలు పరిపాలించగా; చంద్రగిరి ప్రాంతం వెంకటపతి రాయలు ఆధీనం అయింది. కొంత తమిళ ప్రాంతంతో పాటు, రాయలసీమ జిల్లాలు ఈ వెంకటపతి రాయలు ఏలుబడిలోకి వచ్చాయి. ఇతడు 1586 నుండి 1614 దాకా పరిపాలించినట్టు చరిత్రకారులు భావిస్తున్నారు. వెంకటపతి రాయలు జీవించి ఉన్నంత కాలం రాయలసీమ ప్రాంతాన్ని మహమ్మదీయులు వశం చేసుకోలేక పోయారు. అప్పటికే పతన దిశలో ఉన్న విజయనగర సామ్రాజ్యం వెంకటపతి రాయలు మరణానంతరం మరికొంత శిథిల స్థితికి చేరుకుంది. మరో ముప్పై రెండు సంవత్సరాలపాటు శత్రు సేనలతో కొన ఊపిరితో పోరాడిన విజయనగర సామ్రాజ్యం 1675 నాటికి పూర్తిగా అంతరించింది.

ఈ చారిత్రక అంశాల్ని ఎందుకు ప్రస్తావించుకోవలసి వచ్చిందంటే ప్రజాకవి వేమన ఈ వెంకటపతి రాయలకు కొంచెం తరువాత వాడని చారిత్రకారులు భావిస్తున్నారు. అంటే రాజ్యం అత్యంత సంక్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు వేమన జీవితం గడిచిందని గుర్తించాలి.

ఏ కవికైనా తన చుట్టూ ఒక సామాజిక జీవితం ఉంటుంది. అందులో అనేక కదలికలు ఉంటాయి. కష్టాలు, కన్నీళ్ళు, సుఖాలు, దు:ఖాలు అన్నీ కలబోసి ఉంటాయి. అయితే, వీటన్నింటికీ కొన్ని భౌతిక కారణాలుంటాయి. సాధారణ కావ్య కవులు ఈ వ్యత్యాసాలనూ, ఈ వైరుధ్యాలనూ ఆధ్యాత్మిక వాతావరణంలో సమాధాన పరుచుకుంటారు. ప్రజాకవులు మాత్రం భౌతిక దృక్పథంతో ఆయాకాలాలనాటి సామాజిక వాస్తవికతను శాస్త్రీయ దృష్టితో పరిశీలిస్తారు, ప్రశ్నిస్తారు, పరిష్కారాలకోసం అన్వేషిస్తారు. వేమన ప్రజాకవి కాబట్టి ఆనాటి రాచరికతకు సంబంధించిన అనేక అంశాలను తనదైన చూపుతో విశ్లేషించాడు.

## మతమార్పిడులు

చంద్రగిరి రాజధానిగా వెంకటపతి రాయలు విజయనగర సామ్రాజ్య ప్రాభవాన్ని నిలిపి నంతకాలం ఆంధ్రదేశంలో అప్పటికే బలంగా నిలదొక్కుకున్న ముస్లిం రాజులు రాయలసీమ జిల్లాలను ఆక్రమించు కోలేదు. ఆ తరువాత 1799 దాకా కూడా వీలుకాలేదు. అప్పటికి టిప్పుసుల్తాను జీవించి ఉండటం కూడా ఇందుకు కారణం కావచ్చు. ఏది ఏమైతేనేం 1799 నాటికి రాయలసీమ జిల్లాలు కూడా పూర్తిగా ముస్లిం రాజుల వశమయ్యాయి.

ఏ రాజైనా ఒక రాజ్యాన్ని వశం చేసుకున్నప్పుడు ఆ రాజ్యంయొక్క మత సంస్కృతులపైన పట్టుసాధిస్తాడు. వాటిపైన తన ఆధిపత్యాన్ని ప్రకటిస్తాడు. స్థిరమైన పరిపాలనకు ఇది కొంత అవసరం ఏర్పడుతుంది. ఇందులో భాగంగానే రాయలసీమ జిల్లాల్లోనూ ముస్లిం పాలకులు మతమార్పిడులకు తీవ్రంగానే ప్రయత్నించారు. తన కళ్ళముందు జరుగుతున్న ఈ బలవంతపు మతాంతరీకరణలను వేమన్న తీవ్రంగానే ప్రశ్నించాడు.

**"పసరపు మాంసము బెట్టియు**
**మసలక సులతాను ముసలిమానుల జేసెన్"**

మతమార్పిడులకోసం రాజులు ప్రజలకు ఏయే తాయిలాలను అందించేవారో, ఏ విధంగా ప్రలోభపెట్టేవారో కూడా ఈ వేమన పద్యం ద్వారా చాలా వరకు మనం గ్రహించగలం. ఈ మత మార్పిడులను వేమన ప్రస్తావించడాన్ని బట్టి హిందూమతం పట్ల వేమనకు ఆదరణ భావం ఉందనీ, ముస్లిం మతం పట్ల వ్యతిరేక భావం ఉందనీ భావించడానికి వీలు లేదు. పాలక వర్గాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను ప్రలోభపెట్టడాన్నే వేమన్న ప్రశ్నించాడు.

**రాజుల స్వభావం**

పులుల రంగుల్లో తేడాలుండవచ్చు. వయస్సుల్లో వ్యత్యాసాలుండవచ్చు. ఆవాసాలు వేరు వేరు ప్రాంతాల్లో ఉండవచ్చు. అయినా పులుల లక్షణం ఒక్కటే. వాటి క్రూరత్వమూ ఒక్కటే.

రాజులు కూడా పులుల లాంటి వారే. రాజుల వంశాలు వేరు కావచ్చు; కాలాలు వేరు కావచ్చు. కులాలు వేరు కావచ్చు. ప్రాంతాలు వేరు కావచ్చు. వారి మతాలు కూడా వేరు కావచ్చు. అయినా రాజుల లక్షణం ఒక్కటే. వారి పీడన స్వభావమూ ఒక్కటే.

'రాజు తలచుకుంటే దెబ్బలకు కొదువా?' అన్న సామెత లోకంలో అన్ని కాలాలలోనూ, అన్ని ప్రాంతాలలోనూ ప్రచారంలో ఉందిగాని; 'రాజు ఉండగా ప్రజల అవసరాలకు కరువా?' అన్న సామెత ఏ కాలంలోనూ, ఏ ప్రాంతంలోనూ పుట్టలేదు. వేమన కాలంలోనూ రాయలసీమ రాజుల స్వభావం అందుకుభిన్నం కాదు. ఈ విషయాన్ని అనేక పార్శ్వాలలో వేమన ప్రస్తావించాడు.

స్వభావాన్ని బట్టి రాజులను వేమన మూడు తరగతులుగా విభజించాడని వేమనపై ప్రత్యేక పరిశోధన చేసిన ఆచార్య గోపి వివిధ సందర్భాలలో వివరించారు. వేమన దృష్టిలో రాజులు పిరికిపందలు, దుర్మార్గులు, అజ్ఞానులు. వీరిలో కొందరు పాముల్లాంటివారైతే; మరికొందరు కోతుల్లాంటివారు.

**దుండగీడురాజు కొండీడు చెలికాడు**
**బండరాజునకును బడుగు మంత్రి**
**కొండ ముచ్చునకును కోతియె సరియగు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

రాజు మాత్రమే కాదు, రాజు కొలువులో ఉన్న ఇతర ప్రముఖులు కూడా రాజుకేమాత్రం తీసిపోని వారే!

**చంపదలచు వారు చనవగ్గలంబిచ్చు**
**చెరుపనున్న పగటి చెలిమి సేయు**
**గంపనున్న పాము నెరిగాచుకొనియుండు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

రాజుల కుటిలత్వాన్నీ, క్రూరత్వాన్నీ వేమన లోతుగా పరిశీలించాడు కాబట్టే వారి నైజాన్ని ఇంత స్పష్టంగా చెప్పగలిగాడు. రాజులెప్పుడూ ప్రజల పట్ల పాలకులుగా వ్యవహరించలేదు. ప్రజలను కాటు వేయదలచుకున్న కాలసర్పాలు గానే ఉన్నారు.

**రాచరిక పాలన – ప్రజలు**

పరిపాలించే రాజు ఎవరైనా, రాచరిక వ్యవస్థలో సామాన్య ప్రజల జీవన విధానం ఇంచుమించు ఎప్పుడూ ఒకేలా ఉండేది. నిజానికి రాచరిక వ్యవస్థ స్వభావమే అలాంటిది. వేమన కాలంలోనూ ఏరాజులూ ప్రజలను సుభిక్షంగా పరిపాలించిన దాఖలాలు లేవు. ప్రజలకు పాలకులు పట్టుకొమ్మలుగా నిలిచిన పరిస్థితి కూడా ఏనాడూ లేదు.

వేమన కాలంలో రాచరిక వ్యవస్థ తీవ్రమైన అస్థిరత్వంలో ఉందని గమనించాం. నిరంతరం శత్రురాజుల దాడులు, దండయాత్రలు జరుగుతూ ఉండేవి. స్థానికంగా తమను తాము రక్షించుకోవడంలోనే నిమగ్నమై ఉండేవారు గాని, ప్రజలను పరిరక్షించేపనికి పూనుకున్న సందర్భాలు ఏనాడూ లేవు.

శత్రురాజ్యాల సైనికులు ఊళ్ళమీదపడి సామాన్య ప్రజలను హింసించేవారు. ఇళ్ళల్లో చొరపడి ఉన్న కొద్దిపాటి వనరులనూ వదలకుండా నిలువునా దోచుకొనేవారు. ఊచకోతలు కోసి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన సందర్భాలు కూడా లేకపోలేదు. చాలా సందర్భాలలో సమాజంలో శ్మశాన వాతావరణం అలుముకొని ఉండేది. మృత్యు ధూళి ఆవరించిన అటువంటి సమయాలలో కూడా పాలకులు ప్రజలకు కనీస రక్షణ కల్పించిన దాఖలాలు లేవు.

ప్రజలకు రక్షణ కల్పించలేదు సరిగదా, తమను తాము కూడా రక్షించుకోలేక పోయేవారు. కొన్ని సందర్భాలలో శత్రుసైనికులకు భయపడి పలాయనం చిత్తగించిన సంఘటనలు కూడా లేకపోలేదు. ఈ విషయాలన్నింటినీ వేమన పూసగుచ్చినట్టుగా అక్షరబద్ధం చేశాడు.

**పర బలంబు జూచి ప్రాణరక్షణమున**
**కురికి పారిపోవు పిరికి నరుడు**
**యముడు కుపితుడైన నడ్డంబు యెవరయా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

ఇటువంటి రాజులనే వేమన పిరికి పందలుగా పరిగణించాడు. తమకుతామే రక్షించుకోలేని స్థితిలో

రాజులున్నప్పుడు ప్రజలను రక్షించేదెవ్వరు? 'మహిపతి' అన్న మాట ఈ రాజులకు ఎలా వర్తిస్తుందని వేమన సూటిగా ప్రశ్నించాడు.

**పుడమి యుప్పరంబు పురికొనేజగముల**
**రక్షసేయగలుగు రాజులేరి?**
**మహిపతియని పేరు మనుజునికేలనో**
**విశ్వదాభిరామ వినురవేమ!**

పిరికి పందలైన రాజులకు బిరుదులు పొందే అర్హత లేదన్నది వేమన్న తీర్పు. అలంకార భూషణాలుగా బిరుదులు తగిలించుకొని ఊరేగే రాజులను వేమన్న తీవ్రంగానే అధిక్షేపించాడు.

**పందనధికు జేసి బవరంబునకు బంప**
**పారిపోవు కార్య భంగమవును**
**పిరికి బంటు కేల బిరుదు గొడుగు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

రాజులు పిరికిపందలు, అసమర్థులు అయినప్పుడు వాటి పరిణామాలు విషమంగా ఉంటాయి. అధికార్ల పైనా, ప్రజలపైనా తీవ్రమైన ప్రభావాన్ని చూపుతాయి.

నమ్మించిమోసం చేయడం అనేది ఆనాటి పాలకుల సహజ లక్షణంగా ఉండేది. నమ్మిన వాళ్ళనే ఎవరైనా మోసం చేయగలిగేది. ప్రజలు పాలకులను అమాయకంగా నమ్ముతున్నారు కాబట్టే పాలకులు ప్రజలను సులభంగా మోసం చేయగలుగుతున్నారు. వేమన కాలానికే ఇది అనుభవంలోకి వచ్చిన విషయం. అందుకే రాజుల స్వభావాల గురించి వేమన చాలా స్పష్టంగా తెగేసి చెప్పాడు.

**పట్టనేర్చుపాము పడిగ యొరగజేయు**
**చెరుప జూచురాజు చెలిమి జేయు**
**చంపదలచు రాజు చనువిచ్చు చుండురా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

ప్రజల్ని పాలనపేరుతో మోసం చేయడంలోనూ, దోచుకోవడంలోనూ రాజుల వ్యవహార శైలి ఎంత విషపూరితంగా ఉండేదో వేమన స్పష్టం చేశాడు. ఇటువంటి పాలకులను ప్రజలు ఎంత వరకు విశ్వసిస్తారు? ఎంతకాలం విధేయులుగా ఉంటారు? అందుకే వేమన ప్రజల పక్షంగా గొంతు విప్పాడు.

**ఎంత సేవ జేసి ఏ పాటు పడినను**
**రాచమూక నమ్మరాదురన్నా!**
**పాముతోటి పొత్తు పదివేలకైనను**
**విశ్వదాభిరామ వినురవేమ!**

రాజును విశ్వసించడం, పాముతోటి పొత్తు పెట్టుకోవడం వంటిదని వేమన ప్రజలకు స్పష్టం చేశాడు.

**ఎరుకలేని దొరల నెన్నాళ్ళు గొలిచిన**
**బ్రతుకులేదు వట్టి భ్రాంతిగాని,**
**గొడ్డుటావు పాలు గోకితే చేపునా?**
**విశ్వదాభిరామ వినురవేమ?**

పాలకుల కొలువు ప్రజలకు ఎంత వ్యర్థమో కూడా తెలియచేశాడు. అంతేకాదు, 'అల్పబుద్ధివాని కధికార' మివ్వవద్దని ప్రజలను వేమన అప్రమత్తం చేశాడు. 'వెర్రిగొల్వరాదు విభుడెంత వాడైన' అని ప్రజలకు ప్రబోధ చేశాడు.

## ఆస్థానకవుల అవహేళన

రాచరిక వ్యవస్థలో రెండు వర్గాల కవులుండేవారు. ఒకరు ఆస్థాన కవులు, మరొకరు ఆస్థానేతర కవులు. రాజాస్థానాల లోపల ఉండేవారు ఆస్థాన కవులు. వెలుపల ఉండేవారు ఆస్థానేతర కవులు. పాలక వర్గాల ప్రయోజనాలకు, వారి ఆకాంక్షలకూ బద్ధులై కావ్య రచన చేసేవారు ఆస్థాన కవులు. వీరికి స్వాతంత్ర్యం ఉండదు. రాజు చెప్పిందే శాసనం.

ఆస్థానేతర కవులు సంపూర్ణ స్వాతంత్ర్యులు. రాజాజ్ఞలకు లోబడి ఉండరు. తమ అభీష్టం మేరకు రచనలు చేస్తారు. ఆస్థానేతర కవులందరూ ప్రజాకవులు కాక పోయినా ప్రజాకవులు మాత్రం ఆస్థానేతర కవులే!. వేమన ఆస్థానేతర ప్రజాకవి. మాటలకూ చేతలకూ సరిహద్దురేఖలులేని జీవితాన్ని గడిపిన కవి. ప్రజలకు ఏమి చెప్పాడో తానూ అలాగే జీవించాడు. రాచరిక వ్యవస్థలో జీవించినా రాచరికాన్నీ, నిరంకుశ పాలకవర్గాన్ని ధిక్కరించిన కవి అని మనం ఇప్పటికే గమనించాం.

రాజులు నిరంకుశులు అని తెలిసినా, వారిసేవ నిరర్థకమని భావించినా; వారి ప్రాపకంలోనే ఉంటూ, వారికొలువులోనే జీవితాల్ని తెల్లవారిస్తూ రాజుల మెప్పు కోసం కావ్య రచన చేస్తున్న కవులు ఆస్థాన కవులు. రాచరిక వ్యవస్థను వ్యతిరేకించిన వేమన ఆస్థాన కవులను కూడా అంతే సహజంగా వ్యతిరేకించాడు.

**తోటకూరకైన దొగ్గలికైనను**
**తవిటికూరకైన తవిటికైన**

**కావ్యములను చెప్పు గండ్యాలు ఘనమైరి**
**విశ్వదాభిరామ వినురవేమ!**

అని తీవ్రంగా అవహేళన చేశాడు. ఇలాంటి వెన్నుపూస లేని కవులను చీదరించుకున్నాడు. రాజులపైనా రాచరిక వ్యవస్థపైనా వేమనకు ఎంతటి తిరస్కార భావముందో ఇలాంటి పద్యాలు బలంగా నిరూపిస్తాయి.

## యధారాజా తధా పరివారం

'యధారాజా తధా ప్రజ' అన్నదిలోకానికి తెలిసిన మాట. కానీ, 'యధారాజా తధా పరివారం' అనేది పిరికి పందలైన వేమన కాలం నాటి రాజులకు చెందిన ఉవాచ.

వేమన కాలంలో దేశాన్ని పాలించిన రాజులెవరైనా ప్రజల్ని ప్రత్యక్షంగా పరిపాలించింది మాత్రం కొందరు రాజ ప్రతినిధులు, మరికొందరు సైన్యాధికారులు, ఇంకొందరు పాలెగాళ్ళు. ప్రజల పట్ల రాజులకే నిబద్ధత లేనప్పుడు ఇతర పాలక వర్గాలకు ఉండాలనీ, ఉంటుందనీ అనుకోవడం వృధా ప్రయాసే! రాజులను వేమన కోతులుగా, పాములుగా పరిగణించిన విషయం ఇంతకు ముందే గుర్తించాం. ఇతర పాలక వర్గాల తీరు తెన్నులను కూడా వేమన అదే చూపుతో ఇలా స్పష్టం చేశాడు.

**ప్రభువు కోతియైన ప్రగడల్ పందులు**
**సైనికుండు నిక్కి సేనలు పసులు**
**ఏన్గుల శ్వచయము లెలుకలు పిల్లులు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

ప్రజలను పీడనలకు గురిచేయడంలోనూ, ప్రజలను అణచి వేయడంలోనూ ఈ పాలెగాళ్ళు రాజులకెవరికీ తీసిపోలేదు. విజయనగర సామ్రాజ్యం పతనమయ్యాక రాయలసీమ ప్రాంతం కూడా ఎందరో నవాబుల వశం అయింది. అయినా ఏ నవాబూ ఈ పాలెగాళ్ల ఆగడాలను అణచివేయలేక పోయాడు. ఈ పాలెగాళ్ళ పాలనా విధానాలపైన తీవ్రమైన ఆగ్రహాన్ని ప్రకటించిన వేమన వారిని అంత కంటే తీవ్రంగా హెచ్చరించాడు. వీరి ఆగడాలకు కాలం చెల్లక తప్పదనీ, వీరంతా కాల గర్భంలో కలిసిపోక తప్పదనీ వేమన ఆగ్రహించాడు.

**పెక్కు నూళ్ళగొట్టి పేదల వధియించి**
**డొక్క కొరకు నూళ్ళు దొంగిలించి**
**యెక్కడ కరిగిన నెరిగి యముడు చంపు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

పాపపుణ్యాలు, పూర్వ జన్మలు, పునర్జన్మలు వంటి వాటి పట్ల లోకుల్లో ఉన్న విశ్వాసాలు వేమనకు లేవు. పాలెగాళ్ళ పతనాన్ని సూచించడానికే వేమన ఇక్కడ యముని ప్రస్తావన తీసుకొచ్చాడని భావించాలి. ఇదే సందర్భంలో వేమన పాలిగాళ్ల గురించి మరో అంశాన్ని కూడా ప్రస్తావించాడు.

**లంక యేలినట్టి లంకాధిపతి పురి**
**పిల్లకోతిపౌజు కొల్లబెట్టె**
**చేటు కాలమునకు చెరుప నల్పులెచాలు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

అని రామాయణాంతర్గత అంశాన్ని సమన్వయించి హెచ్చరించాడు. వారికి చేటు కాలం తప్పదని స్పష్టం చేశాడు.

## ముగింపు

వేమనను ప్రాచీన కాలపు కవి అని కొందరంటారు. పదిహేడో శతాబ్దానికి చెందిన కవి అని మరికొందరంటారు. రాయలసీమ ప్రాంతం కవి అని ఇంకొందరంటారు. ఫలానా కులానికి చెందిన కవి అని ఆ కులానికి చెందిన వారు వేమనను సొంతం చేసుకొనే వారూ లేకపోలేదు.

నిజమే! ఏ కవికైనా ఒక కాలం ఉంటుంది. ఒక ప్రాంతం ఉంటుంది. ఒక కులం ఉంటుంది. ఒక మతం ఉంటుంది. ఒక తాత్విక చింతన కూడా ఉంటుంది. ఈ చింతనను బట్టి కాలం, కులం వంటి వాటికి అస్తిత్వాలుంటాయి. వేమనకున్న తాత్విక చింతన ఇతరుల కంటే అతీతమైంది. అది ఏ కాలానికీ, ప్రాంతానికీ, కులానికీ, మతానికి కట్టుబడనిది. వేమన చూపు సుదీర్ఘమైంది. సజీవమైంది. అందుకే వేమన ఆలోచనలు ఈ నాటికీ అవసరంగానే ఉన్నాయి. ఈ నాటికీ అందుకోవలసినవిగానే ఉన్నాయి. ఈనాటికీ ఆచరించదగినవిగానే ఉన్నాయి. 'విశ్వదాభిరామ వినురవేమ' అన్న మకుటాన్ని కప్పిచూపిస్తే ఆ పద్యాలను ఈనాటి పాలకవర్గాలను దృష్టిలో పెట్టుకొని ఎవరో వర్తమాన కవి, ప్రజాపక్షం వహించిన మేధావి, సమాజాన్ని మేల్కొల్పడం కోసం కలం పట్టిన ఒక వైతాళికుడు రచించినట్టుగానే అనిపిస్తాయి.

వేమన ప్రజల్లోంచిపుట్టాడు. ప్రజల కోసం కలం పట్టాడు. ప్రజలకోసం జీవించాడు. అందుకే రాచరిక, భూస్వామ్య, ధనస్వామ్య వర్గాలను ధిక్కరించాడు. ప్రజాస్వామ్య సంస్కృతికి శ్రీకారం చుట్టాడు. ఈ వరసలో వేమన మన ఆదికవి, మహాకవి, ప్రజాకవి, మనకవి.




# వేమన కవిత్వం అభివ్యక్తి నైపుణ్యం

- కొలకలూరి మధుజ్యోతి

*వేమనను ప్రజలు ఎందుకు ఆదరించారు? ఎందుకు గుండెకు హత్తుకున్నారు? 1650 ప్రాంతం వాడిగా(వేమన వాదం - ఎన్.గోపి) భావించబడిన వేమన, శతాబ్దాలుగా ప్రజల నాల్కలపై నర్తించటానికి కారణం ఏమిటి? నేటి కర్ణాటక తమిళ ప్రాంతాలలో చావు పెళ్ళి సందర్భాలలో వేమన పద్యాలు పాడుకొంటార(విశ్వకవి వేమన IV)ని గర్వంగా చాటుకొంటున్నాం. వేమనను రాష్ట్ర పరిధిని కూడా దాటించిన ఘనత ఏమిటి?*

విశ్వకవి వేమన, ప్రజాకవి వేమన, సామాజిక కవి వేమన, ఆదర్శ కవి వేమన, సంఘ సంస్కర్త వేమన, యోగి వేమన అని వేమనను మనం నిత్యం తలచుకొంటూనే ఉన్నాం. ఇన్ని రకాలుగా తలచుకోవటంలోనే వేమన తెలుగువారికి ఎంత సన్నిహితుడో అర్థం అవుతుంది. వేమనను తరాలుగా తెలుగు వారికి దగ్గర చేసినది వేమన సాహిత్యం. సాహిత్యాన్ని వారధిగా చేసుకొని కాలాల పొడుగునా జీవిస్తూ సాగుతున్న ధన్యజీవి వేమన.

వేమన రచనలు సామాజికులకు చేరువగా ఉండే లక్షణాన్ని కలిగి ఉన్నాయి. వేమన బ్రాహ్మణ, కోమటి వ్యతిరేకి అని, స్త్రీ ద్వేషి అని సిద్ధాంతాలున్నాయి. వేమన పుట్టిన చోటును కాలాన్ని గూర్చి బహు చర్చ ఉంది. వేమన కులం పట్ల కూడా ప్రశ్నార్థకాలే. ఇంత గందరగోళమూ చాలనట్టు, చాలా పద్యాల పట్ల వేమనవేనా అనే అనుమానం ఉంది.

వేమనలో కులనిరసన ఉంది. కమ్యూనిస్టులు ఆర్థిక కోణం వీక్షించారు. భావవాదులు వేమనను వడపోశారు. వేమనలోని రసవాదాన్నీ పరీక్షకు పెట్టారు.

వేమన పట్ల ఇన్ని ఆలోచనలు, అనుమానాలూ వేమనను మళ్ళీ మళ్ళీ తరచి చూడటానికి కారణం అవుతూ ఉన్నాయి. వీటన్నింటికీ దూరంగా మరో కొత్తకోణం కూడా ఉంది వేమనను పరామర్శించటానికి. అది వేమనలోని వ్యక్తీకరణ సామర్థ్యం. వేమనను ప్రజలు ఎందుకు ఆదరించారు? ఎందుకు గుండెకు హత్తుకున్నారు? 1650 ప్రాంతం వాడిగా(వేమన వాదం - ఎన్.గోపి) భావించబడిన వేమన, శతాబ్దాలుగా ప్రజల నాల్కలపై నర్తించటానికి కారణం ఏమిటి? నేటి కర్ణాటక తమిళ ప్రాంతాలలో చావు పెళ్ళి సందర్భాలలో వేమన పద్యాలు పాడుకొంటార(విశ్వకవి వేమన IV)ని గర్వంగా చాటుకొంటున్నాం. వేమనను రాష్ట్ర పరిధిని కూడా దాటించిన ఘనత ఏమిటి?

ఈ ప్రశ్నలకు, ఇలాంటి ప్రశ్నలకు సమాధానం వేమనకున్న వ్యక్తీకరణ సామర్థ్యమే. ఆ వ్యక్తీకరణ ఎలా ఉంది. ఎలా చూడవచ్చు అంటే పలు మార్గాలు కనిపిస్తున్నాయి.

**I. Expressionism:** 19వ శతాబ్దపు చివరిలో 20 శతాబ్ది తొలినాళ్ళలో యూరోపులో ముఖ్యంగా ఫ్రాన్సు జర్మనీలలో తలెత్తిన వాదం అభివ్యక్తవాదం. Expressionism అనే ఆధునికవాదం కవిత్వంలో చిత్రలేఖనంలో తలెత్తినది. 'Its typical trait to present the world solely from a subjective perspective, distorting it radically for emotional effect in order to

evoke moods or ideas' (wikipedia app). వస్తుమయ ప్రపంచం ఎలా ఉన్నది అనే దృష్టితో కాకుండా ఆత్మగతానుభవాన్ని చెప్పటమే expressionism లోని విశిష్ట గుణం, అది ఆలోచనలను రేకెత్తించే క్రమంలో, ఉద్వేగాల ప్రభావాన్ని చెదరగొట్టుంది.

'... a movement or tendency that strives to express subjective feelings and emotions rather than to depict reality or nature objectively .... In expressionism the artist tries to present an emotional experience in its most compelling form. The artist is not concerned with reality as it appears but with its inner nature and with the emotion aroused by the subject' (autocww.colorado.edu). వస్తు ప్రధాన ప్రకృతిలో వాస్తవాన్ని చిత్రించటం కంటే, ఆత్మగతమైన భావాలను ఉద్వేగాలను వ్యక్తం చేయటానికి తపనపడే ఉద్యమం లేదా ధోరణి ఇది. దీనినే A.H.Abrams 'The central feature of expression is a radical revolt against realism' (A Glossary of literary terms) అని పేర్కొన్నాడు. ఇందులో కళాకారుడు ఉద్వేగభరిత అనుభూతిని పంచుతాడు. కనిపించేది కాక, అది కలిగించిన ఉద్వేగం అతనికి ప్రధానం. వాస్తవికతకు వ్యతిరేకంగా తలెత్తిన తిరుగుబాటే ప్రధాన లక్షణం అభివ్యక్తి వాదానికి. 'In literature expressionism is often considered a revolt against realism and naturalism, seeking to achieve a psychological or spiritual reality rather than record external events in logical sequence' (www.infoplease.com). వాస్తవికతకు భిన్నంగా, మానసిక ఆధ్యాత్మిక వాస్తవికతను తెల్పేది అభివ్యక్తి వాదం.

అభివ్యక్తి వాదం వాస్తవికతకు ప్రాకృతికాంశానికి భిన్నమైనది. దృగ్గోచరం అయ్యే విషయం కాక అది కల్పించే మానసిక ఆధ్యాత్మిక భావోద్వేగ వ్యక్తీకరణ అభివ్యక్తి వాదం. ఇది అత్యాధునిక కాలంలో జన్మించిన వాదం. 1650 ప్రాంతం వాడిగా చెప్పుకొంటున్న వేమన్న పద్యాలకు ఆధునిక వాదాలను ఆపాదించటం ఎంతవరకు సబబు? లక్ష్య లక్షణ సమన్వయం సాధ్యమా? కాలాంతరాల లక్ష్యలక్షణాలు పరచటం సమన్వయ సాధ్యమా?

లక్ష్యం అంటూ ఉంటే లక్షణం ఆపై ఏర్పడుతుంది. పూర్వం రచనలకు లక్షణాన్ని అన్వయించటం పరిపాటి. లక్షణాలు ఏర్పడ్డాక రచనా నిర్మాణం సులువుగా సాగుతుంది. లక్ష్యం లేకుండా లక్షణం ఏర్పడదు. లక్షణం ఏర్పడ్డాక తదనుగుణ రచనలు వెలువడుతూ, కొత్త కొంగొత్త అంశాలను లక్షణాలకు జోడింపబడతాయి. కనుక లక్ష్యంగా ఉన్న వేమన పద్యాలకు expressionism అన్వయం అసమంజసం కాదు పూర్తిగా సబబు, సాధ్యమూ. ఎందరో చేసిన రచనల ఆలోచనల ఫలితమే అభివ్యక్త వాదం. అది పాశ్చాత్య దేశాలలో ఉద్భవించినా, వేమన పద్యాల తర్వాత కాలాలలో పుట్టినా, దానిని ఈ పద్యాలకు అన్వయించటం తప్పూ కాదు, అసాధ్యమూ కాదు.

వేమన్నలో స్వేచ్ఛాభివ్యక్తి ఉంది. ఉద్వేగజనిత అభివ్యక్తి ఉంది. బాహిరంగా గమనిస్తే, పాశ్చాత్య ధోరణిని వేమన పద్యాలకు అన్వయించటానికి మౌలిక లక్షణమే విభేదిస్తుంది. వేమన సమకాలీన సమాజ వాస్తవ స్థితిగతులను నిలదీసినవాడు. సమాజ వాస్తవస్థితే వేమనకు ముడి సరుకు. కనుక వాస్తవికతకు దూరంగా తన అంతర్లీన స్పందనల ప్రాముఖ్యం ఇక్కడ వర్తించదు. ఇది కాదు వేమనలోని అభివ్యక్తి సామర్థ్యం.

కాని లోతుగా గమనిస్తే కొంత అన్వయానికి దక్కక పోదు. వాస్తవాన్ని నిరాకరిస్తూ, అది కల్పించే భావోద్వేగాల వ్యక్తీకరణ వేమన్నలో చాలా ఎక్కువ. Revolt against realism చాలా స్ఫుటంగా కనిపిస్తుంది వేమన్నలో కుల నిరసనలో మూఢ విశ్వాసాల. నిరసనలో అదే స్పష్టంగా కనిపిస్తుంది. పాశ్చాత్య ధోరణి expressionism కొంతవరకు వేమన పద్యాలకు అన్వయించవచ్చు.

**'రాతి బొమ్మకేల రంగైన వలువలు**  
**గుళ్ళు గోపురములు గుంభములును**  
**కూడు గుడ్డ తాను గోరునా దేవుండు'**

సమాజం దేవుళ్ళను పూజిస్తుంది. పూజల పేరిట, భగవంతుడి పేరిట అనంతమైన ఖర్చు చేస్తుంది. మతం మానవసేవే మాధవసేవ అంటుంటే సమాజంలోని జనులు ఆ మాట విస్మరించి దేవుడి పేరిట దేవుడు కోరనైనా కోరని వస్త్రాలు, గుళ్ళు గోపురాలు కుంభాలు ఇస్తూ అనవసర ఖర్చు చేస్తున్నారు. కూడు గుడ్డ కోరడు దేవుడు. అయినా సమాజం ఇస్తూ ఉంది. తను చుట్టూ కూడు గుడ్డ కోరేవాళ్ళు ఉంటే వారిని సమాజం పట్టించుకోవటం లేదు.

**'లెక్కలేనియాశ లీలమై యుండగా**  
**తిక్క యెత్తి నరుడు తిరుగుగాక**  
**కుక్క వంటి మనసు కూర్చొండనిచ్చునా'**

మనిషి ఆశకు అంతు లేదు. అదే ఆశ మనిషి వెర్రివాడిని చేస్తుంది. తిక్క పూని మనిషి చెలరేగిపోతాడు. తన ఆశ తీరేదాకా మనిషి నిలువలేడు. ఆ నిలువలేని గుణం కుక్క వంటి మనసుగా అభివర్ణించాడు వేమన. మనిషికి స్వాభావికమైన ఆశ అనే గుణం ఎంత నీచమో చెప్పాడు. వాస్తవికమైన ఈ స్వభావాన్ని నిరసించటంలోనే మనిషి ఎలా ఉండాలో సూచించాడు. వాస్తవ స్థితి పట్ల తిరుగుబాటు వేమనలో చాలు స్పష్టంగా కనిపిస్తుంది.

**II. Communicative skills :** ఈ రోజు, కార్పొరేట్ జీవితానికి అవసరమైన సామర్థ్యంగా Communicative skills ను పెంపొందించటానికి తర్ఫీదు నిస్తున్నారు. ఇప్పటి ఈ అంశాన్ని మన ఆలంకారికులు ఔచిత్యం అని గుణం అని రీతి అని వివిధ రకాలుగా పద్యానికి అనుగుణంగా చెప్పారు. పరిధి ప్రమేయం లేకుండా వేమన తన ధోరణిలో సాగాడు. వేమన మార్గం నేటి Communicative skills లో బోధించే విషయాలకు ఎంత దగ్గరగా ఉందో లక్ష్యలక్షణ సమన్వయం చేస్తే తెలుస్తుంది. Communicative Skills - Learning, Speaking, Writing and Reading skill అని నాలుగు రకాలు. అందులో Speaking Skills కి Oral Communication Skill కి నిదర్శనం వేమన.

వేమన వ్యక్తీకరణకు లక్ష్యం ప్రజలు. కనుక ప్రజలు ఏ విధంగా ప్రభావితమవుతారో ఆ విధంగా పద్యాలను చెప్పాడు వేమన వేమన పద్యాలు చెప్పాడు, రాయలేదు. ఇది Oral Communication. 'Oral Communication is the spoken means of effective expression of ideas, positions perspectives or view points to others individually or in group situations' (L.S. - Loveleen Kaur). వేమన తన ఆలోచనలు, దృష్టి కోణాలను ఆవిష్కరించటానికి పద్యాన్ని అందులోనూ ఛంద క్లిష్టతలేని, జనం నాలుకపై నాలుగు కాలాలపాటు సాగగల ఆటవెలదిని గ్రహించాడు.

**'ఉప్పు కప్పురంబు నొక్క పోలిక నుండు**
**చూడజూడ రుచుల జాడ వేరు**
**పురుషులందు పుణ్య పురుషులు వేరయా'**

ఆధునిక ధోరణి అయిన అభివ్యక్తి నైపుణ్యాలు నిత్య జీవితావసరాలు. అటువంటివి నాడే వేమన రచనలో కనిపించటం విశేషం.

**1. Clarity & Brevity:** స్పష్టత. సంక్షిప్తత వేమన శక్తులు. దేన్నైనా సందిగ్ధత లేకుండా చెప్ప గల సమర్థుడు. ఈ రకమైన వ్యక్తీకరణ (Oral Communication)లో స్పష్టత (Clarity), సంక్షిప్తత (Brevity) ఉండి తీరాలి. వేమన తాను చెప్పదలచుకొన్న ఆలోచనను ఎంత నిక్కచ్చిగా చెప్పాడో, ఆటవెలదిని గ్రహించి సంక్షిప్తతకు ఎంత పెద్ద పీట వేశాడో గ్రహించవచ్చు. '....చెప్పదలచుకొన్న భావాన్ని తగిన విస్తీర్ణంలోనే క్లుప్తంగా చెప్పటం' ఒక ప్రత్యేకతగా చెప్పాడు చేకూరి రామారావు (వేమన్న వాదం, ఎన్.గోపి VI).

**'ఎంత చదువు చదివి ఎన్ని నేర్చినగాని**
**హీనుడు గుణంబు మానలేడు**
**బొగ్గు పాలగడుగ బోవునా మలినంబు'**

సంక్షిప్తత, స్పష్టతలు వేమన సొంతం.

**2. Enthusiasm:** ఉత్సుకత, పద్యం ప్రజల నాలుకల పై నర్తించటానికి ఒక కారణం ఉత్సుకతే. పద్యశైలి, పద్య నిర్మాణం వేమనలో ప్రత్యేకంగా ఉంది. ఉత్సుకత అదనపు శక్తి అయి శైలిలో భాగం అయి, ప్రజలలో మౌఖికంగా వ్యాప్తి చెందగల శక్తిని పొందింది. వ్యక్తీకరణ సామర్థ్యాన్ని పెంచే మరో లక్షణం ఉత్సుకత లేదా ఆసక్తి **(Enthusiasm).** వేమన రచనలో ఇది పుష్కలంగా ఉంది. ఏ పాదానికి ఆ పాదం ఎత్తుగడగా ఉండి దేన్ని చెప్పబోతాడా? చురకెలా వేస్తాడా? ఏ అంశాన్ని తూర్పార బడ్తాడా? వంటి ఆలోచనలతో సాగి మూడో పాదంతో ఆ సస్పెన్స్ భగ్నమై స్పష్టత ఏర్పడుతుంది.

**'నీళ్ళలోన మీను నిగిడి దూరము పారు**
**బయల బారెడైన పారలేదు'**

దీన్నెందుకు చెప్తున్నాడు అన్నది మూడో వాక్యంతో స్పష్టం అవుతుంది. **స్థాన బలిమిగాని తన బల్మికాదయా'** అని. మరో నిదర్శనం.

ఏం చెప్పబోతున్నాడు? దీనిని ఎందుకు చెప్పాడు? నీటిలో చేప స్వేచ్ఛగా విహరిస్తుంది. దాని కదలికలు 'నిగడి దూరం పారటాన్ని' వివరిస్తుంది. అదే చేప బయట ఉంటే కొంతైనా ముందుకు సాగలేదు. అదీ సహజమే. నీటిలో అంతగా పారాడే చేప బయట పారాడలేదు. అది దాని సామర్థ్యం కాదు. 'స్థాన బలిమి' అంటూ వాస్తవాన్ని చెప్పాడు. పరిమితులలో జీవించే మనిషి కూడా తనవైన పరిసరాలలో ఎగిరెగిరి పడతాడు. కానిచోట అణిగిమణిగి ఉంటాడు. ఇలాంటిదే మరో నిదర్శనం.

**'నీళ్ళలోన మొసలి నిగిడి ఏనుగుబట్టు**
**బయట కుక్క చేత భంగపడును**
**స్థానబలిమి కాని తన బల్మికాదయా'** ఇలాంటిదే మరొకటి

**'చిక్కియున్న వేళ సింహంబునైనను**

**బక్క కుక్కయైన బాధసేయు**

**బలిమి లేని వేళ పంతముల్ చెల్లవు'** ఎంత వాస్తవమిది. యవ్వనంలో ఎగిరెగిరి పడిన వాడు వృద్ధాప్యంలో ఎలాంటి స్థితిని అనుభవిస్తాడు. నాటి రోష పౌరుష పంతాలు నేటి వృద్ధాప్యంలో సాధ్యమా? ఆ వాస్తవాన్నే చెప్తుంది ఈ పద్యం. ఉత్సుకత ఎల్లెడలా వ్యాపించి ఉంటుంది వేమన పద్యాలలో.

**3. Informal Communication:** అభివ్యక్తి (Communication) లో Formal, informal అని రెండు రకాలు ఉంటాయి. పద్ధతిగా, ఒక క్రమంగా సాగితే Formal Communication అంటారు. ఎలాంటి నియంత్రణా లేనిది Informal Communication. సమాజంలోనికి తన ఆలోచనలను యథోచితంగా ప్రచారం కావటానికి వేమన గ్రహించిన పద్ధతి informal Communication. దీని కొరకు వేమన, తన ఆలోచనలను, ఉపయోగించాడు. Informal Communication లో ఓ క్రమత ఉంటుంది. ప్రజలకు తమది అనే భావన కలిగించే అంశాలను వేమన ఎన్నుకొన్నాడు. అవి తన ప్రజలను కట్టిపడేసే ఆకర్షక లక్షణాలు అయ్యాయి. మలయానిలాలు, చకోరాలు, హిమవత్పర్వతాలు వంటివి ససేమిరా వేమన పద్యాలలో కనపడవు కుక్క, చెరకు, కొండ, అద్దం వంటివి. సామాన్యుడికి నిత్యజీవనంలో తారసపడే విషయాలు వస్తువులే పద్యంలో ఉంటాయి. దాని వలన సామాన్యుడికి ఆ పద్యం పట్ల భ్రమలు ఉండక, వాటి పట్ల ఒక ఆత్మీయ భావం ఏర్పడుతుంది. ప్రాచీన కవుల కవి సమయాలు వేమన్న పట్టించుకోలేదు. వేమన్న పై ఎవరి నియంత్రణా లేదు. వేమన్న అభివ్యక్తిపైనా ఎలాంటి నియంత్రణాలేదు. అందుకే మానవ జీవితానుభవాలు యథాతథంగా అక్షరరూపంగా దాల్చాయి.

**'చెప్పులోని రాయి, చెవిలోన జోరీగ,**

**కంటిలోని నలుసు, కాలిముల్లు**

**ఇంటిలోని పోరు ఇంతింత కాదయా'**

చెప్పులో రాయి ఉంటే నడవటం ఎంత కష్టమో అందరికీ అనుభవమే. చెవిలో జోరీగలగోల, కంటిలో నలుసు పెట్టే ఇబ్బంది, కాలిలో దిగిన ముల్లు పెట్టే చీకాకు పదే పదే ఎదురయ్యే అనుభవాలు. తప్పించుకోలేనివి. అలాంటిదే నిత్యం ఎదురయ్యేది తప్పించుకోలేనిది అయిన అనుభవం 'ఇంటిలోని పోరు' అంటే భార్య పెట్టే నస. ఆడంబరాలు లేని అభివ్యక్తి వేమన్న సొంతం.

**'టంక మతుకకున్న పొంకంబుగా రాదు**

**స్వర్ణ భూషణంబు, జగమెఱుంగు**

**భటుడు వెంట లేక ప్రభుడు శోభించునా'**

ఇది స్వాభావికమూ లోకరీతి కూడా. బంగారు ఆభరణానికి టంకం తప్పని సరి. అది ఉంటేనే స్వర్ణం అతక గలిగేది. అలాగే రాజు ఒంటరిగా ఉంటే రాజసం ఎక్కడ మందీ మార్బలం ఉంటేనే రాజు ఔన్నత్యం. భటుడు ఉంటేనే రాజుకు శోభ. చిన్న అంశంతో మానవ స్వభావాన్ని స్పష్టంగా చెప్పాడు వేమన.

వేమన ప్రజలకు తాను చెప్పాలనుకొన్న అంశాన్ని నయానో భయానో చెప్పటం ఉంది. నచ్చ చెప్పినట్టు చెప్పాడు. తన భావాలు జనాన్ని చేరటానికి, జనం వాటిని గ్రహించటానికి, ఆమోదించటానికి పాటించటానికి ఇది ఒక మార్గం.

**'చంపదగిన యట్టి శత్రువు తన చేత**

**చిక్కెనేని కీడుసేయరాదు**

**పొసగ పొమ్మనుటే చావు'**

ఇలాంటి లోకరీతే ఇవి తెల్పుతాయి.

**'అల్పుడెపుడు పల్కు ఆడంబరముగాను**

**సజ్జనుండు పల్కు చల్లగాను**

**కంచుమోగినట్లు కనకంబు మోగునా'**

**'దోసకారియైన దూసరికాడైన**

**బగతుడైన వేదబాహ్యుడైన**

**ధనికునెల్లవారు తనియింపుచుందురు'.**

**'అల్ప బుద్ధి వాని కధికారమిచ్చిన**

**దొడ్డ వారినెల్ల తొలగద్రోయు**

**చెప్పుదినెడు కుక్క చెఱకు తీపెరుగునా....'**

ఇలా నిర్ణీత పరిధి / చట్రంలో ఇరుక్కోని అభివ్యక్తి వేమనది.

**III Satire, Irony, Sarcasm:** సాహిత్యంలో అభివ్యక్తిలో సమర్థవంతంగా భావ వినిమయానికి దోహదమయ్యే అంశాలు ఇవి. తమ తమ మార్గాలలో ఇవి శ్రోతను / పాఠకుడిని కట్టిపడేస్తాయి. అధిక్షేపం వ్యంగ్యం ఆయా వృత్తాలలో అందించే భావ స్పష్టత కేవల వాచ్యార్థానికంటే భిన్నమై, సందర్భాన్ని అనుభూతింపచేసే విశేషాలు. Sarcasm, Irony (వ్యంగ్యం)లో భాగంగా పేర్కొనబడుతున్నా, దాని ప్రత్యేకత దానిదే.

**1. Satire** అధిక్షేపం: విషయాల పట్ల విమర్శనాత్మక దృష్టిని కలిగి వ్యంగ్య హాస్య ధోరణిలో చిత్రిస్తూ వ్యాఖ్యానిస్తూ

పరిష్కార మార్గాన్ని సూచిస్తూ సాగుతుంది అధిక్షేపం. వ్యక్తులకూ సంస్థలకూ సమాజానికి సంబంధించిన లోపాలను వైఫల్యాలను ఎత్తి చూపటం దీనిలో ప్రధానం. ఇది రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి ప్రత్యక్ష అధిక్షేపం. రచయిత / కవి నేరుగా పాఠకుడిని / శ్రోతని ఉద్దేశించి తన వ్యంగ్య వ్యాఖ్యానాలను చేస్తాడు. రెండవది పరోక్ష అధిక్షేపం. దీనిలో రచయిత / కవి ఏదో ఒక పాత్ర ద్వారా లేదా సంఘటన ద్వారా వ్యంగ్య వ్యాఖ్యానాలను తెలియజేస్తాడు. అధిక్షేపం చెప్పే విధానాన్ని బట్టి సరదాగానూ గంభీరంగానూ ఉండవచ్చు. కొన్ని ప్రయోజనాలను ఆశించి అధిక్షేపం వాడటం జరుగుతుంది. 1. దుర్మార్గాన్ని ఖండించడం. 2. చెడును సంస్కరించడం, 3. ప్రమాణాలనూ, ఆదర్శాలనూ సత్యాన్నీ రక్షించడం, 4. చెడుకి వ్యతిరేకంగా నిరసన, 5. కపటత్వం, అహంకారం, దురాశ వంటి మానసిక విపరీతాలకు జవాబుగా (సాహిత్య విమర్శ పదాల డిక్షనరి, ఎస్.ఎస్.నళిని.) అధిక్షేపం వాడటం ఉంటుంది.

వేమన అధిక్షేపం ఎంతో ఎక్కువ. సమాజరీతిని దుయ్యబట్టడంలో అధిక్షేపం వేమన్నకు ఎలా వాహికగా నిల్చిందో వేమన పద్యాలు తెలిసిన వారికి సుపరిచితమే. వేమన్నది ప్రత్యక్ష అధిక్షేపమే. తను సహించలేని సమాజ అసమానతలు, మనిషిలోని న్యూనస్వభావాలు, సమాజం నూరి పోసే మూఢ విశ్వాసాలు వీటన్నింటిపై సంధించిన అక్షర తూణీరాలు ప్రత్యక్ష అధిక్షేప ప్రతినిధులే. పైన పేర్కొన్న ఐదు అంశాలు వేమనలో మచ్చుకు ఒకటిగా చూడవచ్చు.

1. **'మృగము మృగమనుచును మృగముల దూషింతు**
**మృగము కన్న చెడుగు మూర్ఖుడగును**
**మృగముకున్న గుణము మూర్ఖునికే లేదు'.**

దుర్మార్గుని ఖండించడం ప్రధానం. మనిషిలోని మూర్ఖత్వం పశువుకంటే హీనంగా ఉండటాన్ని గుణ హీనతను గర్హించాడు. పశువును తిడ్తాం కాని పశువు కంటే మూర్ఖుడు మనిషి. పశువుకున్న గుణం మూర్ఖుడైన మనిషికి లేదు అంటూ మనిషిలో పతనమయిన గుణాలను ఖండించాడు.

2. **'చాకికోకలుదికి చీకాకు పడజేసి**
**మైల దీసి లెస్స ముడుపు జేయు**
**బుద్ధి చెప్పువాడు గుద్దిన నేమయా'**

చెడును సంస్కరించడం అవసరం. మంచి చెప్పేవాడు కఠినంగా ఉన్నా తప్పు లేదు అంటాడు వేమన. పెట్టేవాడే మొట్టుతారంటారు. కడుపు నిండా తిండి పెట్టేవాడు రెండు దెబ్బలేసినా తప్పు లేదు. దానినే వేమన ఇక్కడ చాకలి వృత్తితో పోల్చి చెప్తున్నాడు. బట్టల మురికి పోగొట్టటానికి చాకలి బాదుతాడు / ఉతుకుతాడు. అలాగే బుద్ధి చెప్పే వాడు గుద్దినా తప్పు లేదు అంటూ సంస్కరణంలో భాగంగా చెప్పాడు వేమన.

3. **'పాలలోన బులుసు లీలగా గలిసిన**
**విరిగి తునకలగును విరివిగాను**
**తెలివినెల్ల నాశ కలిగించి చెరచురా'**

వాస్తవం కఠినంగా ఉన్నా అది చెప్పే సత్యం చేదుగా ఉన్నా స్వీకరించక తప్పదు. అది జీవితగమనానికి సజావైన మార్గాన్ని ఏర్పరుస్తుంది. దానినే వేమన చెప్తున్నాడు. మనిషికి ఆశ సహజం. అది అత్యాశకారాదు. అదే ఆశ విచక్షణను మింగేయరాదు. పాలలో పులుపు కలిస్తే అంతటి స్వచ్ఛమైన పాలూ విరిగిపోతాయి. అలాగే ఆశ మనిషి తెలివిని మబ్బు కమ్మేలా చేస్తుంది. అతిశయించిన ఆశ ఉండరాదు. ఇలాంటి భావననే వాస్తవికతనే చెప్తుంది ఈ పద్యం.

4. **ఉప్పులేని కూర యొప్పదు రుచులకు**
**పప్పులేని తిండి ఫలము లేదు**
**అప్పులేని వాడె అధిక సంపన్నుడు'**

కూరకు ఉప్పు, తిండికి పప్పు ఉంటేనే సార్థకత. అప్పు లేకుండా జీవించే వాడే అధిక సంపన్నుడు అనే సత్యాన్ని చాటాడు. అప్పు ఊపిరి సలపనివ్వదు. వడ్డీ చక్రవడ్డీ కుంగదీస్తాయి. మనిషి కుంగిపోతాడు ఇవి లేనివాడు ప్రశాంతత నిరుపమానం. అందుకే అప్పు లేనివాడు అధిక సంపన్నుడు అన్నాడు వేమన.

5. **'పుత్తడి గలవాని పుండు బాధయు గూడ**
**వసుధలోన జాల వార్తకెక్కు**
**పేదవాని యింట పెండ్లైన ఎరుగరు'.**

చెడును నిరసించటం వేమనలో ఉంది. ధనిక పేద వైషమ్యాలు సమాజాన్ని ముక్కలు చేసి దూరాలను పెంచుతున్నాయి. ధనువంతుడిది ఆర్భాటం. పేదవాడిది కటకట. ఈ వైరుధ్యం పట్ల నిరసన వేమనలో కనిపిస్తుంది. డబ్బున్న వాడికి కలిగే చిన్న పుండు వార్త అవుతుతంది. ఈ వ్యత్యాసానికి మూలం ధనం అని అధిక్షేపించాడు వేమన. అలాగే మనిషిలో ఉండవలసిన సుగుణాలు లేకపోయినా సహించలేదు వేమన.

6. **'తల్లిదండ్రి మీద దయలేని పుత్రుండు**
**పుట్టనేమి, వాడు గిట్టనేమి**
**పుట్టలోన చెదలు పుట్టదా గిట్టదా'**

అంటూ మానవుడికి ఉండాల్సిన స్వభావం కొరవడితే ఆ జీవితం ఎంత వ్యర్థమో చెప్పాడు.

**7. 'మెలత నడవి నుంచి మృగము వెంటనె పోయె
రామచంద్రుకన్న రసికుడేడి?
చేటుకాలమునకు చెడుబుద్ధి పుట్టును'.**

కపటత్వం దురాశా మనిషిని వివేక హీనుడిని చేస్తాయి. సీతను అడవిలో ఉంచి బంగారు లేడికై వెళ్ళిన రామచంద్రుడిలో కలిగిన దురాశే. అది సీతదే అయినా, రామాయణ కథాగతికి కారణం అయ్యింది. దురాశ అనే చెడుబుద్ధే రాముడి చేటు కాలానికి కారణం అయ్యిందంటాడు వేమన. ఇలా అధిక్షేపం పరిపరి విధాలుగా వేమనలో కనిపిస్తుంది.

**2. Irony: Satire**కి **Iron**కి కొంత భేదం కొంత సారూప్యం ఉంది. **'Literary satire is to convey a norm, where as that of irony is to urge a search after an unknown truth; the norm is opposed to and the truth different from a real but allegedly unsatisfactory state of affairs. In both cases the communication is indirect and takes the shape of an attack whether vieled(irony) or not(satire); Satire makes the reader aware of truth and irony of the way to truth both at the expense of an intellectual effort and there is something theatrical about both ways of writing - Jean weisgerber(www.j.stor.org)**

సెటైర్ ఒక విధానాన్ని, ఐరనీ సత్యాన్వేషణ అవసరాన్ని చెప్తాయి. వాస్తవాన్ని సెటైర్ నిరసిస్తే, వాస్తవ భిన్నమైన సత్యాన్ని ఐరనీ వ్యక్తం చేస్తుంది. రెండూ పరోక్ష వ్యక్తీకరణలే అయిన ఐరనీ గోప్యంగా సెటైర్ బాహాటంగా దాడి చేస్తాయి. సెటైర్ పాఠకుడిని సత్యం గ్రహించేలా చేస్తే ఐరనీ సత్య మార్గాన్ని తెలిసేలా చేస్తాయి.

వేమనలో సెటైర్ ఎలా ఉందో చూశాం. వ్యంగ్యం కూడా ఉంది. అది ఎలా ఉందో చూడవచ్చు.

**'....irony is used to suggest the stark contrast of the literal meaning being put forth. The deeper real layer of significance is revealed not by the words themselves but the significance is revealed not by the words themselves but the situation and the context in which they are placed(literary devices.com)**

**Irony** వాచ్యార్థాన్ని కాక వ్యంగ్యార్థాన్ని వ్యక్తం చేస్తుంది. దాని అంతరార్థం కేవలం పదాల ద్వారా కాక, సందర్భాన్ని బట్టి వ్యక్తం అవుతుంది. కవి/రచయితకు ఉన్న వ్యక్తీకరణలో సామర్థమే అయినా ఒక ప్రత్యేక అస్తిత్వం కలిగినది వ్యంగ్యోక్తి **(Irony).** కవి చెప్పదలచుకొన్న విషయాన్ని వ్యంగ్యంగా చెప్పటం కవితలో/రచనలో సునిశితతను నింపుతుంది.

**Irony** ప్రధానంగా మూడు రకాలు **Verbal Irony, Situational Irony and Dramatic Irony. 'Verbal Irony arises from sophisticated or resigned awareness of contrast between what is and what ought to be and expresses a controlled path with out sentimentality(www.britannica.com). Situational irony** అంటే **'The difference between what is expected to happen and what actually happens (www.storyboard.com). Dramatic Irony** అంటే **where the audience is more aware of what is happening than a character(www.storyboardthat.com). verbal irony** ఎలా ఉంది ఎలా ఉండాలి అనే విభిన్నతల నుంచి తలెత్తిన అవగాహన నుంచి ఇది ఏర్పడుతుంది. జరుగుతున్నవి, జరగాలనుకొన్న దాని మధ్య తేడాల వల్ల **Situational Irony** ఏర్పడుతుంది. దీనిలో పాత్రలు ప్రేక్షకులకు వాస్తవ సన్నివేశం గూర్చి పూర్తి అవగాహన ఉంటుంది. ఏం జరుగుతూ ఉందో పాత్ర కంటే ప్రేక్షకులకి బాగా తెలుస్తూ ఉండటాన్ని **Dramatic Irony** అంటారు.

వ్యంగ్యం వేమన పద్యానికి విలువను ఇచ్చింది. వేమనలో **Verbal Irony** చూడగలం. **Situational Irony & Dramatic Irony** కేవలం రూపకాలకు సుదీర్ఘ కావ్యాలకు సంబంధించిందే తప్ప నాలుగు పాదాల పద్య పరిధికి లొంగేది కాదు, అతీతమైంది. వేమన వ్యంగ్యాన్ని బాసటగా తీసుకొని సమాజానికి హితాన్ని బోధించాడు. సమాజాన్ని విమర్శించాడు. మూఢ విశ్వాసాలను నిరసించాడు. మానవ స్వభావాన్ని ఎత్తి చూపాడు.

**'పాల సాగరమున పవ్వళించిన సామి
గొల్లయిండ్ల పాలు గోరనేల?
ఎదుటివారి సొమ్ము ఎల్లవారికి తీపి'**

ఈ పరిహాసం నొప్పించని హాసం. పొరుగింటి పులగూర చందం. మనిషిలోని ఈ కోణం భగవంతుడికైనా అధిగమించలేనిది కావటం పరాకాష్ఠ. పాలసాగరాన

పవళించిన స్వామి విష్ణుమూర్తి. ఆయనకు అనంతమైన పాల సాగరం ఉండగా పాల పట్ల ఆశ ఉండటం అంటూ జరగదు. కాని కృష్ణావతారంలో ఆయన గొల్లవారిళ్ళల్లో పాలు, వెన్న దొంగిలించాడు. మనిషైనా దేవుడైనా పక్కవాడి సొమ్మును ఆశపడటం పరిపాటి.

**'మెలత నడవి నుంచి మృగము వెంటనెపోయె**
**రామచంద్రుకన్న రసికుడేడి?'**

అంటాడు.

కాంచన మృగానికై సీతను వదిలి వెళ్ళిన రామచంద్రుడు గొప్ప రసికుడని వాచ్యార్థం. వ్యంగ్యార్థం/రాసికృత లేదని. ఇంకా స్పష్టంగా వేమనే మరోచోట చెప్పినట్లు **'తెలివిలేనివాడు దేవుడెట్లాయరా?!'** రాసికృత లేదు. తెలివి కూడా మృగ్యం. దేవుడిని నిందించటానికి ఏమాత్రం వెరువని వేమన రామచంద్రుడి ఒక్క అనాలోచిత చర్య సీతకెన్ని ఇక్కట్లు తెచ్చిందో చెప్పకనే చెప్పాడు.

**'గాలిగాలి కలిసె, గగనంబు గగనంబు**
**మన్ను మన్ను గలిసె, మంట మంట**
**నీరు నీట గలిసె నిర్మలంబైయుండె'.**

వాచ్యార్థం మాత్రమే పొసగని చోట వ్యంగ్యార్థం భాసిల్లుతుంది. పాంచభౌతికమైన దేహం పంచభూతాలలో కలవటాన్ని వేమన్న చెప్తున్నాడు. ఇలాంటి వ్యంగ్యానికి మరో నిదర్శనం

**'ఆరుగురిని చేర నత్యంత దు:ఖంబు**
**ఏడుగురిని గూడ నేడపయ్యె**
**వడిగ వీరి పొందు విడుచుటె యోగంబు'**

అంటూ అరిషడ్వర్గాలను, సప్తవ్యసనాలను వదిలేసినప్పుడే జీవితానికి ధన్యత అన్నాడు. వాచ్యార్థం పొసగదు. వ్యంగ్యార్థం స్ఫురిస్తుంది. వేమన తాత్త్విక వేదాంతపరమైన పద్యాలు నిగూఢార్థ బోధకాలై వ్యంగ్యార్థాన్ని అందిస్తూ ఉంటాయి.

**3. Sarcasm** పరుషోక్తి: **Verbal Irony** లో భాగంగా భావింపబడేది **Sarcasm. Verbal Irony** వాచ్యార్థాన్ని కాక వ్యంగ్యార్థాన్ని చెప్తే **...Sarcasm is direct speech that is aggressive humor'(www.literary devices.com) sarcasm** నేరుగా ధాటిగా ఉండే హాస్యం లేదా ఎత్తిపొడుపు. ఇందులో వ్యంగ్యం ఉండాలనే నియమం లేదు. **'Non literary use of irony is usually considered sarcasm'(www.britannica.com). sarcasm** అన్ని వేళలా కఠినంగా క్రోధంగా ఉండాలని కూడా లేదు. వ్యంగ్యమే అయినా అవహేళనగా పరుషోక్తిగా, కటువుగా, దెప్పి పొడుపుగా ఉంటుంది. వ్యంగ్యం అంతర్లీనంగా ధ్వనిగా పదాల చాటున ఉంటే, **sarcasm** నేరుగా ఉంటుంది. సాధారణ మానవ దైనందిన వాగ్వ్యవహారంలో కొంత వ్యంగ్యమూ కొంత హాస్యమూ ఉండటం పరిపాటి. అది ఉల్లాసాన్నిస్తుంది. సరిదిద్దుకొమ్మనే హెచ్చరికనూ ఇస్తుంది. ఈ మానవ స్వభావాన్ని వేమన అంది పుచ్చుకొన్నాడు.

వేమన రచనలో **sarcasm** అధికం. అది అధికమే కాదు ప్రాణసమానం కూడా. నిర్మొహమాటంగా, కఠినంగా దూషణ చేయటం, సమాజాన్ని సమాజంలోని కల్మషాన్ని చెండాడటం వేమన్న లక్షణం. వేమన ఏ కారణాన అయితే సమాజాన్ని తిట్టాడో దూషించాడో నిందించాడో నిరసించాడో అది సమాజానికి బాగా నచ్చింది. అందుకే ఆ పద్యాలు జనం నోళ్ళలో నేటికి నానుతూ ఉన్నాయి.

**'ఆత్మశుద్ధిలేని యాచారమదియేల**
**భాండశుద్ధి లేని పాకమేల**
**చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా?'**

అంటూ ప్రజలు చేసే పనులు పైపై కార్యాలే కాని ఇష్టపూర్వకంగా చిత్తశుద్ధితో చేసేవి కావని సున్నితంగా చురకలంటించాడు. ఇది కొంచెం మర్యాదగా ఉన్నట్లే లెక్క. ఇలాంటివి ఎన్నైనా వెలికి తీయవచ్చు.

**'కనక మృగము భువిని కద్దు లేదన లేక**
**తరుణి విడిచిపోయె దాశరథియు**
**తెలివిలేని వాడు దేవుడెట్లాయరా'**

బంగారు జింక ఈ లోకంలో ఉంటుందా ఉండదా. అనే విచక్షణ లేకుండా సీతాదేవిని వదిలేసి వెళ్ళిన శ్రీరామచంద్రుడి తెలివిని అనుమానించిన వేమన అలాంటివాడిని దేవుడంటున్న సమాజాన్ని నిలదీశాడు. ప్రజలు మొక్కే దేవుడు శ్రీరాముడు. ఆ దేవుడిని తాను తేలిక పరుస్తున్నాననే సంకోచం ఏమీ వేమనలో లేదు. భార్యను ఒక భ్రమ కోసం వదిలి వెళ్ళిన వ్యక్తి ఎలా సమాజంలో గర్హనీయుడో శ్రీరాముడైనా అంతే వేమన దృష్టిలో. 'చాలా పద్యాల్లోని పెలుసుదనం సాహసం స్పష్టత' (ప్రజాకవి వేమన డా. ఎన్. గోపి పు. 149) ఉంటాయి. ఈ పద్యాలు వేమన నిర్భీతిని పట్టిస్తాయి.

ఆధునిక తెలుగు సాహిత్యంలో దిగంబర కవిత్వం ఇచ్చిన షాక్ అందరికీ తెలిసిందే. వారి తిట్లు, వారు వాడిన పదజాలం, సమాజాన్ని ఒక్క కుదుపు కుదిపింది. దీనిని ఒక టెక్నిక్

అనుకొంటే దాన్ని 17వ శతాబ్దంలోనే వేమన వాడాడు. తన భావ తీవ్రత సూటిగా నాటుకోవటానికి తగిన మార్గంగా తిట్టును ఎంచుకొన్నాడు. తన భావాన్ని సంక్షిప్తంగా అందించటంలో స్ఫుటత **(Accuracy)** స్పష్టత **(Clarity)** ను కోల్పోలేదు వేమన. ఈ సమాజం బ్రాహ్మణ వ్యవస్థ నడిపే తీరులో నడుస్తుంది. ముహూర్తాలు, సంబరాలు, జాతరలు, శాంతులు అన్నీ తదనుగుణమైనవే. ఈ వ్యవస్థలో ఉన్న మోసాన్ని వేమన గుర్తించాడు. తెలియచేశాడు. ఎత్తి పొడిచాడు.

**'విప్రులెల్ల జేరి వెర్రికూతలు కూసి**
**సతి పతులను కూర్చి సమ్మతమున**
**మును ముహూర్తముంచ ముండెట్లు మోసెరా'**

ఇంత హైరానా పడి మంచి ముహూర్తం అని ఎంచి ఆ సమయంలోనే పెళ్ళి చేసినా, అతను చనిపోయి ఆమె వితంతువు అయ్యింది. ఈ వ్యవహారమంతా ఎంత మోసమో గ్రహించమని పై పద్యంలో హెచ్చరించాడు. వర్ణ వ్యవస్థ నిరసన అధికం వేమనలో. 'వర్ణ వ్యవస్థ కలిగించిన దురితములను కులాచార మూఢ విశ్వాసములను పొరబట్టునప్పుడు చూపే తైక్ష్ణ్యము ఆయన మరియొక సందర్భమున ప్రదర్శింపడు' (లోక కవి వేమన, మరుపూరు కోదండరామిరెడ్డి పు.318) అన్న ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ మాటలు అక్షర సత్యాలు.

**'చదివి చదివి చదివి చావంగ నేటికి**
**చావు లేని చదువ వలయు**
**చదువు లేక కోటి జనులు చచ్చిరి గదా'**

ఈ పద్యం వేమన కాలానికి కాదు నేటి కాలానికి ఎంతో వర్తిస్తుంది. చదువు వ్యాపారమైన చోట, చదువు ఒత్తిడి అయిన ఈ కాలంలో చదువు చావులకెలా దారి తీస్తూ ఉందో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు చెప్తున్నాయి. చదివి చావవద్దు. చావు లేని చదువు చదవండి అన్న వేమన నాటి మాట నేటికీ బాటే. అందుకే వేమన ప్రజా కవి అయ్యాడు. విద్య జ్ఞానాన్నిస్తుంది. అది లేక ఎందరో నష్టపోయారు. చదువు ఉండి కూడా నష్టపోతే ఎలా? అందుకే ఇష్టమైనది చదవమని బోధిస్తున్నాడు వేమన. ఇలాంటివే

**'లంజ యంద్రు లౌకిక ధర్మాన**
**లంజకాని దెవతె రాజ్యమందు**
**లంజ కొడుకు బ్రహ్మ వ్రాతెట్లు వ్రాసెరా'**

**'ఉచ్చులోనె బుట్టి, యుచ్చులోనె పెరిగి**
**ఉచ్చ కాశపడుట ఉచితమగునె**
**ఉచ్చ లోయువాడె ఉత్తమ యోగిరా'**

**'కులము గల్గువారు గోత్రంబు**
**గలవారు విద్య చేత విఱ్ఱవీగు వారు**
**పసిడిగల్గువాని బానిస కొడుకులు'**

**'పిసినివాని ఇంట పీనుగునెడలిన**
**కట్టె కోలలకును కాసులిచ్చి**
**వెచ్చమాయెననుచు వెక్కి వెక్కేడ్చురా'**
**'పిండములను జేసి పితరుల దలపోసి**
**కాకులకును బెట్టుగాడ్దెలార**
**పియ్యి దినెడు కాకి పితరుడెట్టాయరా'**

అని కటువుగా ప్రశ్నించాడు. ఇటువంటి మొరటు వ్యక్తీకరణాలు నచ్చని వారున్నారు. కాని ఆయన తనకు నచ్చని వాటిని నిర్మొహమాటంగా విమర్శించాడని బ్రౌన్ పేర్కొన్నాడు.

**ముగింపు:** తాను చెప్పే పద్యాలను సందర్భాన్ని, జనాన్ని స్పష్టంగా గుర్తెరిగి విషయాన్ని అందించినవాడు వేమన. Spoken Communication must be both effective and efficient (C.S.Lovelee Kaur,5-5). అది వేమన విషయంలో అక్షర సత్యం. వేమన Informal గానే తాను చెప్పదలచుకొన్న విషయాలను చెప్పటానికి ఎన్ని మార్గాలు ఎంచుకొన్నాడో గమనించవచ్చు.

'వేమన, వేమన సాంప్రదాయమే లేకపోతే తెలుగు నేల అంత సులభంగా ఆధునిక సంస్కారం వైపు నడిచుండేది కాదు (లోకకవి వేమన, మరుపూరు కోదండ రామిరెడ్డి, ప్రజల మాట) అన్న కేతు విశ్వనాథ రెడ్డి మాటలు అక్షర సత్యాలు. సమాజాన్ని విమర్శనా దృష్టితో చూపి విమర్శించిన కవి. సమాజానికి కొత్త చూపును ప్రసాదించిన కవి.

'నిత్య పరిణామాల పాదార్థిక ప్రపంచంలో అనుభూతి (Feeling) పొందాలన్నా, అభివ్యక్తి (Expression) సాధించాలన్నా, కవి అంతర్ బహిర్ పోరాటం చేయక తప్పదు' అనే జ్వాలాముఖి (తెలుగులో తొలి సమాజ కవులు,75) మాటలు వేమన జీవిత ఘర్షణకు ప్రతిబింబాలు. ఆ ఘర్షణే వేమన వ్యక్తీకరణకు పునాది. తన ఘర్షణను జనపరం చేయటానికి ఆయన ఎంచుకొన్న అభివ్యక్తి మార్గాలు ప్రజాకర్షకాలు. ప్రజా హృదయాలను దోచుకొనే అభివ్యక్తి నైపుణ్యం వేమనది.




# వేమన రూపకం

- తెలకపల్లి రవి

## పాట

*వేమన మన వేమన*
*ఘన వేమన  వినవేమన*
*ఒకే ఒక్క వేమన్న*
*వేగుచుక్క లెక్కన్నా*

*1. చీకట్లను దునుమాడిన*
*అగ్నికణం  వేమన*
*చాందసాల  చీకట్లను*
*పెకిలించిన  వేమన  ॥వేమన॥*
*2. అధికారానికి లొంగని*
*ఆత్మనిరతి వేమన్న*
*అహంభావ పండితులకు*
*అసలు దెబ్బ వేమన  ॥వేమన॥*
*3. తెలుగు జనం అమర స్వరం*
*పద్యంపాడే  వేమన*
*కాలాలే దాటేసిన*
*జ్ఞానకాంతి  వేమన  ॥వేమన॥*
*4. వేమన చెప్పని నీతి*
*ఒక్కటైనా చూపించు*
*వేమన పేరే తెలియని*
*తెలుగువాణ్ణి రప్పించు  ॥వేమన॥*
*5. సాటిలేని వేమన సత్యకాంతి వేమన*
*మహోగళం వేమన భావి స్వరం వేమన ॥వేమన॥*

## రూపకం

వేదాలను మించినట్టి  వేమనకవి వాక్కురా
కపటాలను కడిగేసే మానవాళి హక్కురా
(వేమన రంగస్థలంపై ప్రత్యక్షమవుతాడు)
పిండాలు తినే కాకి పితృదేవుడైతే
కావు కావుమంటేనే తరిమేస్తారెందుకురా?
(ఇక్కడ పద్యాలు– పిండములు చేసి పితరులకు పెట్టంగ)
( ఇటు వైపు కాకులొస్తే తరిమేస్తుంటారు. అటు మంత్రాలు చదివి పిండాలు పెట్టి కాకి కోసం చూస్తుంటారు)

నా తప్పులు చెప్పనీక గొప్పగ వచ్చావుగాని
నీ తప్పులు నీకెరుకా చొప్పదంటు పండితుడా
పద్యం: తప్పులెన్నువారు తండోపతండంబులు
(కామెడీగా ఎవరైనా పండితుడి తప్పును చూపిస్తూ పామరుడు పాడతాడు)
గుడిలోన దేవుళ్లకు గోపురాలు కడతావే
చలిలో మగ్గే మనిషికి కాస్త కాపు కాయవే
పద్యం: రాతిబొమ్మకేల రంగైన వలువలు)
(పెద్ద పెద్ద నాయకులు గొప్పగా కానుకలు కిరీటాలు ఇస్తుంటే బయిట పేదలు)

మనసుమరో చోట పెట్టి వృత్తి పూజలెందుకు?
మలినం లోలోన దాచి మాయమాటలెందుకు?
(ఆత్మశుద్ధిలేని ఆచారమదియేల)
(గుళ్లలో విద్యారాలూ, వికృతాలూ చూపించొచ్చు)
పిరికి తనం మురికి తనం పిసినిగొట్టు లేకి తనం
చూడచూడ దారుణం తెలిసిపోవు మరుక్షణం
(మేడిపండు చూడ మేలిమై వుండు)
కోతలు కోసే వాళ్లు, అప్పులు ఎగేసే విజయ్‌మాల్యా లాటి వాళ్లు)
అమ్మనాన్న బరువంటున్నావ్ అరే నువ్వు మనిషివా
పుట్టిచచ్చి ఫలమే లేని పురుగుకన్న హీనం నీవు
(పద్యం:తల్లిదండ్రులందు దయలేని పుత్రుడు)
(అమ్మానాన్నలను తరిమేస్తున్న సంతానాన్ని వృద్ధాశ్రమాలను చూపించొచ్చు)
అనుకున్నది కాలేదని ఆత్మహత్యలెందుకు?
అహరహమూ పనిచేస్తే ఫలితమే దక్కునుగా
(పద్యం– అనగనగ రాగమతిశయిల్లుచు నుండు, పట్టుపట్టరాదు పద్యాలు)
(ర్యాంకుల వేటలు, టీవీ పాటల పోటీలు కూడా చూపించొచ్చు)
ప్రజలకింత ఫలమేలేని ప్రచారాలెందుకు?
వాస్తవాలు చూస్తుంటే వట్టి మోతలెందుకు?
(పద్యం– అల్పుడెపుడు పల్కు ఆడంబరముగానూ,)
తరతరాల తత్వాలు మా జీవన సత్యాలు
మీ హంగూ దర్పాలు మా చెమటల ఫలితాలు
(పద్యం–తనువులోన పుట్టు తత్వంబు..శ్రమము)
పైపైనే చూస్తుంటే అందరు ఒకటనిపిస్తారు
కొంచెం గమనించావా వంచనతో వస్తారు
(పద్యం– ఉప్పు కప్పురంబు ఒక్క పోలిక)

3

మళ్లి మళ్లి నీ పద్యం
అందించే చైతన్యం
మా కాలపు విపరీతాలకు
అది వేమన వైద్యం
పాతేసిన రోతలన్ని
పైపైకి తీసుకొచ్చి
పాలకులే పోషకులై
మూఢత్వం పెంచుతుంటే
వెక్కిరించు వేమన పద్యం
చక్కదిద్దు వేమన వైద్యం ॥మళ్లి మళ్లి॥
వాస్తుపేర మస్తు మాయ
సంఖ్యలతో ఇంకో గోల
పొద్దున్నే చానల్‌పెడితే
రుద్దిచంపు సుద్దుల లీల
విరుగుడొకటె వేమన పద్యం–
తిరుగబాటె వేమన వైద్యం ॥మళ్లి మళ్లి॥
చేతబడుల సీరియళ్లు
మొక్కుబడుల చిక్కుముళ్లు
బాబాలబండారాలు
స్వాములంటూ స్కాములజోరు
విప్పిచెప్పు వేమనపద్యం–
తప్పనిసరి వేమన వైద్యం ॥మళ్లి మళ్లి॥

4

ఒక సూర్యబింబం
ఒక దీపస్తంభం
ఒక జ్ఞాన సంద్రం
ఒక ధైర్య శిఖరం

వేమన్న పద్యం
వేనోళ్ల గానం ॥ఒక దీపస్తంభం॥

మూఢత్వహరణం
చైతన్యచరణం
చెడుపైన బాణం
హేతువుకు ప్రాణం ॥ఒక దీపస్తంభం॥

ప్రజలకే పట్టం
ప్రగతికే చుట్టం
ప్రశ్నించు తత్వం
ప్రతిఘటన మార్గం ॥ఒక దీపస్తంభం॥




చీకట్లు చీల్చి
నవకాంతులిచ్చి
బడుగన్న బాధ
గుండెల్లో పలికి ॥ఒక దీపస్తంభం॥

సామెతలు పేర్చి
సూక్తులే కూర్చి
సామాన్య భాష
సత్యాల శ్వాస ॥ఒక దీపస్తంభం॥

5

ఎక్కడెపుడు పుట్టావో
ఇప్పటికి మాలో వున్నావ్
విశ్వదాభిరామా
వింటున్నాం వేమా ॥విశ్వ॥

ఎంత ధైర్యశాలివో
ఇంత తిరుగబడ్డావు
ఎంత ఆత్మస్థయిర్యమో
ఎవరికి లొంగనన్నావ్ ॥విశ్వ॥

ఎంతలోతు చూశావో
అన్నిటిని కవి గట్టావు
ఎంత భాష నేర్చావో
కొత్త శక్తి సమకూర్చావు ॥విశ్వ॥

ఎంతగ నువ్వేడ్చావో
ఇంత బాధ పలికించావు
ఎంతగ తపియించావో
తరగని తడి గుండె నింపావ్ ॥విశ్వ॥

## ముఖ్య సూచనలు

*వేమనపై రాసిన నాలుగు పాటలలో చరణాలనూ, సమస్యలనూ కలిపి ప్రజానాట్యమండలి కళాకారులు ఈ రూపకం ప్రదర్శించారు.*

*ఒక దీపస్తంభం అన్న చరణాలతో మొదలవుతుంది. వాటితోనే ముగుస్తుంది. మధ్యలో ఎక్కువ సార్లు వివిధ భంగిమలు, ఆహార్యాలతో, శైలులతో వేమన మన వేమన అన్న పాట పాడుతూంటారు. ఆయా చోట్ల తగు అభినయం, దృశ్యాలు, ప్లకార్డుల వంటివి ప్రదర్శిస్తారు. కొన్ని సన్నివేశాలుగా వుంటాయి. కొన్ని ప్లకార్డుల ద్వారా తెలుస్తాయి. శ్రమజీవులు, మూఢ నమ్మకాలు, గుళ్లూ గోపురాలు, కుల వివక్ష, వైధవ్యం మూహూర్తాల వంటివి ఘట్టాలుగానే చూపిస్తారు. ఉదాహరణకు ప్రత్యేక హెూదా ప్యాకేజీ (ఉప్పుకప్పురంబు ఒక్క పోలిక), పాలసముద్రంలోదేవుడు గొల్లవాళ్ల పాలు కోరడం(రిలయన్స్ కూరల అమ్మకం), వృద్ధాశ్రమాలు (తలిదండ్రులందు దయలేని పుత్రుడు),*

*వేమన వచ్చి సందర్భోచితమైన పద్యం పాడి పోతుంటాడు. సంస్కర్తలు ప్రజాకవుల చిత్రాలతో మళ్లీ ఒక దీపస్తంభం చరణాలతో రూపకం ముగుస్తుంది. చరణాలను విరిచి వాడుకోవడం, పద్యాలకు తగిన దృశ్యాలు జోడించడం ఆలోచనను బట్టి చేయొచ్చు. కొత్తవి కూడా కలపొచ్చు. కాని ఒక్కటే సాగతీత కాకుండా మధ్యలో వేమన మన వేమన పాడిపోతుండాలి. అనంతపురంలో నిర్దిష్టంగా ప్రదర్శించిన స్క్రిప్టు వచ్చే సంచికలో చూద్దాం.*



## వేగుచుక్క వేమన

**- నల్లి ధర్మారావు**

**సాకి :** కులం పేర.. మతం పేర
చీకటి ధారలు కురిసినపుడు
వేకువ దారులు మూసేసినపుడు
వెలిగిందొక వేగుచుక్క..! కదిలిందొక కాంతిరెక్క !
విశ్వదాభిరామా.. వినురవేమ
విశ్వదాభిరామా.. వినురవేమ

**పల్లవి** వేగుచుక్క వేమన్నా కాంతిరెక్క వేమన్నా!
జాతికి సరికొత్త చూపు అందించిన ప్రేమన్నా..!

**చరణం:** తల్లి మాదిగైతే – కొడుకు బాపడెట్లు
కుల, గోత్రం పేరుతో ఎందుకు సిగపట్లు
అరుంధతిని గుర్తుచేసినాడు – వేమన్నా!
అగ్రకులం గుట్టు విప్పినాడు – వేమన్నా!॥వేగుచుక్క॥

**చరణం:** భూమి బాధిస్తే – ప్రజల ఉసురు తగులునని
ఎగురవేసిన బంతి – ఎందాక నిల్చునని
పాలకులను నిలదీసినాడు – వేమన్నా
శ్రామికుల పక్షం నిలిచాడు – వేమన్నా ॥ వేగుచుక్క॥

**చరణం:** తేటతెలుగులో ఆట – వెలదులను సృష్టించి
జాతి ముంగిట జ్ఞాన – జలధులను పారించి
మూర్ఖులను నిలదీసినాడు – వేమన్నా
మూడులను వెలివేసినాడు – వేమన్నా ॥ వేగుచుక్క॥

## వేమన ! వేమన!! వేమన!!!

**- దేవేంద్ర**

**పల్లవి :** వేమన.. వేమన.. వేమన
జీవన యానపు సోదన
మానవ వికాస దీవన
హేతువాద నవ భావన

**అను పల్లవి :**
మూఢత్వంపై దూసిన కత్తి
మానవత్వాన్ని పలికెను ఒత్తి ॥ వేమన॥

**చరణం :**
మనిషితనం అంటేనే – మానవత పరిమళమే
వేమన ప్రతి పద్యంలో – తొణికింది ఔషదమే
దేవుడు.. దెయ్యం.. స్వర్గం.. నరకం
మోసగాళ్ళ కల్పితమే
భూమి మనిషి సహజీవనము – సంపద అంత:ర్ భాగాలే
॥ వేమన॥

**చరణం:**
మూడు ముక్కల్లో విప్పి చెప్పాడు–మానవ జీవనపరిణామం
అనుభవంతో ప్రతిపద్యం – విశ్వమంతాటి పరిమాణం
తెలుగుల తల్లి కంఠసీమలో – వేమన పొదిగిన మణిహారం
ప్రశ్నల, కరవాలంతో – సాగేను చీకటి సంహారం
॥ వేమన॥

**చరణం :**
కాల పరిక్షలో రాటుదేలిన – మహాసూర్యుడు వేమన
తరతరాలుకు తరిగిపోవని – తెలుగు యశస్సు వేమన
వేమన పద్యం చెప్పెదొక్కటే – మనిషిని మించిన దేది లేదు
మనను మనమే వేటాడందే – మూర్ఖత్వం మనలో చావదు
॥ వేమన॥

# నాలుగొందల ఏళ్లనాడే

**- కవి పిఎన్‌ఎమ్**

**పల్లవి :**
నాలుగొందలేండ్లనాడె కుళ్ళును జూశావు
కళ్ళుమూసుకునుండలేక పద్యాలు రాశావు
నువ్ సెప్పిన సెరితలే నేడు
గుచ్చుతున్నాయింకా మాయని గురుతులై నేడు

**అనుపల్లవి :**
ఏమని చెప్పను వేమన సామీ దండాలు నీకూ
ఇపుడు లోకం తీరు రోజురోజుకూ గండాలు మాకు

**చరణం :**
దొంగలు దొరలై తిరుగుతున్నారు రౌడీలు
రాజ్యమేలుతున్నారు.
కులం మతమని కొట్టుకుంటారు మీదే తప్పని
తిట్టుకుంటారు..
***తప్పులెన్నువారు తండోప తండమ్ము...(పద్యం) ॥ఏమని॥***

**చరణం:**
వేలకోట్లు తిని బొక్కేటోళ్ళకు – బ్యాంకు రాయితీలు
అన్నం పెట్టే రైతన్నలకు – ఆకలి ఉరితాళ్ళు
కూలినాలి బీదోళ్ళ బతుకులూ – ఎన్నాళ్ళైనా మారవ సామి
ఎన్నికలప్పుడు వాగ్దానాలు – గద్దెనెక్కేవాళ్ళ బుద్ధి మార్పులు
***అల్పబుద్ధి వానికి అధికారమిచ్చినా...(పద్యం)॥ ఏమని ॥***

**చరణం :**
నిర్భయ అబయా, ఆయేషాలు – ప్రతిరోజు ప్రత్యక్షమే
గడపదాటినా మహిళలు – తిరిగిరావటం కష్టమే
ఆడపిల్లంటే ఛీకొడతారు – కడుపులోనే చిదిమేస్తారు
దాసీ మంత్రీ మాతా రంభనీ – పొగిడి పెళ్ళాన్ని ఇరగ్గొడతారు
***తన్నుగన్న యట్టి తల్లి వంటిది సుమ్ము... (పద్యం) ॥ఏమని॥***

**చరణం :**
పుట్టినోళ్ళు సచ్చేంత వరకు – భూమ్మీదె బ్రతకాలిరా



నిలువనీడ లేనోళ్ళందరికీ – సోటు వెతకాలిరా
వేల ఎకరాలు భూబకాసురులు – దర్జా దొంగలు
కబ్జాదారలు
నేల తల్లినీ సరుకుగ మార్చి – రియలెస్టేట్ వ్యాపారం
జేసిరి
***భూమి నాదియనిన భూమి పక్కున నవ్వు.. (పద్యం)***
***॥ఏమని॥***

**చరణం:**
డెబ్బయేళ్ళు నిండినా స్వతంత్ర్యం – మారదే కుతంత్రం
కులం పేరునా అవమానాలతో – బతుకులు దౌర్భాగ్యం
పూర్వజన్మ పాపాల ఫలితమే – హీన కులంలో
పుట్టారంటూ
వందల వేల యేళ్ళనుండి – మము మాయజేసినారే..

**చరణం:**
పద్యాలలో పోరు శంఖాన్ని పలికించావయ్యా
మీ బాటలోనే మేం పాటలమై కదిలొస్తామయ్యా
మతోన్మాదము కులవివక్షపై ప్రత్యక్షసమరం చేస్తాం సామి
ప్రజానాట్యమండలి సైనికులం జనంగొంతులై చేస్తాం
యుద్ధం
***పట్టు పట్టరాదు – పట్టు విడువరాదు... (పద్యం)***
***॥ఏమని॥***

# తెలుగు ప్రజల చైతన్య బాహుబలి వేమన

- పిళ్లా కుమార స్వామి



శ్రమములోన బుట్టు సర్వంబు తానౌను, అంటూ శ్రమ జీవన ఔన్నత్యాన్ని చాటిన వేమన, చిత్త శుద్ధిలేని శివపూజలేలరా అంటూ చిత్తశుద్ధి లేకుండా వాగ్ధానాలిచ్చే గిరీశంలాంటి వారిని ఎద్దేవా చేసిన వేమన. బుద్ధి చెప్పువాడు గుద్దితే నేమయా అంటూ తన పద్యాలతో సమాజ రుగ్మతలపై పద్యాన్ని శస్త్రంగా మార్చిన వేమన...మన వేమన, ఘనవేమన, వినవేమన అంటూ వేమన పద్యాన్ని స్మరించుకోవడానికి ప్రజాకవి వేమన సాహిత్య సమాలోచన రాష్ట్ర సదస్సు ఏప్రిల్ 30, ఆదివారం నాడు 250 సాంస్కృతిక సాహిత్య సంఘాల కవులు, రచయితలు, మేధావులు భాషా సాంస్కృతిక రాష్ట్ర శాఖలతో కలిసి అనంతపురంలోని పద్మావతి ఫంక్షన్ హాలులో నిర్వహించారు.

తెలుగు సాహిత్యపు వెలుగురేఖ వేమన. మట్టిలోపుట్టి మహోన్నతమైన శిఖరాలను అందుకున్న మానవతా మూర్తి. చైతన్య శీలి. మనుషుల మధ్యనే తిరుగుతూనే మానవ జీవిత సత్యాలను దర్శించి విమర్శించిన వివేకి వేమన. క్రీ.శ॥ 1650–1700 సం॥కాల నాటి వారు వేమన. ఈయన తన పద్యాలను, ఆటవెలది ఛందస్సులో పండిత పామరులకు అర్థమయ్యే విధంగా ప్రజల భాషలో అందించారు. సి.పి.బ్రౌన్ వేమన పద్యాలను సేకరించి వెలికి తీసి క్రీ.శ॥ 1829 లో ప్రచురించడంతో వేమన యావత్ ప్రపంచానికి వేగు చుక్కయ్యాడు.

30న జరిగిన సదస్సుకు భూమికగా 29వ తేది శనివారం నాడు వేమనపై రూపకం, కళాప్రదర్శన ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో అనంతపురం నడిబొడ్డులో మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ప్రదర్శించారు. వేమనపై జరిగిన సాంస్కృతిక కళారూప ప్రదర్శన కార్యక్రమానికి వేమన సాహితీ సమాలోచన ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షులు పిళ్లా కుమారస్వామి అధ్యక్షత వహించారు. పిళ్లా కుమారస్వామి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్త సాహితీ వేత్తలు గుర్తించిన ఏకైక కవి వేమన అని, ఆయన రాయలసీమకు చెందిన గొప్ప ప్రజాకవి, అయన్ను స్మరించుకోవడం మన అందరి బాధ్యతని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఊతమిచ్చే ఈ కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని ఆయన కోరారు.

తెలకపల్లి రవి, మాట్లాడుతూ తెలుగు వారి గుండెల్లో చైతన్య బాహుబలిగా వేమన చిర స్థాయిగా నిలిచారన్నారు. వర్గపోరు, అహంకారాలు, అధికారం, విక్షత, అన్యాయాలను, మూఢనమ్మకాలను వేమన వ్యతిరేకించారన్నారు. వేమన ప్రజల ప్రశ్నలకు, ప్రతిఘటనలకు ప్రతిరూపమని ఆయన అన్నారు. నేడు ఎవరు అధికారంలో వున్నా సాహిత్యానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. సాహిత్యం లేకపోతే చైతన్యం లేదన్నారు. వేమన పద్యాలపై నిరంతర పరిశోధన జరగాలని దీనికోసం అన్ని విశ్వవిద్యాలయాల్లో వేమన అకాడమీలను నెలకొల్పాలన్నారు.

తరువాత ప్రజానాట్య మండలి కళాకారులు వేమన పద్యాల ఆధారంగా తెలకపల్లి రవి రూపొందించిన రూపకం, ప్రదర్శించారు. గేయాన్ని ఆలపించి ప్రజలను

వుగ్రూతలూగించారు. వర్ధమాన ప్రపంచంలో వృద్ధాశ్రమాలపై, వాల్‌మార్ట్ రిలయన్స్‌మార్ట్ ల విశ్వరూపంపై, నోట్ల రద్దులూ పాలకుల చిత్తశుద్ధిపై, నిత్యానంద స్వాముల రాసలీలలపై ఇలా వర్తమాన సామాజిక అరాచకాలపై వేమన సంధించిన పద్యాలు ఆధారంగా రూపొందించిన రూపకం, నృత్యనాటిక, వేమన వేషధారణ ప్రజలను కదిలించాయి. అవి ప్రజల మదిలో చిరస్థాలుగా నిలిచిపోయాయి.

**ఒక ధైర్య శిఖరం వేమన పద్యం**

ఒక సూర్య బింబం, ఒక దీపస్తంభం, ధ్యాన సంద్రం, ఒక ధైర్య శిఖరం వేమన పద్యం, చైతన్య చరణం, హేతువుకు ప్రాణం...... ప్రజల భాషలో సత్యాల శ్వాసతో జీవించిన ప్రజాకవి వేమన. తెలుగు నేలపై సంచరించి ప్రజల జీవితాలపై వెలుగుల రేఖలు ప్రసరించిన కవి వేమన అని వక్తల అద్భుత ప్రసంగాలతో ఏప్రిల్ 30న, ఆదివారం రోజున అనంతపురంలో సాగిన రాష్ట్ర సదస్సు అశేష ప్రజానీకాన్ని ఆకట్టుకొంది.

వేమన సాహిత్య సమాలోచన ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి పిళ్లా కుమారస్వామి, అధ్యక్షున్ని, ముఖ్య అతిథులను, గౌరవ సందేశాలిచ్చే సాహితీ వేత్తలను ఆహ్వాన సంఘం బాధ్యులను వేదిక పైకి సాదరంగా ఆహ్వానించడంతో సభ ప్రారంభమైంది. సదస్సుకు ఆహ్వాన సంఘం అధ్యక్షులు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి. అధ్యక్షులుగా వ్యవహరించారు. వేమన పై ప్రజానాట్య మండలి కళాకారులు గీతాన్ని ఆలపించిన అనంతరం వక్తల ప్రసంగాలు ప్రారంభమయ్యాయి.

అధ్యక్షులు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు తన సంపాద కత్వంలో ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన 14 పుస్తకాలను వేదిక మీద ఉన్న ముఖ్య అతిథుల ద్వారా ఆవిష్కరించారు. తన తొలి పలుకుల్లో వేమన పద్యాలలోని సారాంశాన్ని తెలుసుకుని నూతన సమాజాన్ని నిర్మించుకోవచ్చన్నారు. బోధనారంగం, పరిపాలనా రంగాల్లో నుంచి తెలుగు భాష దాదాపు అదృశ్యమవుతున్న పరిస్థితుల్లో వేమన పద్యాలకు ప్రాధాన్యత పెరిగిందన్నారు. విద్యావ్యవస్థ కార్పొరేట్ సంస్థల చేతుల్లో బంధీ కావడంలో తెలుగును నిరాదరణకు గురిచేస్తూ ఆంగ్లానికి ప్రాముఖ్యత ఇస్తున్నారన్నారు. సాంకేతిక విప్లవం జయప్రదమైనా అశాస్త్రీయ భావాలు ఇంకా వేళ్లూనుకునే వున్నాయన్నారు. ఆర్థిక అవినీతిపై వేమన పద్యాల్లో మెండుగా వుందన్నారు.

ఆర్థికరంగంలో ఎన్ని మార్పులొచ్చినా ధనిక పేద తేడాలు కొనసాగుతూనే వున్నాయన్నారు. వేమన కాలంతో పోలిస్తే మనం ఎంతో ప్రగతి సాధించినా సమాజం మాత్రం ఇంకా మధ్య యుగాల లక్షణాలను వదిలించు కోలేక పోతోందని, ఈ సందర్భంలో వేమనను చదవడం మనలో చైతన్యం నింపుతుందని ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 30వ తేదీన శ్రీశ్రీ జయంతి కావడం వల్ల ఆయన జయంతి రోజున ఈ సదస్సు జరుపుకోవడం మనకెంతో సంతోషకరమైనదని అన్నారు. ఆది కాలంలో తిక్కన, మధ్యయుగాలలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ తెలుగులో మహాకవులని శ్రీశ్రీ పేర్కొన్నారని ఆయన గుర్తు చేశారు.

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షులు కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ చిలుకపలుకుల పాండిత్యం కన్నా మట్టిలో నుంచి వచ్చిన పాండిత్యం గొపదన్నారు. వేమన భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లే ఇలాంటి సదస్సులు నిర్వహించడం వేమనపై మనకున్న గౌరవాన్ని తెలియజెప్తాయని అన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ మాజీ సాంస్కృతిక శాఖా మంత్రి పల్లె రఘునాథ రెడ్డి మాట్లాడుతూ తెలుగు జాతి ప్రతిష్టను ఖండంతరాల్లోకి విస్తరింపచేసిన మహోన్నతుడు వేమన అని కొనియాడారు. నైతిక విలువలు పతనమవుతున్న నేటి రోజుల్లో వేమన సాహిత్యాన్ని ప్రజల్లోకి ముఖ్యంగా పిల్లల్లోకి తీసుకెళ్ళాల్సిన అవసరముందని ఆయన చెప్పారు.

అనంతపురం నగర ఎమ్మెల్యే ప్రభాకర చౌదరి ప్రసంగిస్తూ సమాజంలోని నిరక్షరాస్యులకు సైతం అర్థమయ్యే రీతిలో పదజాలాన్ని వుపయోగించడం వేమనకే సాధ్యమైందన్నారు. వేమన పద్యాలు తెలుగు నేలను చైతన్య వంతంగా మార్చాయని కొనియాడారు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షులు (వి.సి) యన్.గోపి సదస్సునుద్దేశించి ప్రసంగిస్తూ వేమన పద్యాలు తెలుగు జాతి రక్షణ కవచాలన్నారు. వేమనపై వున్న మక్కువతో తాను దాదాపు 15వేల పుస్తకాలతో వేమన విజ్ఞాన మందిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేమన పద్యాలను చదవడం, అర్థంచేసుకోవడం కాదు జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. వేమన పై తాను పరిశోధన చేసి సిద్ధాంత గ్రంధాన్ని రాయడం ద్వారా వేమనతో ముఖ్యంగా అనంతపురం జిల్లాతోనూ ఆత్మీయ అనుబంధం ఏర్పడిందన్నారు. వేమన సాహిత్యంతోనే తన జీవితం ముడిపడుతుందన్నారు.




వేమన విశ్వకవి కాదు విశ్వమెరిగిన కవి, నాలుగు వందల సంవత్సరాల తరువాత కూడా ఆయన నేటికీ ప్రజల గుండెల్లో సజీవంగా ఉన్నారని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి అన్నారు. వేమన పద్యాల ప్రభావంతోనేటి సమాజంలో ఎందరో కవులుగా ఎదిగారన్నారు. స్వతహాగా వేమన ఒంటిపై గుడ్డలు కప్పుకోనప్పటికీ తెలుగు జాతికి సంస్కారమనే గుడ్డను కప్పిన మహోన్నత వ్యక్తి వేమన అని తెలకపల్లి కొనియాడారు. ఆయన స్ఫూర్తి అనంతమైనదన్నారు. 400 ఏళ్ళ క్రితమే సమాజంలోని రుగ్మతులను ఎత్తి చూపిన వ్యక్తియని కొనియాడారు.

రాయలసీమ ప్రాంతంలో వేమన వంటి కవి వుండడం మనకెంతో గర్వకారణమని రాయలసీమ అభివృద్ధి వేదిక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డా॥ గేయానంద్ తన ప్రసంగంలో సభికులనుద్దేసించి పేర్కొన్నారు. పునరుజ్జీవన కాలంలో వుండాల్సిన కవి వేమన. అయితే ఆయన మధ్య యుగంలోనే వున్నారన్నారు. ఇటువంటి కవికి తగిన గుర్తింపు లభించలేదని పేర్కొన్నారు. సి.పి.బ్రౌన్ చొరవ తీసుకుని ఆయన పద్యాలపై పరిశోధనలు జరిపి వెలుగులోకి తీసుకురావడం వల్ల ఆయన పద్యాల గొప్పతనం వెలుగుచూసిందన్నారు.

తదనంతరం పోతన్న, ఏలూరి ఎంగన్న, షేక్ హుస్సేన్, సత్యాగ్ని, మేడిపల్లి రవికుమార్, కొలకలూరి మధుజ్యోతి, సూర్య సాగర్, శాంతినారాయణ, రాధేయ, రాజారాం, ఆశావాది ప్రకాశ రావు తదితరులు తమ సందేశాలు వినిపించారు.


మధ్యాహ్నం సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనతో భోజన విరామం తరువాత సదస్సు మళ్ళీ ప్రారంభమైంది. ప్రజానాట్యమండలి కళాకారులు తమ నటనా కౌశలంతో వేమన పద్యాల విశ్వరూపాన్ని ప్రదర్శించి సభికుల ప్రశంసలు మన్ననలు పొందారు.తరువాత వేమన సాహిత్యం – సమాజం, వేమన సాహిత్యం – ప్రాసంగికత అంశాలపై సదస్సు కొనసాగింది.

సాహితీ స్రవంతి ఉపాధ్యక్షులు జంధ్యాల రఘుబాబు వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. ఈ మధ్యాహ్నం పూట జరిగిన సదస్సుకు తెలకపల్లి రవి అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో ప్రముఖ సాహితీ విమర్శకులు మేడిపల్లి రవికుమార్, కొలకలూరి మధుజ్యోతి, జనప్రియ కవి ఏలూరి ఎంగన్న, షేక్ హుస్సేన్ సత్యాగ్ని, రాజారాం, శాంతి నారాయణ పాల్గొని ప్రసంగించారు.

ఏలూరి ఎంగన్న మాట్లాడుతూ వేమన విశ్వకవి అని ఆయన ప్రజలతో మమేకమై ప్రజల భాషలో అన్ని దేశాలకు అన్ని కాలాలకు పనికొచ్చే పదునైన కవిత్వాన్ని ప్రసరింప చేసిన విజ్ఞాన కాంతి పుంతని చెప్పారు.

మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ వేమన పద్యాలు ఎన్నో కాల గర్భంలో కలిసిపోయాయని, కొన్నింటిని మాత్రమే మనం చదువుతున్నామన్నారు. మార్క్స్ చెప్పిన సిద్ధాంతాలను వేమన 400 ఏళ్ళ క్రితమే చెప్పారని, నూతన సమాజ నిర్మాణానికి వేమన చూపిన పద్యాల ప్రతిఘటనను పూరిద్దామని ఆయన చెప్పారు. తెలుగు ప్రజల గుండె చప్పుడు వేమన అని కొలకలూరి మధుజ్యోతి పేర్కొన్నారు. ఎల్లలు దాటిన వేమన చాలా రాష్ట్రాల్లో దేశాల్లో ప్రజల నాల్కలపై నానుతున్నారన్నారు. ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేసిన వేమన పద్యాల్ని ఆధిపత్యంపై సంధించాలని షేక్‌హుస్సేన్ సత్యాగ్ని కోరారు. వేమన పద్యాలు హాస్టళ్ళలోను విద్యా సంస్థలలోనూ విద్యార్థులకు చేరువ కావాలని అభిలషించారు ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి వేమన అంటే నిరసన, విమర్శ, ప్రశ్న, వేమనను స్ఫూర్తిగా తీసుకుని పాలకులను ప్రశ్నించాలన్నారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షులు పిళ్లా కుమారస్వామి మాట్లాడుతూ వేమనే మనకు స్ఫూర్తి. ఆయన ఏ రుగ్మతలపై సమరం సాగించారో అవే రుగ్మతలు నేటికీ సమాజంలో ఉన్నాయన్నారు సాహితీస్రవంతి అధ్యక్షులు వొరప్రసాద్ వేమన పద్యాల ఆధారంగా కుల,మతాలకు వ్యతిరేకంగా చైతన్యాన్ని వ్యాప్తిచేయాలన్నారు. తదనంతరం సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు ప్రగతి వందన సమర్పణతో సదస్సు ముగిసింది. సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, సాహిత్య ప్రస్థానం సంపాదక మండలి సభ్యులు కెంగారమోహన్, కడపజిల్లా సాహితీ స్రవంతి కన్వీనరు మస్తాన్‌వలి, చిత్తూరు జిల్లా సాహితీ స్రవంతి కన్వీనరు వెంకటరమణ తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

# పునరుజ్జీవన కాలంలో పుట్టాల్సిన కవి వేమన.



- గేయానంద్
రాయలసీమ
అభివృద్ధి వేదిక
అధ్యక్షులు

వేమన రాయలసీమ కవి. ఒక పునరుజ్జీవన కాలంలో పుట్టాల్సిన కవి వేమన. మధ్య యుగాలలో, ఒక అంధకార యుగంలో వేమన పుట్టాడు. ఆశ్చర్యం వేస్తుంది. యూరప్‌లో పారిశ్రామిక విప్లవం తర్వాత పునరుజ్జీవన ఉద్యమాలు వచ్చాయి. సైన్స్ పెద్దయెత్తున సమాజంలోకి వచ్చిన తర్వాత వచ్చాయి. కానీ అటువంటి పునరుజ్జీవన ఉద్యమాలు ఏవీ లేకుండానే వేమన లాంటి వ్యక్తి ఆవిర్భవించడానికి తెలుగు సమాజంలో ఉన్న శక్తి సామర్థ్యాలకు సంకేతం. ఈ రోజు సమాజంలో పరిస్థితులు చూస్తే ఏది తినాలి అనేది వ్యక్తుల స్వేచ్ఛకు వదిలేయడం లేదు. ఒక నియంత్రణ పెట్టాలి అని చూస్తున్నారు. ఏం చదవాలి అనేదానిమీద నియంత్రణ పెట్టాలి అని చూస్తున్నారు. ప్రజల ఆలోచనల మీద ఒక నియంత్రణ పెట్టాలి లేదా నియంత్రించాలి అనే కాలంలో ఈ రోజు మనం రోజంతా వేమన గురించి మాట్లాడుకుంటున్నాం. ప్రజల సంస్కృతి మీద ఒక నియంత్రణ, ఈ రోజు సమాజంలో ఉన్న పరిస్థితుల్లో వేమన చెప్పిన విషయాలకు చాలా ప్రాధాన్యత ఉంది. వేమన పద్యాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన వ్యక్తి బ్రౌన్. వేమన ఎక్కడివాడు అనేది కూడా చర్చ చేశారు. చిట్టచివరకు రాయలసీమ కవిగా తేల్చారు. ఇవాళ్టికి కూడా ఇంకా ప్రశ్నలు ఉన్నాయి. వీటిని విశ్వవిద్యాలయాలు, పరిశోధకులు తేల్చాలి. వేమన గురించి మాట్లాడేటప్పుడు తప్పకుండా సి.పి. బ్రౌన్ గురించి కూడా మాట్లాడాలి. ఈస్టిండియా కంపెనీ ఉద్యోగిగా వచ్చి తన సమయం చాలా వరకు వేమన పద్యాల సేకరణకు, వెలికితీయడానికి వెచ్చించాడు. చివరకు తనకొచ్చే జీతంలోంచి తన దగ్గర వేమన పద్యాల సేకరణకు, పరిష్కారానికి పనిచేస్తున్న వారికి జీతాలు చెల్లించాడు. కొందరి దగ్గర నుంచి పద్యాలు కొన్నాడు. అటువంటి స్ఫూర్తితోనే నేడు వేమన మీద పరిశోధనలు జరగాలని కోరుకుంటున్నాను. రాయలసీమ మహాకవి వేమనపై ఇంత పెద్దయెత్తున సదస్సు ఏర్పాటుచేసిన సాహితీస్రవంతికి అభినందనలు తెలియజేస్తున్నాను. ❋

# చారిత్రాత్మకం, వేమన సాహితీ సమాలోచనం



- రాధేయ, కవి,
విమర్శకులు, వ్యవస్థాపకులు,
ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు

వేమన ప్రజాకవి మాత్రమే కాదు, జాతీయకవి. ప్రగతిశీల, అభ్యుదయకవి మాత్రమే కాదు – సంస్కరణ దృక్పథం కల్గిన కవి. పండితులకే పరిమితమైన కావ్యభాషను ధిక్కరించి, సామాన్యభాషను ప్రజల నాల్కల మీద నిలబెట్టిన కవి. అందుకే వేమన తొలి తెలుగు ప్రజాకవిగా ప్రజల మన్ననలు పొందిన కవి. భాషలోనూ, ఊహలోనూ, ఛందస్సులోనూ దేశీయతను అభిమానించిన నిక్కమైన దేశీయకవి వేమన. తెలుగువారి సామెతలు, పలుకుబళ్ళు, నుడికారాలు ఆటవెలది ఛందస్సులో అలవోకగా ఇమిడిపోయాయి. కాలంతో మరుగున పడిన కవి కాదు. కాలానికి ముందు నడిచిన కవి. మూర్ఖ సంప్రదాయాలకు, మతమౌఢ్యాలకు ఎదురునిలిచి, హేళన చేసి ప్రశ్నించిన కవి.

వేగుచుక్క వేమనను, హేతువాది వేమనను నేటి వర్తమాన, వైజ్ఞానిక యుగంలో పునర్మూల్యాంకనం చేసుకోవడం మన సామాజిక బాధ్యతగా భావించి సాహితీస్రవంతి, అనేక సాహితీసంస్థల సమన్వయంతో ఏప్రిల్ 30న అనంతపురంలో ప్రజాకవి వేమన సాహితీ సమాలోచన నిర్వహించడం చారిత్రక అవసరంగా నేను భావిస్తున్నాను. నాడు జరిగిన కళారూప ప్రదర్శనలు, వేమన సంస్కరణ వాదంతో రూపొందిన 'రూపకం'ఎంతో ఆలోచనాత్మకంగా, పురోగమనవాదులకు మార్గదర్శనం చేయించేదిగా, తిరోగమన వాదులకు కనువిప్పు కలిగించే విధంగా ఉన్నాయి. ఈ సదస్సులో నేను నా సంస్థతో సంఘీభావంతో కల్సి పనిచేసినందుకు గర్వపడుతున్నాను. ఈ సందర్భంగా సాహితీస్రవంతికి, భాగస్వామ్యం వహించిన ఇతర సాహితీ సంస్థలకు ధన్యవాదాలు తెల్పుకుంటున్నాను. ◆



# వన్నె తగ్గని వేమన్న పదం

- జంధ్యాల రఘుబాబు

**నా**లుగు వందల ఏళ్ళు దాటినా వేమన పదం కాని, పథం కాని వన్నె తగ్గలేదని అనంతపురం లో జరిగిన వేమన సాహితీ సమాలోచన రుజువు చేసింది. ప్రజల నాలుకలపై తారాడిన, తారాడుతున్న వేమన పద్యాలు నిత్య సత్యాలుగా ఇప్పటికీ వెలిగిపోవడం ఒకింత ఆశ్చర్యాన్ని, ఒకింత గర్వాన్ని కలుగజేశాయి. అందుకు మనం తెలుగువాళ్ళం కావడమే కారణం కావచ్చు. "ఏమిటయ్యా, ఈ తెలుగోళ్ళు ఒక మనిషిని ఇంతగా ఆరాధిస్తారా?" అని ఓ పాత్ర చెప్పే మాటలు గుర్తొచ్చాయి. నిజంగా ఎవరినైనా గుర్తుపెట్టుకోవటం, మరచిపోవటం రెండూ మనవారికి బాగా తెలుసు. సమాజ సేవకులుగా, సంఘ సంస్కర్తలుగా ఉన్నత స్థానంలో పనిచేసినవారు, పేరు తెచ్చుకున్నవారు వేమనను ఎంతగా ఆరాధించారు? అసలు ఆయన చెప్పిన విషయాల్ని ప్రజలకు చేరవేయాలన్న ఆలోచన వారికి కలిగిందా? కలిగినా తొక్కిపెట్టారా? మనసు చంపుకొని ఆ పని ఎలా చేయగలిగారా అన్న అనుమానం మనక్కలుగుతుంది. ఇంకో పక్క చూస్తే ఒక మహాకవి తన కవిత్రయంలో వేమనకు స్థానమిచ్చాడు. ఇంకో మేటి కవి వేమనను ఏకవచనంతో పలకలేక ''వేమనగారు''అనే రాశాడు. వేమన్న పదాలు వేళ్ళూనుకున్నంతగా ఇతరుల రచనలు సమాజంలో లోతుగా విస్తరించలేదని చెప్పిన కొందరు విమర్శకుల మాటల్ని మనం ఒప్పుకోవాల్సిందే.

ఎందరో వక్తలు సదస్సులో ప్రసంగించారు. ఒక్కొక్కరూ వేమనను ఒక్కో కోణంలో చూపటానికి ప్రయత్నించారు. తత్వ శాస్త్రం నుండి సైన్సు దాకా ప్రతి విషయం ఆయన చెప్పాడని ఉదాహరణలతో పాటు వివరించటానికి ప్రయత్నించారు. నిజంగా వేమన నేటికీ ఇంత నిత్యనూతనంగా కనిపించటానికి కారణాలేమిటి అని ఆలోచిస్తే ఆయన ఒక యోగిగా, ఒక సంఘ సంస్కర్తగా, ఒక మహాకవిగా, ఒక విశ్వకవిగా ఎంచుకున్న అంశాలు, చెప్పిన పద్ధతి పండిత పామరుల హృదయాలకు దగ్గరగా అల్లిన అల్లికలేనని అనుకోవచ్చు. అసలు సాహిత్యాన్ని, సమాజాన్ని, మన బతుకులను, మన చరిత్ర, వర్తమానం, భవిష్యత్తు వీటిలో దేనినీ వేమననుండి విడగొట్టి చూడలేకపోవటం ఇంకో కారణం. ఈ విధంగా స్ఫూర్తినిచ్చినవారిలో వేమన ఆద్యుడిగా ఉంటాడు. అతని ఘనత అందులోనే దాగి ఉంది.

శ్రీ శ్రీ, జాషువా, గురజాడ, కుసుమ ధర్మన్న, సి.వి.రచనలు ఇలా స్రవంతిగా సాహితీ స్రవంతి తన బాధ్యతగా వేమన్నను ఆవిష్కరించాలన్న తలంపే అనంతపురం సదస్సు. దాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి వందనం. అందులో భాగంగానే కర్నూలులో జరిపిన సదస్సులో బనగానెపల్లెనుండి ముగ్గురు వేమన అభిమానులు ఎండలకు కూడా లెక్క చేయక వచ్చి పాల్గొనటం ఆశ్చర్యం కలిగించింది. దానివెనుక ఆ మహాకవి రాసిన పద్యాలు జనాల మనసుల్లో ఇంకా మారుమ్రోగుతుండటమే దానికి కారణం.

"వేమన మన వేమన ఘన వేమన వినవేమన" అన్న తెలకపల్లి రవిగారు రాసిన రూపకం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. "ఒక సూర్య బింబం, ఒక దీపస్థంభం, ఒక ధైర్య శిఖరం, ఒక జ్ఞాన సంద్రం" అంటూ మొదలై వేమన పద్యాలు కలిపి నేటి పరిస్థితులను ప్రతిబింబిస్తూ రాసిన ఈ రూపకం చివరిలో "ఎంతగ నువ్వేడ్చావో ఎంత బాధ భరించావో, ఎంతగ తపించావో తరగని తడి గుండె నింపావు" అన్న పదాలు విన్నప్పుడు చాలామంది కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఇదంతా వేమన రచనల్లోని గొప్పదనాన్ని గుర్తించటమే.

మొత్తం మీద మహాకవి వేమనను మరొక్క సారి ఆవిష్కరించి ఆయన చెప్పిన వేదాన్ని తెలుసుకోవటానికి చేసిన ఈ ప్రయత్నం అనంతపురంలో ఘనంగా జరపటం అభ్యుదయవాదులకు, లౌకికవాదులకు, ప్రజాస్వామ్యవాదులకు మంచి ఊతాన్నిచ్చింది. వెనక్కి తిరిగి చూసుకున్నా, వర్తమానంలో చూసినా, భవిష్యత్తును చూసినా వేమన మనవెంటే ఉన్నాడన్న బలం, ఉత్సాహం మనల్ని వెన్నంటే ఉంటాయి అన్నది నిజం. అదే వేమన ఘనత.



# సత్యాన్వేషి వేమనపై లోతైన చర్చ..

**-కెంగార మోహన్**

తెలుగుతనానికి ప్రాతినిధ్యం వహించి, తెలుగుభాషకున్న ప్రత్యేకతను పద్యాల్లో వివరించిన మహాకవి ప్రజాకవి వేమన. ప్రస్తుత మతోన్మాద పాలకులు దేశాన్ని కాషాయీకరించాలని చేస్తున్న పరిస్థితుల్లో వేమన తన పద్యాల్లో ప్రబోధించిన అనేక విషయాలు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం వుంది. 460 సంవత్సరాల తర్వాత వేమన గూర్చి సదస్సు నిర్వహించడం అరుదైన సందర్భం. సాహితీస్రవంతి అనంతపురం వారు నిర్వహించిన వేమన సాహితీ సమాలోచన సదస్సు ఈ దిశగా పయనించి సఫలీకృతమయ్యింది. ఎవరికి వారు కులాలుగా మతాలుగా విడిపోయి సంస్కర్తలను కూడా మా వాడే అని చెప్పుకుంటూ పబ్బం గడుపుకుంటున్న దౌర్భాగ్య స్థితిలో మనమున్నాం. అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి సదస్సు వేమనపై కూలంకుషంగా చర్చించింది. సత్యవాదిగా, సత్యాన్వేషిగా సాహిత్యలోకంలో కనిపించే వేమన గూర్చి అసలైన సందర్భంలో సమాలోచన చేయడం గొప్పవిషయం. గురజాడ రాసిన ముత్యాలసరాలును మహాకవి శ్రీశ్రీ పరిచయం చేస్తూ " ఆది కాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, అధునిక కాలంలో గురజాడ అని తెలుగులో వీరే మహాకవులను చెప్పినపుడు ఇంతకంటే వేమన ఘనత గూర్చి చెప్పేదేముంటుంది. మానవసంబంధాలు, నైతిక విలువలు కనుమరగవుతున్న ఈ ప్రపంచీకరణ యుగంలో వేమన సాహిత్య అవశ్యకతను సదస్సు లోతైన దృష్టికోణంలో చూసింది. పాలకుల దుర్నీతిని వేమన సాహిత్యానికి అన్వయించి చేసిన కళాప్రదర్శనలు ఆకట్టున్నాయి. ఈ సమాలోచన సదస్సు వేమన సాహిత్యాన్ని ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్ళాలని చెప్పడం చారిత్రిక సందర్భం. వేమన సాహిత్యంపై విస్తృత పరిశోధన చేసిన ఆచార్య ఎన్ గోపి లోతైన విషయాలు సదస్సులో పరిశోధనాత్మకంగా వివరించారు. సంఘసంస్కర్తగా వేమనను చూడాల్సిన అవశ్యకతను సదస్సు గుర్తుచేసింది. వేమనపై తెలకపల్లి రవిగారు రాసిన మన వేమన ఘన వేమన గేయం చరిత్రపుటల్లో నిలిచిపోతుంది. సహజ పాండిత్యంతో నైతికతను జాతికి అలవర్చిన వేమన గూర్చి రాష్ట్రసదస్సు నిర్వహించడం మాత్రమే కాకుండా నిరంతరం వేమన సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళేలా సదస్సు ప్రణాళికలను అందించినట్లైంది..



# వేయి వెలుగుల వేమన

- కె. ఉషారాణి
సంపాదకులు, ప్రజాశక్తి బుక్‌హౌస్





వేమనలా తెలుగువారి గుండెల్లో గూడు కట్టుకున్న కవి మరొకరు లేరంటే అతిశయోక్తి కాదు. వేమన సమాజాన్ని నిశితంగా పరిశీలించిన, మానవీయత మూర్తీభవించిన కవి. ఆలోచనలోని స్పష్టత అక్షరాలలోనూ ప్రతిబింబిస్తుంది. నాలుగువందల ఏళ్ళు గడిచినా ప్రతీ తెలుగు వాడి నాల్క మీద వేమన పద్యం నడయాడుతూనే ఉంది. ఆనాటి ఆధిపత్యాన్ని, హీన సంస్కృతిని, మతోన్మాదాన్ని, కుల కుచ్చితాన్ని నిర్భయంగా ఎదిరించి నిలిచాడు. ఆడంబరాలను, డాంబికాలను, డంబాచారాల్ని హేళన చేసాడు. మరో మనిషి అటువంటి పనికి పూనుకోలేదు. పేదరికం, అవమానాలు తన నమ్మకాన్ని సడలించలేదంటే వేమన ఎంతటి ధీశాలో మనం అర్థం చేసుకోవచ్చు. అందుకే ప్రజాశక్తి బుక్‌హౌస్ సాంస్కృతిక తిరోగమనం వేగం పుంజుకున్న ఈ రోజు వేమన్న వెలుగులు ఆ తిరోగమనాన్ని అడ్డుకుంటాయని ఆశిస్తున్నది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో వేమనపై 14 పుస్తకాలు వెలువరించడం జరిగింది

వేమనను తెలుగువారికి అచ్చురూపంలో అందించింది మాత్రం ఒక ఆంగ్లేయుడు. సి.పి. బ్రౌన్ తెలుగునాట అడుగుపెట్టేనాటికి తెలుగు వెలుగులే కొడిగడుతున్నాయి. బంగోరె అన్నట్టు, మొత్తం ప్రపంచంలోని తెలుగు ఆచార్యులు, విద్యావేత్తలు, ప్రభుత్వం సహాయమందించిన పరిశోధకులు చేసిన పని ఒక్క బ్రౌన్ చేసిన దానిలో చిన్నమెత్తు కూడా ఉండదు. బ్రౌన్ తన సొంత ఖర్చుతో వేమన పద్యాల తాళ ప్రతులను సేకరించి, వాటిని పండితులతో సరిగా వ్రాయించి వాటిని ఆంగ్లంలోకి అనువదించారు. 1817లో మద్రాసు చేరే వరకు బ్రౌన్ తెలుగుకు అపరిచితుడు. 1824 వరకు తెలుగు సాహిత్యంపై పెద్దగా పట్టు సాధించలేదు. 1824లో బ్రౌన్ వేమన పద్యాలు ఫ్రెంచ్ అనువాదాన్ని చదివారు. లూయీ 15 గ్రంథాలయంలో ఆ పద్యాలతో తెలుగుపై అభిమానం పెంచుకుని పద్యాల వ్రాతప్రతులు సేకరించి 1829లో మొట్టమొదటిసారిగా 693 వేమన పద్యాలను అచ్చువేసారు. 1839లో వాటికి మరికొన్నింటిని చేర్చి 1164 పద్యాలు అచ్చువేసారు. ప్రజాశక్తి ఈ బ్రౌన్ పుస్తకాన్ని ప్రచురించింది. బ్రౌన్‌కి తెలుగు ప్రజల తరపున నివాళులర్పించింది. బ్రౌన్ తెలుగు ప్రజలకు వేమన పద్యాలను అచ్చురూపంలో అందించినా ఆనాటి బ్రాహ్మణవాదులు అందుకు అడ్డుకోను ప్రయత్నించారు. అచ్చువేసిన ప్రతులు చెత్తకుప్పల పాలయ్యాయి.

వేమనను తెలుగు పండితులు అధ్యయనం చేయడానికి మరో వందేళ్ళు పట్టింది. 1928లో అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన సదస్సులో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ విస్తృతంగా పరిశోధించి ప్రసంగించారు. ఆ తరువాతే అనేక పరిశోధనలు వెలువడ్డాయి. అయినా రాళ్ళపల్లి వేమనపై చేసిన పరిశోధన ఒక మైలురాయి. అందుకే రాళ్ళపల్లి పరిశోధనాగ్రంథాన్ని ముద్రించింది ప్రజాశక్తి బుక్‌హౌజ్.

రాళ్ళపల్లి తరువాత అంతటి కృషి చేసింది గోపి. ఆయన మాటల్లోనే 'వేమన ఒక తాత్విక విజ్ఞాన సర్వస్వం, సకల సామాజికానుభవ స్వారస్యం... రాతిబాటల్లో జాతిరత్నాలు వెదజల్లిన అపురూప మహాకవి వేమన. నీతుల నీరవిధులు పొంగించిన సామాజిక ప్రవక్త. సుదీర్ఘ రోగానికి చేదు మందులిచ్చిన వైద్యుడిగా, తీరాన్ని గానం చేసిన నావికుడిగా వేమన మనకు సాక్షాత్కరిస్తాడు". అందుకే గోపి రాసిన పరిశోధనా గ్రంథం 'ప్రజాకవి వేమనను, అందుకు ధీటైన మరో గ్రంథం, 428 పద్యాలకు భాష్యం చెప్పిన గ్రంథం 'వేమన్న వెలుగులు' ప్రచురించాం.

వేమన పద్యం ప్రతి ఇంట పలకాలని వేమన మతోన్మాదాన్ని, సామాజిక రుగ్మతలను, చీల్చి చెండాడి,



# నింగి అంత ఎత్తుకు ఎదిగినవాడు

**- వి. పోతన్న**

వాస్తవికత వేమన కవితకు గంధం అద్దింది. ఆ గంధం వేమన కవితా వస్తువంతా విస్తరించి, సజీవ సత్యమై గుబాళించింది. సామాజిక దృష్టిలో, కవితా సృష్టిలో నింగి అంత ఎత్తుకు ఎదిగినవాడు వేమన. వేల సంఖ్యలో ఉన్న వేమన పద్యాలలో దేన్ని పలకరించినా స్థూలంగా 'రెండు' మాటలే చెబుతుంది– 1. సమభావం. 2. సామ్యవాదం. ఆ భావం, ఆ వాదం జాతిపురోభివృద్ధికి ఆధారంగా కనిపిస్తుంది. హెచ్చు తగ్గుల సమాజాన్ని సమభావంతో 'సదను' చేసీ; ఎత్తు జిత్తుల పైఎత్తుల మనస్తత్వాలను రూపుమాపీ, ప్రగతివాదంతో సాగిపోవాలని వేమన పద్యాలు చెబుతాయి. వేమన పద్యాలు చదివితే చిత్రకారుడైతే ఆ భావచిత్రం కనిపిస్తుంది. ఒక శిల్పాచార్యుడైతే ఒక శిల్పం కనిపిస్తుంది. కవైతే సాహిత్యం కనిపిస్తుంది. గాన కళాకారుడైతే ఒక అద్భుతమైనటువంటి వీణానాదం వినిపిస్తుంది. ❋



# ఒకే ఒక్క వేమన

**- మల్లెల నరసింహమూర్తి**

వేమన కవి యోగి పుట్టి పెరిగిన కరువు నేల రాయలసీమలోని అనంతపురం జిల్లాలో వేమన సాహిత్యంపై భిన్న సమాలోచనల సమాహారంగా ఒక చారిత్రాత్మక బృహత్సభ నిర్వహించబడింది. సుప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారి ఆధ్వర్యంలో తెలకపల్లి రవి అధ్యక్షతన, పిళ్ళా కుమారస్వామి కార్యనిర్వహణలో సాహితీస్రవంతి నేతృత్వంలో జరిగింది. రాష్ట్రం నలుమూలల నుండి ఎందరో ప్రసిద్ధ సాహితీవేత్తలు సభలో పాల్గొన్నారు. అనేకమంది కవులు, రచయితలు, కళాకారులు, సాహితీప్రియులు, ప్రజాభ్యుదయ, ప్రగతిశీల స్వచ్ఛంద సంస్థలు అత్యుత్సాహంతో పాల్గొన్నారు. వేమన సాహిత్యంపై దాదాపు నాలుగు దశాబ్దాల కృషి చేసి అనేక గ్రంథాలు రచించి 'వేమన గోపి' గా పేరుపొందిన ప్రఖ్యాత కవి, విశ్రాంత ఉపకులపతి ఆచార్య ఎన్. గోపి పాల్గొని కీలకోపన్యాసం చేశారు. ఆయన తెలంగాణ నా జన్మభూమి, తెలంగాణ నా కర్మభూమి అంటే తనకే వేమన సాహిత్య అధ్యయనానికీ గల సుదీర్ఘ సాన్నిహిత్యాన్ని, సాహిత్యానుబంధాన్ని వివరించారు. ❋

నీతిబోధనలు చేసిన పద్యాలను తాత్పర్యాలతో 'నిత్య సత్యాలు వేమన పద్యాలనే పుస్తకాన్ని ప్రచురించాం. జన విజ్ఞాన వేదికలో క్రియాశీల పాత్ర పోషిస్తున్న కె. ఎల్. కాంతారావు గారు, ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ కె. ఉషారాణి దీన్ని రూపొందించారు.

ఇవికాక, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు ఈ సదస్సు కోసం ప్రత్యేకంగా 19 మంది కవులు,విమర్శకుల చేత వ్రాయించిన వ్యాసాలకు సంపాదకత్వం వహించి మాకు ఎంతగానో ఉత్సాహాన్నిచ్చారు. ఈ సంకలనంలో వేమనను అనేక పార్శ్వాల నుంచి పునర్మూల్యాంకనం చేసారు. వేమనపై పరిశోధనలు చేసిన కవులు. దీన్ని ప్రచురించడం మాకెంతో గర్వకారణం. ఆ పుస్తకం పేరు 'వైతాళికుడు వేమన'.

ఇవే కాకుండా రకరకాల పత్రికలలో వచ్చిన వ్యాసాలు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి సంపాదకత్వంలో ఎనిమిది పుస్తకాల రూపం ధరించాయి. ఇవి 1. వేమన కవిత్వం – ఇతర తత్వవేత్తలు 2. వేమన కవిత్వం – విశ్వ మానవత 3. వేమన కవిత్వం – సామాజికత 4. వేమన కవిత్వం – స్త్రీ 5. వేమన కవిత్వం – తాత్వికత 6. వేమన కవిత్వం – ఇతర భారతీయ కవులు 7. వేమన కవిత్వం – ప్రాదేశికత 8. వేమన – వీరబ్రహ్మం – ఒక సంభాషణ

సమాజంలోని అన్ని పార్శ్వాలను వేమన పద్యాలలో మనం చూడగలం. ఆనాటి, ఆ తరువాత కాలంలో కూడా బుద్ధుడు, తిరువళ్ళుయర్, కబీరు, వీరబ్రహ్మం, సర్వజ్ఞుడు, వివేకానందుడు, రవీంద్రుడు, గురజాడ వంటి అభ్యుదయవాదులు, ఆలోచనాపరులు విజ్ఞులు సమాజహితం కోరి ప్రజలను చైతన్య పరిచారు. వారితో వేమన తులనాత్మక పరిశోధనలు ఎంతో ఉపయోగమైనవిగా భావిస్తున్నాం. ఎంతో శ్రమకోర్చి రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ఈ బాధ్యతను స్వీకరించి మాకు సహకరించారు.

వేమనపై ఇంకా ఎంతో పరిశోధన చేయాల్సి ఉంది. ఇప్పటికి వెలువడిన పరిశోధనలలో మైలురాయిగా నిలిచిన వాటిని ఈ సందర్భంగా ప్రచురిస్తున్నాం. ఇవన్నీ ముందు ముందు పరిశోధనలు చేసేవారికి సహకరిస్తాయని ఆశిస్తున్నాం. పాఠకులు వేమన్న అందించిన వేయి వెలుగులను అందుకుని తెలుగునాడును మణిదీపాలతో నింపాలని ఆశిస్తున్నాం. ◆

# అనంతపురంలో ఒక అద్భుతమైన దినమిది



- శాంతినారాయణ

అనంతపురంలో ఒక అద్భుతమైన దినమిది. ఇటీవల కాలంలో ఇంత పెద్ద సాహిత్య సభ అనంతపురంలో మనం చూడలేదు. వేమన గొప్ప ప్రజాకవి అనడానికి ఈ రోజు ఇక్కడ జరుగుతున్న ఈ సభే నిదర్శనం. వేమన ఒక గొప్ప తత్వవేత్త. ఒక గొప్ప భౌతికవాది. తెలుగు జాతి అంతా, తెలుగు జాతే కాదు మొత్తం ప్రపంచంలో వుండే భౌతికవాదులంతా గర్వించదగిన మహాకవి. నేనెందుకామాట అంటున్నానంటే బుద్ధుని యొక్క తాత్విక సారాన్నంతా కొద్ది పద్యాలలో అత్యద్భుతంగా చిత్రించినటువంటి మహాకవి ఆయన. 'భూమిలోన బుట్టు భూసారమెల్ల.. తనువులోన బుట్టు తత్వమెల్ల.. శ్రమములోన బుట్టు సర్వంబు తానౌను.. విశ్వదాభిరామ వినుర వేమా!'– మొత్తం శ్రమలోనే ఈ అభివృద్ధి అంతా. ఈ సమాజంలో మనం ఉపయోగించుకుంటున్నటువంటి సమస్తమూ శ్రమలోంచే పుడుతుందని చెప్పేసి మహోన్నతమైన పద్యాలు రాసిన మహాకవి. అందుకే నాకు ప్రాచీన కవులలోనే కాదు మొత్తం సాహిత్యలోకంలోనే వేమన అంటే అమితమైన ఇష్టము. 'కులము గల్గువాడు గోత్రంబు గలవాడు.. విద్యచేత విర్రవీగు వాడు... పసిడి గల్గు వాని బానిసకొడుకులు... 1650 ప్రాంతంలోనే ఆర్థిక సంబంధాల గురించి అన్ని సంబంధాలు ఆర్థిక సంబంధాలే అని తర్వాతెప్పుడో కారల్‌మార్క్స్ చెప్పదలుచుకున్న విషయాల్ని 'పసిడి గల్గు వాని బానిస కొడుకులు' అని అత్యద్భుతంగా చెప్పినటువంటి మహాకవి ఆయన. వేమన అంటే ఒక నిరసన, వేమన అంటే ఒక ప్రశ్న. ఎంతగాటుగా ప్రశ్నిస్తాడంటే ఆ ప్రశ్నకు సమాధానాలు 1650లో ఆయన సంధిస్తే ఈనాడు కాదుగదా ఇంకా వెయ్యి సంవత్సరాలకు కూడా ఆయన ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేని స్థితి మనది. 'పిండములను బెట్టి పితరులను తలపోసి... కాకులకును బెట్టు గాడ్దెలారా! మొత్తం పిండాలు బెట్టే వ్యక్తులందర్నీ గాడ్దెలన్నటువంటి ధైర్యనంవన్నుడు వేమన్న. అందుకే ఆయన్ను తలయెత్తనీకోకుండా ఆయన సాహిత్యాన్ని తలయెత్తనీకోకుండా ఈ సమాజంలో ఒక భావజాల కవులు చేశారు. మరి పనికిమాలిన సాహిత్యమంతా వచ్చింది 15, 16, 17 శతాబ్దాలలో. అంతా క్షుద్ర సాహిత్యమొచ్చింది. కుప్పలుతెప్పలుగా ఆ క్షుద్ర సాహిత్యమైతే వచ్చింది కానీ సి.పి. బ్రౌన్ అనే ఒక వ్యక్తి తన ప్రభుత్వ ప్రయోజనాలకోసమైనా పరోక్షంగా ఆయన పద్యాలను వెలుగులోకి తీసుకురాకుండా ఉండి ఉంటే ఈ రోజు వేమనను గురించి ఇంత అద్భుతంగా చెప్పుకుని ఉండేవాళ్ళం కాదు. అటువంటి మహాకవి సమాలోచనను ఈ రోజు ఇంత అత్యద్భుతంగా ఏర్పాటు చేసినటువంటి కార్యనిర్వాహకులకు ధన్యవాదాలు చెప్పకుండా ఉండలేను. ముఖ్యంగా ఈ మొత్తం కార్యభారాన్ని తన భుజస్కందాల మీద వేసుకున్నటువంటి మిత్రులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారైతేనేమి, తెలకపల్లి రవిగారు వారి టీం అంతటినీ నేను అభినందిస్తున్నాను.




# మహాకవి కాక మరేమవుతాడు?

- షేక్ హుస్సేన్ సత్యాగ్ని

నేను మహమ్మదీయుడినైనా నన్ను చేరదీసి, తెలుగు సాహిత్యం మీద మక్కువ ఎక్కువ చేసి, ఏదైనా సాహిత్యంలో నాకూ తెలుసు అని మీరభిప్రాయపడితే అది కేవలం మహాకవి సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యుల వారి భిక్ష. నేను ఆయన అంతేవాసిని. ఆయన దగ్గర చదువుకున్నాను. ఆయన్ను స్మరించుకుంటూ ఐదు నిమిషాలు ఇంకా తక్కువ మాట్లాడమన్నా నాకేమీ అభ్యంతరం లేదు. ఏదైతే ప్రసంగాలలో నేను చెప్పాలనుకున్న పద్యాలన్నీ పొద్దున్నుంచీ ఆ కళారూపాల్లో అన్నింటినీ పాడేశారు. చక్కగా అన్ని పద్యాలూ వారు విశదంగా చెప్పారు. అయినా నాలుగు వందల సంవత్సరాల క్రితం వేమన తన సాహిత్యాన్ని ప్రజలకు ప్రజల కోసం ప్రజలకై రచించి వాళ్ళ లోగిళ్ళలో వదిలిపెట్టి పోయినదాన్ని పుస్తకరూపంలో గాని, లేకపోతే ఆ సాహిత్యాన్ని ఆదరించిన దాఖలాలు గాని చరిత్రలో లేవు. 1829లో ఒక ఇంగ్లీషు ప్రభువు సి.పి. బ్రౌన్ కడప జిల్లాకు వచ్చి ఆంధ్రప్రదేశ్ నాలుగు చెరగులా ఉన్నటువంటి వేమన పద్యాలను అన్నింటినీ క్రోడీకరింపజేసి ఒక పుస్తకంగా వేసినంత వరకు మనకు వేమన గురించినటువంటి ఉనికి అంత బాగా తెలియదు. నాకు తెలిసి కారణం నేననుకుంటున్నాను కాకపోతే నేను పరిశోధక విద్యార్థిని కాదు. ఇది కేవలం నా భావన కావచ్చు. వాస్తవమూ కావచ్చు. ఆనాడు వేమన పద్యాలను గురించి ప్రభువు కానీ, ఆ పాలకులు కానీ లేకపోతే ఆనాడు సాహిత్యం మీద ఆధిపత్యం వహిస్తూ ఉన్నటువంటి ఒకే ఒక మతము కానీ వాటిని ఆదరించి అక్కున చేర్చుకున్నటువంటి దాఖలాలు లేవు. అందుకోసమే వాళ్ళ దృష్టిలో వేమన కవినే కాదు అని చెప్పి చలామణి చేసినటువంటి పరిస్థితులు ఉండినాయి అని నేను అభిప్రాయ పడుతున్నాను. సి.పి. బ్రౌన్ గారు గ్రంథాన్ని వేమన పద్యాలను తొలిప్రతిగా తీసుకొచ్చిన తరువాత వంద సంవత్సరాలకు సరిగా కట్టమంచి రామలింగారెడ్డి గారు జోక్యం చేసుకొని అనంతపురం వాసియైనటువంటి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ చేత ఆయన మీద ఉపన్యాసాలు ఇప్పించి వేమనను వెలుగులోకి తీసుకొని రావడం జరిగింది. మరి ఈ రోజు వేమన ఆంధ్రరాష్ట్రంలో నాలుగు చెరగులా ఎక్కడ చూసినా వేమన వేమన వేమన పద్యాలని చెప్పేసి ఎందుకంటున్నారు అంటే వేమన ఈ సమాజంలో ఉన్నటువంటి చెడును అంతా మొదలంటా నరికిపారేయ్యడం కోసం ప్రయత్నం చేసినాడు ఆయన తన సాహిత్యంలో. ప్రజల భాషలో ప్రజలకు అవసరమైనటువంటి వస్తువును సాహిత్య రూపంలో అందజేసినటువంటి వ్యక్తి మహాకవి కాక మరేమవుతాడు? 'కనకమృగము భువిని కద్దు లేదనలేక... తరుణి విడిచిపోయే దాశరథియు... తెలివిలేని వాడు దేవుడెట్లాయెరా?' శ్రీరామచంద్రుడినే ఆ రోజు డైరెక్టుగా ప్రశ్నించినాడు వేమన్న. కనక మృగము భువిలో లేదని తెలుసు అందరికీ. చాలా చిన్న పిల్లవానికి కూడా తెలిసి ఉన్న విషయము అది. మరి నువ్వేమో పోయి కనకమృగాన్ని తెస్తానని పోయినావు. నిన్ను మేమంతా దేవుడని చెప్పినాము. ఇది వాస్తవమే కదా అని ఇప్పుడు ప్రశ్నించేటటువంటి పరిస్థితి నేడు సమాజంలో తలెత్తడానికి కారణము వేమన లాంటి వారు.



# వేమన ఇప్పటి అవసరం

**- రాజారాం**


వేమనను అనేక రకాలుగా మూల్యాంకనం చేసి ఉండవచ్చు. జర్మనీ భాషలో ఒక గోథే. ఇంగ్లీషు భాషలో ఒక షేక్స్పియర్. మరాఠీలో ఒక జ్ఞానేశ్వరుడు. తమిళంలో ఒక తిరువళ్ళువర్. బెంగాలీలో ఒక రవీంద్రుడు ఎట్లానో తెలుగువాళ్ళకు కూడా వేమన అట్లా అని నేననుకుంటాను. అందుకే తెలుగు రాష్ట్రాల్లో వానకు తడియని వాడు వేమన పద్యం విననివాడు లేడని ఒక ఆలోచన వ్యాప్తి చెందింది. తెలుగు సాహిత్యానికి, తెలుగు పద్యానికి, తెలుగు కవిత్వానికి ఖండఖండాంతరాలలో ఖ్యాతి తీసుకువచ్చింది ఒక వేమన మాత్రమే.

వేమన కేవలం ఒక సాహిత్యకారుడిగానే పరిమితమైనవాడా? అంటే కాదంటాను నేను. సమూల సామాజిక పరివర్తన కోరుకునే వారందరికీ వేమన ఒక స్ఫూర్తి. కుల నిర్మూలన జరగాలని, మతములన్నియు మాసిపోయి జ్ఞానమొక్కటి నిలిచిపోవును అన్న వారందరికీ వేమన్నను మించిన స్ఫూర్తి కేంద్రం ఏమైనా ఉందా అనేది నా ప్రశ్న. అందుకే వేమన ఇప్పటి అవసరమని నేనంటాను. సమకాలీన సమస్యల పరిష్కారానికి వేమన ఇప్పటి అవసరం. వేమన ఎప్పుడు పుట్టాడు? ఆయన కాలం ఏంటి? ఇదమిద్ధంగా ఏ పరిశోధకుడూ తేల్చి చెప్పలేదు గానీ, ఒక ఐదారు, పది సంవత్సరాలు అటో ఇటో 17వ శతాబ్దం వాడు వేమన అని చెప్పారు. వేమనని కడప జిల్లా వాసిగా కొంతమంది పేర్కొన్నారు. వేమన తన సమకాలీన సమాజం ఎలా ఉందో చెప్పాడు కానీ, తన కాలపు సమాజం తనను గురించి ఏమనుకుంటుందో మాత్రం చెప్పలేదు. ఆయన గురించి మొట్టమొదట ఈ ప్రపంచానికి తెలియజేసిన ఫ్రెంచ్ క్యాథలిస్టు ఎ.ఎ. దుబే. ఆయన తాను రాసినటువంటి ఒక పుస్తకం 'హిందూ కస్టమ్స్, మ్యానర్స్ అండ్ సెర్మనీస్‌లో వేమనని ఆధునిక తత్వవేత్తగా అభివర్ణించారు. ఇది 18వ శతాబ్దం వేమన గురించి చేసిన అంచనాగా భావించవచ్చు. ఈ పుస్తకం ద్వారా వేమనను గురించి తెలుసుకున్నటువంటి బ్రౌన్ తాను సేకరించినటువంటి పద్యాలను రాసుకున్న ముందుమాట 1866లో, 1840లో వేమన గురించి చేసినటువంటి సాహిత్య ప్రస్తావనల్లో ఆయన గురించి కొన్ని తెలుస్తాయి. వేమన పద్యాలను మోరల్, సెటైరికల్ అండ్ మిస్టికల్ వర్సెస్ అని చెప్తాడు. మిస్టికల్ పద్యాల పట్ల కొంచెం ఆరాధన కనపడుతుంది. సంస్కారరహితమైన అంధకారంలలో మచ్చుపడ్డ సత్యజ్యోతిని అన్వేషిస్తున్న ఒక శక్తివంతమైన మనస్కుడి పద్యాలు' అని వేమన పద్యాలను గురించి బ్రౌన్ వ్యాఖ్యానిస్తాడు. 1866లో రాసినటువంటి సాహిత్య ప్రస్తావనల్లో వేమనని నీతిసూత్రకారుడైన ఒక గ్రామీణుడు అని అంటారు. 19వ శతాబ్దంలో చూసేటప్పటికి బ్రౌన్ వేమనని ఒక నీతి కవిగా భర్తృహరి, తిరువళ్ళువర్, సుమతీ శతక కారుడు మున్నగువాళ్ళతో సమానంగా పోలుస్తాడు. కానీ 20వ శతాబ్దం వేమనని ఎట్లా అర్థం చేసుకుంది. వేమనని ఎట్లా ఆవిష్కరించుకుంది అంటే డా॥ కట్టమంచి రామలింగారెడ్డి గారు మూల్యాంకనం చేసారు. వేమనని సోషల్ ప్రొటెస్ట్ కవిగా సమాజం అంగీకరించిందని చెప్పారు. 1908లో కట్టమంచి వారు చేసిన ఒక ప్రసంగంలో వేమనని సంఘసంస్కర్తగా అభివర్ణించారు. మహాకవి శ్రీశ్రీ వేమనని తిక్కనతో సమానమైన సాహితీ ప్రతిపత్తి కలిగిన వాడుగా తిక్కన్నకు సమానమైన స్థానాన్ని కల్పించాడు. తిక్కన, వేమన, గురజాడలను తన కవిత్రయంగా పేర్కొన్నాడు. 20వ శతాబ్దంలో ఎన్ని పుస్తకాలొచ్చినా, ప్రచురించబడినా, పరిశోధనా పత్రాలు సమర్పించబడినా, ఎన్నో వాదవివాదాలొచ్చినా వేమన్నను సంఘ విమర్శ చేసిన కవిగానే , ధిక్కార స్వరంగానే ఈ సమాజం అంగీకరించింది.

## ఇది గొప్ప ప్రయత్నమే!

**- ఏలూరు యంగన్న**


గత నెల అంటే ఏప్రిల్ 30న క్షామములెన్ని వచ్చినా, జ్ఞానామృత వృష్టికిన్ కొఱతనందని మా అనంత ఆత్మీయ వేదికగా తొలిసామాజిక శస్త్ర వైద్యుడు - పాశ్చాత్యులు సైతం (ప్రపంచమే) గుర్తించిన ప్రప్రథమ ప్రజాకవి-వేమన సాహితీ సమాలోచన - రాష్ట్ర సదస్సు నిర్వహింపబడటం శుభోదకరం. "విశ్వదాభిరామ వినుర వేమ!" అనే మకుటం బ్రతుకుబాట - పాటకు పల్లవియే విశ్వాంతరాళం ప్రతిధ్వనించేలా నినదించిన ఏనిగళాలు లేని వేమన గళం 'నిజంయిజం'ని నిర్భయంగా చాటి చెప్పింది. మిసమిసలాడే మేడిపండు సంఘం గుట్టును చక్కగా విప్పింది. వేమన సదాసంచారియై ప్రజాప్రస్థానంగావిసర్తూ.. అక్కడక్కడ తాను చూసిన సంఘటనలకు తక్షణం స్పందిస్తూ.. అశువుగా - అలవోకగా వేలకొలది ఆటవెలది పద్యాలను చెప్పినట్లు తెలుస్తుంది. ఆయన వదన గవ్వార గంగోత్రి నుండి వెలువడిన వెలుతురు చినుకులే ఆణిముత్యాలై - అజరామర అనర్ఘ పద్యరత్నాలై నాటికి - నేటికీ - ఏనాటికీ ప్రజానుంరంజకంగా ప్రతిధ్వనిస్తూ... ప్రభాసిస్తుంటాయి. వేమన తన చుట్టూ ఆవరించి వున్న సమకాలీన సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు, తనవంతు పవిత్ర కర్తవ్యంగా రసగుళికల వంటి ఆటవెలది



పద్యాలు, అవే పెక్కుమందికి మింగుడు పడని 'చేదుమాత్రలు" అందించాడు - అవి శాశ్వతంగా సామాజిక సర్వరోగ నివారిణి మాత్రలుగానే మిగిలిపోవడం విశేషం!

ఏమైతేనేం, ఎందరికో స్ఫూర్తి పంచిన - మహిత మానవతా వాదాన్ని పెంచిన వీరి 'జనకవన జైత్రయాత్ర' ను గూర్చి ఈ కరువుసీమలో మరొక్కసారి మనమందరం నెమరు వేసుకొనేలా చేసిచూపిన మహోదాశయులకు - పాల్గొన్న మేధావి మహాశయులకు, సభ ఆసాంతం ఆసీనులై వున్న వేమన పద్య ప్రియులెల్లరకు శ్రద్ధాసక్తులతో కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నా!!

❋



## నగ్నసత్యాల్ని ప్రచారం చేశాడు

**- సడ్లపల్లె చిదంబరరెడ్డి**

వేమనను అందరూ ప్రజాకవి అని ప్రచారానికి తెచ్చారు. నిజంగా అతను కవికాదు!! కవి అన్నాక కవిత్వము, కాల్పనికత, పదాడంబరం, మార్మికత....వగయిరా భాషా భేషజాలుంటాయి. కాని అతని రచనల్లో అలాంటివేవీ కనిపించవు. పురాతన తరాల నుండీ సమాజంలో కుప్పలు తెప్పలుగా పేరుకు పోయిన అశాస్త్రీయ భావాలయిన అంధవిశ్వాసాలు, కుల, మత, ఆర్థిక, ఆధిక్యతా ధోరణులను సామాన్య ప్రజల భాషలో అరటిపండు వొలిచి నోటికి అందిచ్చినట్లు చెప్పాడు. అంతవరకూ రాజ్యమేలుతున్న భావజాలానికి, దానికి పల్లకీలయిన రాజ్యవ్యవస్థకూ ఏమాత్రం భయపడక నగ్నసత్యాల్ని ప్రచారం చేశాడు. ఒక్క సారి చదవగానే మనస్సులో నాటుకు పోయేలా, పెదాల పై అక్షరాల ముద్రలయ్యేలా అలతి పద పద్యాల శిల్పాల్ని తన వాడి ఐన కలంతో చెక్కాడు. గాలిలో ప్రాణ వాయువు లాగా తెలుగు భాష వున్నంత వరకూ విశిష్ట నానుడులుగా ఏ యుగంలో అయినా, ఏ ప్రాంతంలో అయినా ఆచరణ యోగ్యంగా, విశ్వస్మరణీయ సంపదగా అందించి పోయాడు.

అతను కొన్ని వందల యేళ్ల నాడు అప్పటి అసహజ సమాజాన్ని చూసి అసహ్యించుకొని రాసినా! అప్రజా స్వామిక, అక్షరశూన్య, రాచరిక, పాలెగాళ్ల వ్యవస్థలో అవి ఏ స్థాయిలో ఉండేవో మనకు తెలియదుకానీ... "ఆధునిక యుగము" "శాస్త్రీయ విద్యాభ్యాసము" అని చంకలు గుద్దుకొనే ప్రస్తుత అక్షరాస్యతా సమూహంలో అక్షర సత్యాలై దురాచారాలెన్నో మన ముందు దర్శన మిస్తున్నాయి. వాటి ఆధారంగానే అందలాలెక్కి అందరి ప్రయాణాన్నీ అంధకాలం వైపు దారి మళ్లిస్తున్నాయి!! వేమన్న పద్యాల్ని వల్లె వేయడం, బాగా పాడించి బహుమతులు ప్రధానం చేయడం కాదు మనం చేయవలసింది!! అతను ఎత్తి చూపిన దురాచారాల్నీ, చాందసాల్నీ, చచ్చువేదాంతాల్నీ, పుచ్చు వైరాగ్యాల్నీ తమ జీవితాల్నుండి తరిమి వేసి ప్రతి ఒక్కరూ విశ్వమానవత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్నీ తమ బతుకుల్లోకి ఆహ్వానించి ఆచరించి చూపాలి!! చదువరి ఐన ప్రతి వ్యక్తీ వేమన్నలా మనుష్యుల, ప్రాంతాల, రాష్ట్రాల, దేశాల మధ్యనున్న సరిహద్దు రేఖల్ని తుడిపివేసి విశ్వకుటుంబం వైపు అడుగులు వేయాలి!!

❋

# నేటికీ వేమనకు ప్రజాదరణ

- వై.వి. మల్లారెడ్డి
డైరెక్టరు, ఎకాలజీ సెంటరు, అనంతపురం



వేమన సాహితీ సమాలోచన చాలా అర్థవంతంగా జరిగింది. నేను మొదట చదివినది వేమన శతకం. తరువాత సుమతి శతకం. ఈ రెండు శతకాలు నాపై చాలా ప్రభావం చూపినాయి. నా ఎదుగుదలలో, ప్రవర్తనలో నాకు నేటికీ ఆలంబనగా నిలిచినాయి. ఈ వేమన సాహితీ సమాలోచన సదస్సుకు ఉత్సాహంగా హాజరైనాను. ఈ సమాలోచనలో అనేక మంది ప్రముఖ కవులు, కళాకారులు, అభ్యుదయవాదులు, పౌరసంస్థలు, ముఖ్యంగా సాధారణ ప్రజలు ఊహించినదానికంటే ఎక్కువ మంది ఉత్సాహంగా పాల్గొని నేటికీ వేమన వాదానికున్న ప్రజాదరణను చాటి చెప్పారు. వేమన పద్యాలపైన ప్రముఖ కవులు డా॥ ఎన్.గోపి గారు, డా॥ కొలకలూరి ఇనాక్ గారు, డా॥ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు, తెలకపల్లి రవి గారు మొదలగు వారి విశ్లేషణలు చాలా లోతుగా అర్థవంతంగా నన్ను ఆకట్టుకున్నాయి. వేమన తత్వం దాదాపు నాలుగు వందల సంవత్సరాల క్రితం నుండి ఇప్పటి వరకూ సజీవంగా వుందని, అంతేకాదు మానవజాతి వున్నంత కాలం సజీవంగా ఉంటుందనే భావన నాకు కలిగింది. కార్ల్‌మార్క్స్, ఏంగెల్స్ వంటి కమ్యూనిస్టువాదులు పుట్టక శతాబ్దాల ముందే సాంఘిక సమానత్వం, సమన్యాయం వంటి అభ్యుదయ భావాలను ఆయన చక్కగా, అరటిపండు ఒలిచి పెట్టినట్లుగా సాధారణ ప్రజలలోనికి తీసుకెళ్లినారు. ఇది నాకు చాలా ఆశ్చర్యం కల్గించిన అంశం. ఆనాటి నుండి నేటి వరకు సమాజంలో వున్న కులసంస్కృతి, సాంఘిక అసమానతలలు, దురాచారాలు, ఉచ్చ, నీచ భావాలు వంటి సామాజిక రుగ్మతలను ఆనాడే కడిగి పారేసినారు. సామాజిక స్పృహ, సర్వమానవ సమానత్వం, సౌభ్రాతృత్వం, వసుధైక కుటుంబం లాంటి నేటి అభ్యుదయ భావాలను ఆనాడే ఆయన ఆవిష్కరించారు. బహుళ అంతస్థుల సమాజాన్ని ఆ కాలంలోనే ఆయన తిరస్కరించారు. కులం కన్న గుణం గొప్పదనాన్ని చాటి చెప్పినారు. అంతేగాక సాధారణ ప్రజలకు ఉండవలసిన 'లౌకికజ్ఞానా'న్ని ఆ కాలంలో ప్రచారం చేయడం ఒకటైతే ఆ 'లౌకికం' ఈనాటికీ సజీవంగా అంత ప్రాధాన్యతతో అర్థవంతంగా విలసిల్లుతుండడం మరీ ఆశ్చర్యం. ఈ కార్యక్రమాన్ని ఇంత ఫలప్రదంగా నిర్వహించిన సాహితీ స్రవంతికి ధన్యవాదాలు. ❋

---

# చెరగని ముద్ర వేసింది - ఆర్. శశికళ

పిళ్ళా కుమారస్వామి ఆహ్వాన ప్రసంగంతో సభ ఆలస్యంగా ప్రారంభమైనా బాగా జరిగింది. విజయవంతమైంది. పుస్తకావిష్కరణలు, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకుల మనసులో చెరగని ముద్రవేశాయి. ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు, మేడిపల్లి రవికుమార్ గారు, డా॥ ఎన్. గోపి గారు, వి. పోతన్న, మేడిపల్లి రవికుమార్ గారి ఆలోచనలు, ప్రతిపాదనలు ప్రస్తుత పరిస్థితిని ప్రతిబింబింపజేశాయి. వినూత్న ధోరణిలో ప్రజాకవి వేమన సాహిత్యం ప్రచారం చేయాలనే భావనను వక్తలు ప్రతిపాదించారు. మూఢనమ్మకం, అంధవిశ్వాసాలపై తిరుగుబాటు చేసిన, శాస్త్రీయమైన ఆలోచనలను ప్రతిపాదించిన, ప్రచారం చేసిన వేమన సాహిత్యం ఎప్పటికీ సజీవంగా ఉంటుంది. ఆయన సాహిత్యంపై పరిశోధనలు చేసిన డా॥ ఎన్. గోపి గారి పుస్తక పరిచయం, విజ్ఞానం, అందులోని శ్రమ గురించి తెల్సుకొన్నాను. ప్రైవేటు విద్యకోసం, వైద్యం కోసం ప్రజలంతా ఎంతో కష్టపడుతున్నారు. అవి వారికి మూలస్తంభాలై వేధిస్తున్నాయి. కష్టపడి పనిచేసుకునే వాళ్ళు ఇప్పటికీ తమ రోగాలు బాగుచేసుకోవడానికి స్వామీజీలను, తాయెత్తులను ఆశ్రయిస్తున్నారు. అనంతపురంలోనే స్వాములు, బాబాలు వీధివీధికీ వూరి వూరికీ ఉన్నారు. జనవిజ్ఞాన వేదిక వంటి సంస్థలు ఈ మూఢవిశ్వాసాలను పారద్రోలటానికి ఎంతో కృషిచేస్తున్నాయి. సాంస్కృతిక చైతన్య యానంలో భాగంగా ఇటువంటి సదస్సులు జరగటం హర్షణీయం. రచయితలు, విద్యావంతులు, ఎందరో ఉపాధ్యాయులు, మేధావులు, విద్యార్థులు, కళాకారులు పాల్గొన్న ఈ సదస్సు ప్రేక్షకులకు స్ఫూర్తినిచ్చింది. నిర్వాహకులకు అభినందనలు.

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**





సదస్సు ప్రారంభానికి ముందు అనంతపురం పట్టణంలోని వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎస్. గోపి, తెలకపల్లి రవి, గేయానంద్, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి

సదస్సుకు ఆహ్వానం పలుకుతున్న కార్యకర్తలు





గేయాలాపనతో సభికులను ఉత్తేజపరిచిన ప్రజానాట్యమండలి గాయక బృందం

భారీగా హాజరైన వేమన అభిమానులు






సభికులను ఆద్యంతం కట్టిపడేసిన 'వేమన' రూపకంలోని దృశ్యం

వేమన రూపకంలో భాగంగా కళాకారుల నృత్య ప్రదర్శన








వేమన సదస్సుకోసం ఆటో ప్రచారం

సదస్సు ప్రాంగణంలో ప్రజాశక్తి బుక్‌హౌస్ పుస్తక ప్రదర్శన

వేమన సదస్సు విజయవంతం చేయడానికి కృషిచేసిన కార్యకర్తలతో రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, పిల్లూరు యంగన్న, పెన్నా కుమారస్వామి, రవిచంద్ర, ఎం. ప్రగతి, వై. సూర్యనారాయణ రెడ్డి, అంజనేయులు, నాగేంద్ర కృష్ణవేణి, లక్ష్మీదేవి, రమేష్, లక్ష్మారెడ్డి, రాయుడు, సురేష్, ఉమర్ ఆలీషా మురళి, నాసీం నాగేంద్ర తదితరులు

SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.H/SD/415/16-18
Date of Posting : 02.06.2017 ▪ Date of Publication: 27.05.2017




If Un delivered please return to: Prasthanam, C/o M.H. Bhavan, Plot No. 21/1,
Near RTC Kalyana mandapam, Azamabad, Hyderabad - 500 020. Ph: 040- 27660013, Cell: 9490099059